తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
28-9-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 239 పేజీలు: 10+4 వెల: 6.50
మహబూబ్‌నగర్
: fb.com/vaartha Digital
WWW.VAARTHA.COM
epaper.vaartha.com Published from Mahabubnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

## 'శత'క్కొట్టారు!

**కోహ్లి, గిల్ సెంచరీలు**

వెస్టిండీస్‌పై భారత్ ఘన విజయం



## 15 వేల రన్స్

అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యంత వేగంగా పరుగులు చేసిన విరాట్

సచిన్ రికార్డు బద్దలు

303 ఇన్నింగ్స్‌ల్లోనే 15 వేల పరుగులు

86వ సెంచరీ

7

## సర్జికల్ స్ట్రైక్‌కు పదేళ్లు

- ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపుతాం
- జీరో టాలరెన్స్ విధానం అమలు
- జనగణనలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలి
- డ్రగ్స్‌పై యువత పోరు ప్రశంసనీయం
- పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమివ్వండి
- మన్ కీ బాత్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ
- వారసత్వం నుంచి అవకాశాల వరకు ప్రస్తావన



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 27:** ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపుతామని ప్రధాని నరేంద్ర మోడీ స్పష్టం చేశారు. ఉగ్రవాదం విషయంలో భారత్ జీరో టాలరెన్స్ విధానాన్ని పాటిస్తోందని తెలిపారు. ఉగ్రవాదానికి బలమైన, నిర్ణయాత్మక ప్రతిస్పందన ఉంటుందనే విషయాన్ని భారత్ స్పష్టం చేసిం దని తెలిపారు. ఆదివారం నిర్వహించిన 'మన్ కీ బాత్' 138వ ఎపిసోడ్‌లో దేశ ప్రజలను ఉద్దేశించి ప్రధాని మోడీ ప్రసంగించారు. ఈ సందర్భంగా సర్జికల్ స్ట్రైక్ 10వ వార్షికోత్సవం, దేశ వారసత్వం, పర్యావరణ పరిరక్షణ, యువత, క్రీడలు, మహిళా సాధికారత, గ్రామీణ ఆర్థికాభివృద్ధి వంటి పలు అంశాలను ప్రస్తావించారు. సర్జికల్ స్ట్రైక్ జరిగి 10 సంవత్సరాలు పూర్తవుతున్న >>2

# ఎల్‌నినో.. పవర్రీ

## ముంచుకొస్తున్న విద్యుత్ సంక్షోభం!

- వర్షాభావం, బొగ్గు కొరతతో సతమతం
- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, కరెంట్ డిమాండ్
- ఇప్పటికే 19,543 మె.వా ఆల్‌టైమ్ రికార్డు
- మరోపక్క మూతపడుతున్న థర్మల్, జల విద్యుత్ కేంద్రాలు
- రానున్న రోజుల్లో మరింత గడ్డు పరిస్థితులు



**హైదరాబాద్, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కరెంట్ కష్టాలు ముంచుకొస్తున్నాయి. ఒకవైపు కరెంటు డిమాండ్ ఆల్‌టైమ్ హైకి చేరుతుంటే, మరోవైపు కీలక విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తికి బ్రేకులు పడుతున్నాయి. థర్మల్ ప్లాంట్లకు బొగ్గు కొరత, ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గి జల విద్యుత్ ఉత్పత్తిపై ప్రభావం చూపడంతో తెలంగాణ విద్యుత్ సంస్థలపై వత్తిడి పెరుగుతోంది. దీంతోఎక్స్ఛేంజ్‌లో రాష్ట్రవిద్యుత్ సంస్థలు కరెంట్‌ను అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నాయి. ఎల్‌నినోతో ఇప్పటికే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రాష్ట్ర విద్యుత్ సంస్థలు రానున్న రోజుల్లో కరెంట్ కష్టాలు మరింత పెరిగే అవకాశాలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతున్నాయి. దీంతో విద్యుత్ వినియోగం భారీగా పెరుగుతోంది. అదే స్థాయిలో తెలంగాణలో కరెంట్‌డిమాండ్ దూసుకెళ్తోంది.రికార్డు స్థాయిలో విద్యుత్ అవసరం పెరుగుతోంది.కానీ అదే సమయంలో విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు వరుస షాక్‌లు తగులుతున్నాయి. ఒకవైపు బొగ్గు కొరతతోథర్మల్ ప్లాంట్లు ఉక్కిరిబిక్కిరి అవుతుండగా, మరోవైపు వర్షాభావంతో జల విద్యుత్‌కు గండంగా మారింది. ఇప్పటికే రాష్ట్ర విద్యుత్ డిమాండ్ 19,543 మెగావాట్ల ఆల్‌టైమ్ హైని తాకింది. గత ఏడాది ఇదే సమయంలో నమోదైన 15,906 మెగావాట్లతో >>2

## 'పెద్ద'ల కసరత్తు



- ఇటు పట్టభద్రుల నియోజక వర్గాల అభ్యర్థుల ఎంపిక
- అటు గవర్నర్ కోటా అభ్యర్థిత్వాలపైన సమాలోచనలు
- నేడు ఢిల్లీకి సిఎం రేవంత్‌రెడ్డి, రేపు సిడబ్ల్యుసి సమావేశం
- నేటి నుంచే పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రకియ ప్రారంభం

**హైదరాబాద్,సెప్టెంబరు27,ప్రభాతవార్త:** పట్టభద్రుల నియోజకవర్గాల కోటాలో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపికపై కాంగ్రెస్ కసరత్తు తుది దశకు చేరింది. ఒక్కో నియోజకవర్గానికి మూడు పేర్లతో ప్రతిపాదనలను సిద్ధం చేసింది. ఖమ్మం-వరంగల్-నల్గొండ ఎమ్మెల్సీ పట్టభద్రుల నియోజకవర్గ ఇన్చార్జి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మహబూబ్‌నగర్ రంగారెడ్డి హైదరాబాద్ నియోజకవర్గ ఇన్చార్జ్ మంత్రి దామోదర్ రాజనర్సింహలకు అభ్యర్థుల వడపోతలను ఇప్పటికే పూర్తి చేశారు. పోటీకి ఆసక్తి చూపుతున్న ఆశావహుల నుంచి వారు దరఖాస్తులు స్వీకరించారు. మూడేసి పేర్లను ఎంపిక చేసి >>2

## బ్యాంకర్ల సమ్మె వాయిదా

**యూనియన్ల ప్రకటన**




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 27:** తమ డిమాండ్ల పరిష్కారానికి ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసేందుకు ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్‌తో అవగాహన కుదిరిన నేపథ్యంలో, ప్రతిపాదించిన మూడు రోజుల దేశవ్యాప్త సమ్మెను వాయిదా వేస్తున్నట్లు యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ఆదివారం ప్రకటించింది. డిమాండ్ల పరిష్కారానికి ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేసే అంశంపై ఐబిఎతో జరిగిన చర్చల్లో అవగాహన కుదిరిందని యూనియన్ తెలిపింది. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా చేపట్టాలని నిర్ణయించిన మూడు రోజుల సమ్మెను వాయిదా వేసినట్లు పేర్కొంది. స్కేల్4, ఆపై స్థాయి అధికారులకు పనితీరు ఆధారిత ప్రోత్సాహక పథకంపై చర్చలు ప్రారంభించేందుకు కేంద్ర ప్రభుత్వం, బ్యాంకు ఉద్యోగ సంఘాలు అంగీకరించాయి. యూనియన్లు వ్యక్తం చేసిన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, వాటిని >>2

## యుఎల్‌సిలకు లైన్ క్లియర్

- ప్రభుత్వం ఉత్తర్వులు
- అర్హత ఉన్న దరఖాస్తులన్నీ పరిష్కరించాలని ఆదేశాలు
- 22ఎ చిక్కుముడులను ఒక్కొక్కటిగా విప్పుతున్నాం
- సిఎం రేవంత్ రెడ్డి హామీలకు కార్యరూపం: మంత్రి పొంగులేటి



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,సెప్టెంబరు27:** కొన్ని దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యుఎల్‌సి) దరఖాస్తుల పరిష్కారానికి ప్రజా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం 2016లోనే యుఎల్‌సి కింద పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించేందుకు జీవో జారీ చేసినప్పటికీ, దానిని అమలు చేయకపోవడంతో వేలాది దరఖాస్తులు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండిపోయాయని తెలిపారు. ఫఫలితంగా ప్రజలు తమ భూములపై హక్కులు, లావాదేవీల విషయంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. ప్రజల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి సంకల్పానికి అనుగుణంగా సహచర క్యాబినెట్ మంత్రులతో చర్చించి 22ఏ సమస్యలకు ఫాస్ట్‌ట్రాక్ పరిష్కరించే దిశగా ప్రజా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. తెలంగాణ పట్టణ భూ గరిష్ఠ పరిమితి చట్టం (యుఎల్‌సి) కింద పాక్షికంగా క్రమబద్ధీకరించిన, క్రమబద్ధీకరించని కాలనీలకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి, అర్హత ఉన్న కేసులను నిబంధనల ప్రకారం క్రమబద్ధీకరించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. ఈ మేరకు గతంలో జారీ చేసిన జీఓ నం.455, 456, 747, 92 కింద వచ్చిన పెండింగ్ యుఎల్‌సి దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించే విధంగా ఆదివారం నాడు మెమో నం.48062/యుఎల్‌సి/ఏ1/2026-1ను >>2

## ఉప్పొంగిన గోదావరి



- భద్రాచలం వద్ద 43.10 అడుగులకు చేరిన నీటిమట్టం
- మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
- వరద గుప్పిట్లో పంట పొలాలు.. రైతుల ఆందోళన
- అధికారుల అప్రమత్తం

**భద్రాచలం, సెప్టెంబరు 27 ప్రభాతవార్త:** గోదావరి మరోసారి ప్రమాద ఘంటికలు మోగించింది. ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి భారీగా వరదనీరు తరలివస్తుండటంతో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం వేగంగా పెరిగింది. ఆదివారం ఉదయం 5 గంటలకు 39.20 అడుగులుగా ఉన్న నీటిమట్టం సాయంత్రం 5 గంటలకు 43.10 అడుగులకు చేరి 9.40 లక్షల క్యూసెక్కుల వరద నీరు ప్రవహించడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. దీంతో >>2

## కారు బానెట్‌పై 40 కి.మీ వేలాడుతూ..



**గుట్కా స్మగ్లర్‌ను పట్టుకున్న కానిస్టేబుల్**

5

## వాతావ'రణం'



- రాష్ట్రంలో 37 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రతలు
- అత్యధికంగా నల్లగొండ జిల్లాలో 36.9° నమోదు

**హైదరాబాద్, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:** తెలంగాణలో వర్షాలకు తాత్కాలిక విరామం ఏర్పడి వాతావరణం పొడిగా మారింది. రాష్ట్రంలోని ఎక్కువ ప్రాంతాల్లో వర్షాకాలం నుండి పొడి వాతావరణం వైపు పరిస్థితులు మారడంతో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. ఉదయం వేళల్లో వాతావరణం చల్లగా, ఆహ్లాదకరంగా ఉన్నప్పటికీ, పగటి సమయంలో ఎండ తీవ్రత >>2

## హైదరాబాద్-శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్ రూపు మారింది



- మన్ననూరు నుంచి పాతాళగంగ దాకా 55 కి.మీ
- కొత్త అలైన్‌మెంటుకు తాజాగా ప్రతిపాదనలు

**హైదరాబాద్,సెప్టెంబరు27,ప్రభాతవార్త:** హైదరాబాద్ నుంచి శ్రీశైలం వెళ్లే జాతీయ రహదారి (ఎన్‌హెచ్765)పై ప్రతిపాదించిన ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టు రూపురేఖల్లో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. నల్లమల అటవీ ప్రాంతంలో గతంలో ప్రతిపాదించిన అలైన్‌మెంట్‌ను పక్కనపెట్టి ప్రస్తుతం ఉన్న రహదారి వెంటే కారిడార్ నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. మన్ననూరు నుంచి పాతాళగంగ వరకు సుమారు 55 కిలోమీటర్ల మేర ఈ నిర్మాణం చేపట్టేలా కొత్త ప్రణాళిక రూపొందించారు. అలైన్‌మెంట్ ప్రక్రియ పూర్తికాగా.. ప్రస్తుతం సమగ్ర ప్రాజెక్టు నివేదిక రూపుదిద్దుకుంటోంది. తొలుత నల్లమలలోని కొండలు, గుట్టల మీదుగా భారీ పిల్లర్లతో ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని ప్రతిపాదించారు. దీనివల్ల మన్ననూరు నుంచి శ్రీశైలం చేరుకునే ప్రయాణ దూరం తగ్గుతుందని భావించారు. అయితే కొండ ప్రాంతాల్లో నిర్మాణ పనులు చేపట్టడం వల్ల ప్రాజెక్టు వ్యయం గణనీయంగా పెరిగే అవకాశముందని సమాచారం. అటవీ, పర్యావరణ అనుమతుల విషయంలోనూ సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉండటంతో ప్రత్యామ్నాయ మార్గంపై అధికారులు దృష్టి సారించారు. నిర్మాణ వ్యయాన్ని నియంత్రించడం, అటవీ ప్రాంతంపై ప్రభావాన్ని తగ్గించడం లక్ష్యంగా ప్రస్తుత రహదారి మార్గంలోనే ఎలివేటెడ్ కారిడార్ నిర్మించేలా ప్రణాళికను మార్చారు. ఈ మార్గంలో వాహనాల రాకపోకలపై నిర్వహించిన ట్రాఫిక్ సర్వే ఆధారంగా తొలుత రెండు లేన్ల కారిడార్ నిర్మించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న ట్రాఫిక్ రద్దీకి నాలుగు లేన్ల నిర్మాణం తక్షణమే అవసరం లేదని అలా చేపడితే ఆర్థిక భారం పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. అయితే భవిష్యత్తులో వాహనాల >>2

## వ్యవస్థలపై బురద చల్లడం కాంగ్రెస్ నైజం!



మేము ఓట్లను చోరీ చేయం.. ప్రజల మనసులను గెలుచుకుంటాం

ఎన్నికల్లో ఓడిపోతే ఇవిఎంలతో అనడం వారికే చెల్లు: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 27 ప్రభాతవార్త:** మిస్టర్ రాహుల్ గాంధీ.. భారతీయ జనతా పార్టీ ఎన్నడూ ఓట్లను చోరీ చేయదు, దేశ ప్రజల మనసులను గెలుచుకుంటుంది. ఎన్నికల్లో గెలిస్తే తమ ఘనతగా చెప్పుకోవడం, ఓడిపోతే ఈవీఎంలు, ఎన్నికల సంఘంపై నిందలు వేయడం కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాలకు, ద్వంద్వ వైఖరికి నిదర్శనం అని, ప్రజలు ఛీత్కరించుకుంటున్నా కాంగ్రెస్ వైఖరిలో మార్పు రావడం లేదని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పార్టీ ముఖ్య నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. భాగ్యనగరంలో గణేష్ నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా, విజయవంతంగా పూర్తయినందుకు భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితికి, పోలీస్, మున్సిపల్ సిబ్బందికి, ప్రభుత్వ >>2

## సిరిసిల్ల భూములపై శ్వేతపత్రం రిలీజ్ చేయండి!



నేతన్న, రైతన్న, విద్యార్థి, అన్ని వర్గాల సమస్యలకు సమాధానం చెప్పాలి

హామీల అమలుపై స్పష్టమైన తేదీలు ప్రకటించాలి: సిఎం రేవంత్‌కు కెటిఆర్ బహిరంగ లేఖ

**హైదరాబాద్,సెప్టెంబరు27,ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు మూడేళ్లు పూర్తయిన తర్వాత తొలిసారిగా సిరిసిల్లకు వస్తున్న ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ స్వాగతం పలికారు. అయితే ముఖ్యమంత్రి హోదాలో సిరిసిల్లకు వస్తున్నందున రాజకీయ విమర్శలు, వ్యక్తిగత దూషణలకు కాకుండా ప్రజల సమస్యలకు సమాధానం చెప్పాలని కోరారు. రాష్ట్రంలోని ప్రతి వర్గాన్ని, ప్రతి రంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని కేటీఆర్ ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం 10 పేజీల లేఖ రాశారు. 420 హామీల్లో ఒక్కహామీని కూడా సక్రమంగా అమలు చేయలేదని విమర్శించారు. సిరిసిల్లలో బీఆర్‌ఎస్ నాయకులు 8 వేల ఎకరాల ప్రభుత్వ భూమిని దోచుకున్నారని, అందులో 2,400 ఎకరాలను ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకుందని అసెంబ్లీలో సీఎం చేసిన ఆరోపణలు >>2



ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఆదివారం రాజస్థాన్ బికనీర్‌లోని జునాగఢ్ కోట వద్ద విభిన్నమైన తలపాగాలు ధరించిన జానపద కళాకారులు

# వాతావ'రణం'

>> పెరుగుతోంది. ముఖ్యంగా మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు 34-35 డిగ్రీలకు పైబడి చేరుతుండటంతో ప్రజలు వేడి, ఉక్కబోతలను ఎదుర్కొంటున్నారు. వారం రోజుల క్రితం వరకు తెలంగాణలో పలు ప్రాంతాల్లో ఎండలు తీవ్రంగా ఉండటంతో ఉక్కపోత పరిస్థితులు నెలకొన్నాయి. అనంతరం వర్షాలు కురవడంతో వాతావరణం కొంత చల్లబడింది. ఇప్పుడు వర్షాలు తగ్గి ఉష్ణోగ్రతలు మళ్లీ పెరుగుతుండటంతో పగటి వేళల్లో వేడి, ఉక్కపోత పరిస్థితులు తిరిగి ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం సాధారణం మించి ఉష్ణోగ్రతల్లో మరింత పెరుగుదల చోటు చేసుకుంది. గడచిన 24 గంటల్లో రాష్ట్రంలోని నల్లగొండ జిల్లా నిడమానూర్‌లో అత్యధికంగా 36.9 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. అలాగే సూర్యాపేట్ జిల్లా మేళ్లచెర్వు లో సాధారణం కంటే మించి 36.5 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు, ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెంలో 36.4 డిగ్రీలు, కొత్తగూడెం జిల్లా బూర్గుంపహాడ్‌లో 36.1 డిగ్రీలు, నిర్మల్ జిల్లా రూరల్‌లో 35.3 డిగ్రీలు, మహబూబాబాద్ జిల్లా నర్సింహులుపేట్‌లో 35.1 డిగ్రీలు, నిజామాబాద్ జిలాన వర్ని, కామారెడ్డి జిల్లాలోని మద్నూర్‌లో 35 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇక గ్రేటర్ హైదరాబాద్‌లోని ఇందిరానగర్ కమ్యూనిటీ హాల్ వద్ద 34.9 డిగ్రీల ఉష్ణోగ్రలు రికార్డయ్యాయి.

# కారిడార్ రూపు మారింది

>> సంఖ్య పెరిగితే నాలుగు లేన్లకు విస్తరించేందుకు వీలుగా డిజైన్లు రూపొందిస్తున్నారు. ఘాట్ రోడ్డులోని ప్రమాదకరమైన మలుపులు, హెయిర్‌పిన్ బెండ్ల వద్ద రహదారిని వీలైనంత నేరుగా మార్చేలా ఇంజినీరింగ్ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. పిల్లర్ల ఎత్తు, అమరికను కూడా భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా రూపొందించనున్నారు. కొత్త అలైన్‌మెంట్ ఖరారు కావడంతో కన్సల్టెన్సీ సంస్థ డీపీఆర్‌ను సిద్ధం చేసే పనులను వేగవంతం చేసింది. నివేదిక పూర్తయిన తర్వాత ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన తదుపరి నిర్ణయాలు, వ్యయ అంచనాలు స్పష్టతకు వచ్చే అవకాశం ఉంది. మరోవైపు, ప్రాజెక్టుకు కేంద్రం నుంచి అనుమతులు, నిధుల కేటాయింపులో జాప్యం జరుగుతోందని రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. పర్యావరణ అనుమతులు, ఆర్థిక వనరుల సమీకరణలో పురోగతి లేకపోవడం వల్ల ప్రాజెక్టు ముందుకు సాగడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొంటున్నాయి. అయితే కొత్త అలైన్‌మెంట్, రెండు లేన్ల నిర్మాణం, భవిష్యత్తులో విస్తరణ వంటి అంశాలు ప్రస్తుత ప్రతిపాదనల్లో భాగంగా ఉన్నాయి. డీపీఆర్ పూర్తవడం, సంబంధిత అనుమతులు, నిధులపై నిర్ణయాలు వెలువడిన తర్వాతే నిర్మాణానికి సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

# యుఎల్‌సిలకు లైన్ క్లియర్

>> జారీ చేసినట్లు వెల్లడించారు. అర్హత కలిగిన కేసుల్లో నిబంధనల ప్రకారం అవసరమైన అన్ని ప్రక్రియలు పూర్తి చేసి క్రమబద్ధీకరణ చర్యలు తక్షణం చేపట్టాలని అధికారులను ఆదేశించామని వెల్లడించారు. యుఎల్‌సి సమస్యల పరిష్కారానికి గత ప్రభుత్వం 2016లో జీవో జారీ చేసినప్పటికీ, ఆ జీవోను అమలు చేయకపోవడంతో ఏళ్ల తరబడి దరఖాస్తులు పెండింగ్ లోనే ఉన్నాయని అన్నారు. ఈ నెల 16న శాసనసభ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సెక్షన్ 22ఏతో ముడిపడి ఉన్న 10-12 కీలక అంశాలను ఫాస్ట్‌ట్రాక్ విధానంలో పరిష్కరిస్తామని ఇచ్చిన హామీకి అనుగుణంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. ఇప్పటికే 22ఏ సమస్యల పరిష్కారానికి ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేయడం, ఆ తర్వాత జి.ఓ 118కు అనుగుణంగా మెమో జారీ, ఆ వెంటనే జి.ఓ 76కు అనుగుణంగా మెమో ఇవ్వడం జరిగిందన్నారు. 22ఎ లో ఉన్నప్పటికీ జిహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండిఏ, డిటిసిపి, మున్సిపల్ అనుమతులు కలిగిన ఇళ్లు, ప్లాట్లు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లకు అనుమతి ఇస్తూ ఉత్తరులు జారీ చేశామన్నారు. తాజాగా దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న యుఎల్‌సి దరఖాస్తుల పరిష్కారానికి స్పష్టమైన ఉత్తర్వులు ఇచ్చామన్నారు.

# బ్యాంకర్ల సమ్మె వాయిదా

>> ప్రభుత్వంతో చర్చించి పరిష్కరించేందుకు ప్రయత్నించనున్నట్లు తెలిపాయి. 2024 మార్చి 8న ఇరు వర్గాల మధ్య జరిగిన సమావేశానికి సంబంధించిన మినిట్స్‌లో పేర్కొన్న పెండింగ్ అంశాలను కూడా త్వరితగతిన పరిష్కరించేందుకు చర్చలకు తీసుకురానున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రతిపాదిత ఆందోళనలు, సమ్మె కార్యక్రమాలను వాయిదా వేయాలని యూఎఫ్‌బీయూ నిర్ణయించినట్లు యూనియన్లు వెల్లడించాయి. మూడు రోజులపాటు సమ్మె నిర్వహించాలని తొలుత నిర్ణయించారు. ఈ సమ్మె సోమవారం నుంచి ప్రారంభం కావాల్సి ఉండగా, ముఖ్యంగా ప్రభుత్వ రంగ బ్యాంకులు, పాత తరం ప్రైవేట్ బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల్లో సేవలకు అంతరాయం కలిగే అవకాశం ఉందని భావించారు. బ్యాంకులకు వారానికి ఐదు రోజుల పనిదినాలు కల్పించడంతో పాటు పలు డిమాండ్ల సాధన కోసం ఉద్యోగ సంఘాలు సమ్మెకు పిలుపునిచ్చాయి. ముఖ్యంగా పెన్షన్ ప్రయోజనాలు, పెన్షనర్లకు డియర్‌నెస్ అలవెన్స్ , నేషనల్ పెన్షన్ సిస్టమ్ పరిధిలో ఉన్న ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం ఎంచుకునే అవకాశం కల్పించడం వంటి అంశాలను యూనియన్లు ప్రధానంగా ప్రస్తావించాయి.

ఈ డిమాండ్లపై ఈనెల 11న దేశవ్యాప్తంగా ఒకరోజు బ్యాంకు సమ్మె కూడా జరిగింది. యూఎఫ్‌బీయూ అనేది ఏడు బ్యాంకు ఉద్యోగులు, అధికారుల సంఘాలకు ప్రాతినిధ్యం వహించే సమాఖ్య సంస్థ. సమస్యలు పరిష్కారం కాకపోతే అక్టోబర్ 26 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని కూడా గతంలో యూఎఫ్‌బీయూ హెచ్చరించింది. మిగిలిన సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని, బ్యాంకింగ్ సేవలకు అంతరాయం కలగకుండా చూడాలని కేంద్ర ఆర్థిక శాఖ ఈ వారం ప్రారంభంలో బ్యాంకు ఉద్యోగులకు విజ్ఞప్తి చేసింది. యూనియన్లు లేవనెత్తిన చాలా అంశాలు ఇప్పటికే గణనీయంగా పరిష్కరించబడ్డాయని ఆర్థిక శాఖ పేర్కొంది. పీఎల్‌ఐకి సంబంధించిన డిమాండ్‌ను ఈ నెల ప్రారంభంలోనే తాత్కాలికంగా నిలిపివేసినట్లు తెలిపింది.

# ఉప్పొంగిన గోదావరి

>> గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తమయ్యారు. శనివారం సాయంత్రం ఇంద్రావతి, సమ్మక్కసాగర్ నుంచి సుమారు 7.29 లక్షల క్యూసెక్కుల వరదనీటిని దిగువకు విడుదల చేయడం భద్రాచలం వద్ద గోదావరి ఉధృతి పెరగడానికి ప్రధాన కారణంగా అధికారులు చెబుతున్నారు. మరోవైపు చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టు ఆరు గేట్లను రెండు అడుగుల మేర ఎత్తి 7,922 క్యూసెక్కుల నీటిని దిగువనున్న గోదావరిలోకి విడుదల చేశారు.

**వాజేడు వద్ద తగ్గుదల.. భద్రాచలంలో నెమ్మదింపు:**
అయితే ఎగువ ప్రాంతమైన వాజేడు వద్ద గోదావరి ఉధృతి కొంత తగ్గుముఖం పట్టడం, భద్రాచలం వద్ద కూడా నీటిమట్టం పెరుగుదల వేగం నెమ్మదించడం అధికారులకు కొంత ఊరటనిచ్చింది. ప్రస్తుత పరిస్థితులను బట్టి ఆదివారం అర్ధరాత్రి తర్వాత గోదావరి క్రమంగా తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. అయినప్పటికీ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షి స్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

**వరద గుప్పెట్లో పంట పొలాలు:**
సెప్టెంబరులోనే మరోసారి గోదావరి ఉధృతి పెరగడంతో పరివాహక ప్రాంతాల ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ముఖ్యంగా గోదావరి పరివాహక ప్రాంతాల్లో ఇప్పటికే వేలాది ఎకరాల్లో రైతులు మిర్చి, పత్తి సాగు చేస్తున్నారు. పత్తి పంట చేతికొచ్చే దశలో ఉండగా.. మిర్చి పంటకు వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేస్తున్న సమయంలో వరద ముప్పు రైతులను కలవరపెడుతోంది. గోదావరి మరింత పెరిగితే తీరప్రాంతంలోని పంట పొలాల్లోకి నీరు చేరి భారీగా పంట నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గత వరదల అనుభవాలను గుర్తుచేసుకుంటూ ఈసారి కూడా పంటలు దెబ్బతింటే ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

**అధికారులు అప్రమత్తం:**
మొదటి ప్రమాద హెచ్చరిక నేపథ్యంలో గోదావరి పరివాహక ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తమయ్యారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను ఎప్పటికప్పుడు పరిస్థితిని గమనిస్తూ జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. నీటిమట్టం పెరుగుదల, ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహం, వాజేడు-భద్రాచలం మధ్య పరిస్థితులను అధికారులు నిరంతరం పరిశీలిస్తున్నారు. ప్రస్తుతం గోదావరి ఉధృతి పెరుగుదల నెమ్మదించడం, ఎగువన కొన్ని ప్రాంతాల్లో తగ్గుదల సంకేతాలు కనిపించడం కొంత ఊరటనిస్తున్నా.. అర్ధరాత్రి తర్వాత నీటిమట్టం ఏ మేరకు తగ్గుతుందనేది కీలకంగా మారింది. దీంతో అధికారులు, పరివాహక ప్రాంతాల ప్రజలు రాత్రంతా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. గోదావరి సమీపంలో ఉన్న మండలాల అధికారులను అప్రమత్తం చేశారు.

## వారం - వర్జ్యం

**28-09-2026, సోమవారం**
**శ్రీ పరాభవ నామ సంవత్సరం,**
**భాద్రపద మాసం, దక్షిణాయణం**
**వర్షఋతువు, కృష్ణపక్షం, చిత్త కార్తె**
తి. **విదియ** రా.7.11, న.రేవతి ఉ.10.14
వ.తె.5.14 - ఉ.6.46
దు.మ.12.21 - మ.1.09
రాహు. ఉ.7.30-ఉ.9.00.
శుభ స. ఉ.7.00-ఉ.8.00

## వార్తాఫలం

**మేషం :** బాధ్యతల బరువుకన్నా కొండను మోయడం తేలికని భావిస్తారు. ఉత్తర ప్రత్యుత్తరాలను సాగిస్తారు.

**వృషభం :** ఆదాయ మార్గాలు వృద్ధి చేసుకునే విషయమై దీర్ఘాలోచనలు సాగిస్తారు. ఆస్తి తగాదాలు తీరి లబ్ధిని పొందుతారు.

**మిథునం :** శుభకార్యాలు సానుకూల పడతాయి. వీసా, పాస్ పోర్ట్ వంటి అంశాలు అనుకూలంగా ఉంటాయి.

**కర్కాటకం :** దూరప్రాంత ప్రయాణ సూచన. క్రమ శిక్షణకు అధిక ప్రాముఖ్యతనిస్తారు. ఆనందోత్సాహాలను కలిగి ఉంటారు.

**సింహం :** సంఘ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. రాజకీయ, కళా పారిశ్రామిక రంగాలలోని వారికి అనుకూలం.

**కన్య :** అనుకున్న విధంగా నూతన కార్య క్రమాలను ప్రారంభించ గలుగుతారు. సకుటుంబంగా దైవ దర్శనం చేసుకుంటారు.

**తుల :** నూతన గృహం కొనుగోలు యత్నాలు దాదాపు పూర్తవుతాయి. బంధు వర్గంతో మాటపట్టింపులు ఏర్పడతాయి.

**వృశ్చికం :** భూముల క్రయవిక్రయాలలో స్వల్ప లాభ సూచన. సన్నిహిత వర్గం అందు బాటులో ఉంటారు.

**ధనుస్సు :** నిజం చెప్పి చెడ్డవారవడం కన్నా అబద్ధం చెప్పి మంచివారు అనిపించుకోవడం ఉత్తమం.మానసికవత్తిడి అధికంగాఉంటుంది

**మకరం :** మీ అంచనాలకన్నా మీ ఇంటిలోని వారి ఊహే నిజమవుతుంది. వైఖరిలో స్వల్పమైన మార్పులు చోటు చేసుకుంటాయి.

**కుంభం :** సాంకేతిక విషయాలపైన ఆసక్తిని చూపుతారు. సకుటుంబంగా దైవ దర్శనం చేసుకుంటారు.

**మీనం:**సంతాన విద్యా, విషయాలపైన దృష్టిని కేంద్రీకరిస్తారు. క్రయవిక్రయాలలో స్వల్ప లాభ సూచన. వత్తిడి అధికంగా ఉంటుంది.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# సర్జికల్ స్ట్రైక్‌కు పదేళ్లు

>> సందర్భంగా ప్రధాని మోడీ భారత సైనికుల ధైర్యసాహసాలను గుర్తు చేసుకున్నారు. 2016 సెప్టెంబర్ 28-29 తేదీల్లో భారత సైన్యం నియంత్రణ రేఖ (ఎల్ఒసి) దాటి పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై సర్జికల్ స్ట్రైక్ నిర్వహించిందని ఆయన పేర్కొన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ అనుసరించిన విధానంలో సర్జికల్ స్ట్రైక్ ఒక ముఖ్యమైన ఉదాహరణగా నిలిచిందని, 'నేటి భారత్ ఉగ్రవాదాన్ని సహించదు' అని ప్రధాని మోడీ స్పష్టం చేశారు. దేశ చరిత్ర, వారసత్వంతో పాటు పర్యావరణ పరిరక్షణ, యువత, క్రీడలు, మహిళా సాధికారత, స్థానిక ఉత్పత్తులకు మార్కెట్ వంటి అంశాలను ప్రస్తావించారు. ప్రజల స్థానిక స్థాయి ప్రయత్నాలు సామాజిక, ఆర్థిక మార్పులకు దోహదపడుతున్నాయని పేర్కొన్నారు. జనగణనను జాతీయ బాధ్యతగా అభివర్ణించారు. ప్రతి పౌరుడు ఇందులో భాగస్వామి కావాలని కోరారు. జనగణన సమయంలో అందుబాటులో ఉన్న ఆన్‌లైన్ విధానాన్ని కూడా ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. దేశ జనాభా, సామాజిక, ఆర్థిక పరిస్థితులకు సంబంధించిన సమాచార సేకరణలో పౌరుల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు. మన్ కీ బాత్‌లో ప్రధాని మోడీ ప్రముఖ సామాజిక నాయకుడు, విశ్వ హిందూ పరిషత్ మాజీ నేత అశోక్ సింఘాల్ ను కూడా గుర్తు చేసుకున్నారు. 1926 సెప్టెంబర్ 27న ఆగ్రాలో జన్మించిన సింఘాల్ శతజయంతి సందర్భంగా ఆయనకు నివాళులు అర్పించారు. సింఘాల్ సమాజంలో ఉంటూనే తపస్వి జీవితం గడిపారని మోడీ పేర్కొన్నారు. రామ జన్మభూమి ఉద్యమానికి ఆయన దిశ, ఉత్సాహం అందించారని తెలిపారు. గుజరాత్‌లోని మొఢేరా సూర్య దేవాలయం చరిత్రను కూడా ప్రధాని ప్రస్తావించారు. 1025లో రాజు భీమదేవుడు ఈ ఆలయాన్ని నిర్మించారని పేర్కొన్నారు. చారిత్రక వారసత్వంతో పాటు మొఢేరా ప్రస్తుతం దేశంలో తొలి సోలార్ విలేజ్‌గా కూడా గుర్తింపు పొందిందని మోడీ తెలిపారు. గత చరిత్రతో ఆధునిక సాంకేతికతను అనుసంధానం చేయడాన్ని ఆయన ప్రస్తావించారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలు చేపడుతున్న పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను ప్రధాని మోడీ ప్రశంసించారు. అసోంలో ప్రకృతి పరిరక్షణ చర్యల ద్వారా స్థానికంగా సానుకూల మార్పులు చోటుచేసుకుంటున్నాయని ఆయన వివరించారు. అలాగే పశ్చిమ బెంగాల్‌లోని సుందర్‌బన్స్‌లో ఝూర్ఖాలి ప్రాంత మహిళలు మాంగ్రూవ్ అడవులను అభివృద్ధి చేస్తున్న విషయాన్ని ప్రస్తావించారు.

వీరిలో కొందరు పులి దాడుల్లో భర్తలను కోల్పోయిన మహిళలు ఉన్నారని తెలిపారు. మహిళలు పెంచుతున్న మాంగ్రూవ్ చెట్లు గ్రామాలకు సహజ రక్షణ కవచంగా మారడంతో పాటు వారికి ఆదాయ వనరుగా కూడా ఉపయోగపడుతున్నాయని ప్రధాని పేర్కొన్నారు. దీనిని పర్యావరణ పరిరక్షణ, మహిళా సాధికారతకు అనుసంధానమైన ప్రయత్నంగా వివరించారు.

# ఎల్‌నినో.. పవర్రీ

>> పోలిస్తే ఇది దాదాపు 23 శాతం అధికంగా ఉంది. సాధారణంగా సెప్టెంబర్ లో డిమాండ్ భారీగా తగ్గాల్సి ఉన్నా, వర్షాలు ఆశించిన స్థాయిలో లేకపోవడం, ఉక్కపోత కారణంగా విద్యుత్ వినియోగం క్రమేపీ పెరుగుతోంది. ఇక్కడే అసలు టెన్షన్ మొదలైంది. డిమాండ్ పెరుగుతున్న సమయంలోనే రాష్ట్రంలోని కొన్ని కీలక విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి నిలిచిపోవడం పవర్ సిస్టమ్‌పై అదనపు ఒత్తిడిని పెంచుతోంది. రాష్ట్రంలో విద్యుత్తు డిమాండ్‌కు తగ్గట్టుగా సప్లై చేయాల్సిన పవర్ ప్లాంట్లు ఒక్కొక్కటిగా మూతపడుతున్నాయి. మొత్తం మూడు థర్మల్, రెండు హైడల్ ప్రాజెక్టుల్లో ఉత్పత్తి నిలిచిపోయింది. రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకమైన యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌కు బొగ్గు కొరత పెద్ద శాపంగా మారింది. బొగ్గు రాక, ప్లాంట్లు నడవక యాదాద్రిలో ఏకంగా రెండు యూనిట్లను మూసివేయాల్సి వచ్చింది. నాలుగు వేల మెగావాట్ల సామర్థం కలిగిన యాదాద్రి పవర్ ప్లాంట్ లో ఏకంగా 1,600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి తీవ్ర ఆటంకం కలిగింది. ప్రధానంగా నాణ్యమైన బొగ్గు సరఫరా కాకపోవడమే ఉత్పత్తికి ప్రధాన కారణంగా అధికారులు చెబుతున్నారు. ఇటు చూస్తే కేటీపీఎస్, అటు చూస్తే బీటీపీఎస్ ప్లాంట్లు కూడా బొగ్గు దొరక్క తంటాలు పడుతున్నాయి. ఇక భద్రాద్రి ప్లాంట్ కథ మరీ దారుణం! ఇక్కడ బొగ్గు సమస్యకు తోడు, నిర్వహణ లోపాలు, సాంకేతిక సమస్యలు తోడయ్యాయి. ఫలితంగా 1080 మెగావాట్ల సామర్థం కలిగిన భద్రాద్రి పవర్ ప్లాంట్ లో రెండు కీలక యూనిట్లు మూత పడ్డాయి. దీంతో మరో 540 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి గండి పడింది. అలాగే 2600 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రామగుండంలో ఓపెన్ కాస్ట్ గనుల్లో బొగ్గు తవ్వకాలు తగ్గిపోవడంతో అక్కడ కూడా ఉత్పత్తి పడిపోయింది. వారంలోనే రాష్ట్రంలోని మూడు థర్మల్, రెండు హైడల్ యూనిట్లలో ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. మూడు థర్మల్ యూనిట్లకే కలిపి సుమారు 1,870 మెగావాట్ల ఉత్పత్తి ప్రభావితమైంది. ఇక జల విద్యుత్ (హైడల్) ప్రాజెక్టులను ఎల్ నినో ఎఫెక్ట్ నిలువునా ముంచేసింది. వర్షాలు లేక రిజర్వాయర్లలో నీటి ఎద్దడి తీవ్రమైంది. శ్రీశైలం, నాగార్జునసాగర్, జూరాల ప్రాజెక్టుల్లో నీరు లేక విద్యుత్ ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోతోంది. ఎప్పుడూ పీక్ డిమాండ్ టైంలో ఆదుకునే హైడల్ పవర్, ఈసారి చేతులెత్తేయడంతో సంక్షోభం మరింత ముదిరింది. 810 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాగార్జునసాగర్‌లో ప్రస్తుతం పీక్ డిమాండ్ టైంలో 2.5 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి మాత్రమే జరుగుతోంది. 900 మెగావాట్ల సామర్థం కలిగిన శ్రీశైలంలో ప్రస్తుతం పీక్ డిమాండ్ టైంలో 8.10 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అప్పుడప్పుడూ జరుగుతోంది. జూరాల ప్రాజెక్టులో ఆశించడం స్థాయిలో నీరు లేకపోవడంతో విద్యుత్ ఉత్పత్తి పూర్తిగా నిలిపివేశారు. దీంతో విద్యుత్ వినియోగం పెరిగి, ఉత్పత్తి తగ్గపోవడంతో ఎక్చేంజీలో అధిక రేట్లకు విద్యుత్‌ను కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఎనర్జీ ఎక్చేంజీలో రాష్ట్ర పంపిణీ సంస్థలు ఆదివారం యూనిట్ రూ.1.99 చొప్పున 5090 మెగావాట్ల విద్యుత్‌ను కొనుగోలు చేశాయి. అదే శనివారం యూనిట్ రూ.1.95 చొప్పున 4,370 మెగావాట్ల విద్యుత్‌ను కొనుగోలు చేశాయి. ఇదే సమయంలో ప్రత్యామ్నాయ సరఫరా మార్గాలపై ముమ్మరంగా దృష్టి సారించింది. ఒడిశాలోని నైనీ బొగ్గు గనుల నుంచి యాదాద్రి ప్లాంట్‌కు బొగ్గు సరఫరాను అత్యంత వేగంగా పెంచాలని సింగరేణి సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది.

## సిరిసిల్ల భూములపై శ్వేతపత్రం

# రిలీజ్ చేయండి!

>> నిరాధారమని కేటీఆర్ పేర్కొన్నారు.2014 నుంచి 2023 డిసెంబర్ వరకు రాజన్న సిరిసిల్ల జిల్లాలో కేవలం 1,272 ఎకరాల భూమి మాత్రమే పంపిణీ జరిగిందని, అందులో సిరిసిల్ల నియోజకవర్గంలో కేవలం 204 ఎకరాలు మాత్రమే పంపిణీ చేశామని తెలిపారు.భూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా రైతుల అభ్యర్థనల మేరకు, అర్హత ప్రకారం రికార్డులు సవరించామని చెప్పారు.8 వేల ఎకరాల భూమి ఎక్కడుంది? అందులో 2,400 ఎకరాలు ఏ భూమి? ఏ మండలం? ఏ గ్రామం? ఏ సర్వే నంబరు? ఎవరి పేరుపై ఉంది? ఎంత విస్తీర్ణం? అనే పూర్తి వివరాలను ప్రభుత్వం ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. ఆరోపణల్లో వాస్తవం ఉంటే వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని, ఆరోపణలను రుజువు చేయలేకపోతే సిరిసిల్ల ప్రజలకు ముఖ్యమంత్రి బేషరతుగా క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బతుకమ్మ చీరల పథకాన్ని నిలిపివేసి 2024లో నేతన్నలకు పూర్తిగా ఉపాధి లేకుండా చేసిందని కేటీఆర్ ఆరోపించారు.నేతన్నల పోరాటం తర్వాత చీరల పథకాన్ని మరో పేరుతో ప్రారంభించినా దాన్ని కేవలం మహిళా సంఘాలకు మాత్రమే పరిమితం చేశారని తెలిపారు. పాత బకాయిలన్నీ చెల్లించామని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, రూ.300 కోట్ల బకాయిల్లో ఇంకా రూ.60 కోట్లు చెల్లించాల్సి ఉందని కేటీఆర్ తెలిపారు. నేతన్నలకు చెల్లించిన 10 శాతం యార్న్ సబ్సిడీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసిందని ఆరోపించారు. వస్త్ర పరిశ్రమ ఉన్న సిరిసిల్లను కాదని వేములవాడలో యార్న్ డిపో ఏర్పాటు చేయడం ద్వారా సిరిసిల్ల నేతన్నలను అవమానించారని కేటీఆర్ ఆరోపించారు. వస్త్రోత్పత్తికి రూ.300 కోట్ల విలువైన యార్న్ అవసరం ఉండగా కేవలం రూ.50 కోట్లు మాత్రమే కేటాయించారని తెలిపారు. సిరిసిల్లలోనే యార్న్ డిపో ఏర్పాటు చేసి అవసరమైన మేరకు యార్న్ అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. రైతుబీమా తరహాలో నేత కార్మికుల కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన రూ.5 లక్షల నేతన్న బీమా పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రీమియం కూడా చెల్లించకుండా నిలిపివేసిందని కేటీఆర్ తెలిపారు. నేతన్న బీమాను ఎప్పుడు పునరుద్ధరిస్తారో ముఖ్యమంత్రి ప్రకటించాలని డిమాండ్ చేశారు.పెద్దూర్ ప్రాంతంలో 60 ఎకరాల్లో రూ.174 కోట్లతో అపరెల్ పార్క్ నిర్మించామని కేటీఆర్ తెలిపారు.గోకుల్‌దాస్, టెక్స్‌పోర్ట్ తదితర సంస్థల ద్వారా 2,500 మంది మహిళలకు ఉపాధి కల్పించామని చెప్పారు. మరో 8 వేల మందికి పని కల్పించే అవకాశం ఉన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త పరిశ్రమలను ఏర్పాటు చేయడానికి సహకరించడం లేదని ఆరోపించారు. కార్మికులను యజమానులుగా మార్చే లక్ష్యంతో 88 ఎకరాల్లో రూ.387.61 కోట్లతో వీవింగ్ పార్క్ ఏర్పాటు చేశామని కేటీఆర్ తెలిపారు.50 షెడ్లు నిర్మించి, మొదటి దశలో 1,104 మంది కార్మికులకు ఒక్కొక్కరికి నాలుగు చొప్పున మొత్తం 4,416 అధునాతన మరమగ్గాలు అందించామని చెప్పారు. రాష్ట్రాన్ని నడిపించే ఒక బాధ్యతయుతమైన పదవిలో ఉన్నామన్న విషయాన్ని కూడా మరిచిపోయి, మీరు పర్యటించిన ప్రతిచోట కేవలం బూతు పురాణాలతో బురదజల్లే సంస్కృతిని దయచేసి సిరిసిల్లలో కొనసాగించవద్దంటూ కేటీఆర్ తన లేఖలో కోరారు.

# బురద చల్లడం కాంగ్రెస్ నైజం!

>> యంత్రాంగానికి, సహకరించిన నగర ప్రజలకు ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల సంఘం, రాజ్యాంగ వ్యవస్థలపై రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ చేస్తున్న నిరాధార ఆరోపణలను కిషన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఎన్నికల సంఘం చాలా బాగా పనిచేసినట్లు, కేరళలో కాంగ్రెస్ సీనియర్ నేత చెప్పినట్లు ఎస్ఐఆర్ ద్వారా దొంగ ఓట్లను తొలగిస్తే ఈసీ మంచిదైనట్లు ప్రచారం చేసుకున్నారని గుర్తుచేశారు. అదే ఇతర రాష్ట్రాల్లో బిజెపి గెలిస్తే మాత్రం ఈవిఎంలు, ఎన్నికల సంఘం తప్పున్నట్లు మాట్లాడటం వారి రాజకీయ అపరిపక్వతకు నిదర్శనమన్నారు. కాంగ్రెస్ పార్టీని గెలిపించాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌ది కాదని, రాహుల్ గాంధీని ప్రధాని చేయాల్సిన బాధ్యత ఈవిఎంలది కాదని స్పష్టం చేశారు.రాజ్యాంగం గురించి మాట్లాడే నైతిక హక్కు కాంగ్రెస్‌కు ఏమాత్రం లేదని ఆయన పేర్కొన్నారు. 1975లో దేశంలో ఎమర్జెన్సీ విధించి, పత్రికా స్వేచ్ఛను హరించి, పౌర హక్కులను కాలరాసి, ప్రతిపక్ష నేతలను జైళ్లలో పెట్టి చీకటి రాజ్యాన్ని నడిపిన చరిత్ర కాంగ్రెస్‌దని నిలదీశారు. 2009లో తమ మాట వినడం లేదని ఏకంగా రాజ్యాంగబద్ధ ఎన్నికల కమిషనర్లను తొలగించాలని రాష్ట్రపతికి సిఫారసు చేసిన చరిత్రను గుర్తుచేశారు. ప్రస్తుతం తెలంగాణలో ప్రజాస్వామ్యబద్ధంగా ఇందిరా పార్క్ వద్ద ధర్నాలు చేయాలన్నా కోర్టులకు వెళ్లి అనుమతులు తెచ్చుకోవాల్సిన దౌర్భాగ్య పరిస్థితి ఉందని, అలాంటి వారు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. దేశ ప్రయోజనాల కోసం పని చేస్తున్న రాజ్యాంగ, భద్రతా వ్యవస్థలను నిర్వీర్యం చేయడమే కాంగ్రెస్ లక్ష్యంగా పెట్టుకుందని మండిపడ్డారు. "రాహుల్ గాంధీ ఏ ఒక్క వ్యవస్థనూ వదిలిపెట్టడం లేదు. ఆర్మీ చీఫ్, ఎయిర్‌ఫోర్స్, సర్జికల్ స్ట్రైక్స్, ఎన్ఎస్ఏ అజిత్ దోవల్, లోక్‌సభ స్పీకర్, సిజెఐ, ఈడి, సిబిఐ, ఇంటెలిజెన్స్ బ్యూరో, మీడియా హౌస్‌లతో పాటు చివరకు పార్లమెంట్, జిఎస్‌టి వ్యవస్థలపై కూడా అనుమానాలు వ్యక్తం చేస్తూ విషప్రచారం చేస్తున్నారు. విదేశీ వేదికల మీద దేశ ప్రతిష్టను దిగజార్చేలా మాట్లాడటం ఆయన రాజకీయ అవగాహనారాహిత్యానికి నిదర్శనం అని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

## చెరువును తలపిస్తున్న థాయ్‌లాండ్ విమానాశ్రయం



థాయిలాండ్‌లో వెల్లువెత్తిన వరదలకు మొత్తం రోడ్లన్నీ చెరువలను తలపించాయి. అత్యంత కీలకమైన అంతర్జాతీయ విమానాశ్రయంలో వరదనీరు ప్రవేశించి విమానాల రాకపోకలన్నింటినీ నిలిపివేసింది. వారాంతంలో థాయిలాండ్‌ను ముంచెత్తిన భారీ వర్షాలు, వరదలకుగాను అటు విమానసర్వీసులు రద్దుకావడంతోపాటు ఇతర రవాణా వ్యవస్థలన్నింటినీ కూడా స్తంభింపచేసాయి.ప్రధానంగా సువర్ణభూమి ఎయిర్‌పోర్టు నుంచి అత్యవసర సర్వీసులు మాత్రమే నడిచాయి. అంతర్జాతీయ విమానాలు కనీసం మూడు గంటలపాటు ఆలశ్యంగా నడిస్తే దేశీయ విమానాలు సుమారు రెండు గంటలపాటు ఆలశ్యంగా నడిచాయి.

# 'పెద్ద'ల కసరత్తు

>> సిఎం రేవంత్‌రెడ్డికి, టిపిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు అందించినట్లు సమాచారం. 29న ఢిల్లీలో జరిగే కాంగ్రెస్ సిడబ్ల్యుసి సమావేశంలో పాల్గొనేందుకు ఒక రోజు ముందే (సోమవారం) సిఎం రేవంత్‌రెడ్డికి ఢిల్లీకి వెడుతున్నారు. సోమవారం ఉదయం ఢిల్లీకి వెళ్లనున్న సిఎం పలువురు కేంద్ర మంత్రులను కలువనున్నారు. మంగళవారం పార్టీ పెద్దలతో సమావేశమై ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికపై ఒక స్పష్టతకు వచ్చే అవకాశం ఉంది. ప్రత్యర్థి పార్టీల అభ్యర్థుల బలాబలాలను కూడా లెక్కేసి కాంగ్రెస్ తరపున ఎవరిని నిలబెట్టాలనేది నిర్ణయిస్తామని పీసీసీ వర్గాలు తెలిపాయి. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ నియోజకవర్గానికి భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రావు బరిలోకి దిగుతారని ప్రచారం జరుగుతున్నందున ఆయనకు దీటుగా ఉండే అభ్యర్థిని కాంగ్రెస్ పరిశీలిస్తోంది. ఇక్కడ కాంగ్రెస్ నుంచి పార్టీ నేతలు సామ రాంమోహన్‌రెడ్డి, హర్షవర్ధన్, గౌరీ సతీష్, వేణుగోపాల్‌రెడ్డి, భీం భరత్ తదితరులు తమకు అవకాశమివ్వాలని పీసీసీకి విన్నవించారు. కాంగ్రెస్ తరఫున ఖమ్మం-వరంగల్-నల్గొండ నియోజకవర్గానికి ఆర్టీఐ కమిషనర్ పివి శ్రీనివాస్, నల్లగొండ డిసిసి అధ్యక్షుడు కైలాష్ నేత ప్రముఖంగా ఉన్నాయి. మరోవైపు పొత్తులో భాగంగా ఈ సీటు తమకు కేటాయించాలని టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం కోరుతుండటం గమనార్హం. అభ్యర్థుల ఎంపికలో ప్రధానంగా సామాజిక సమీకరణాలను పరిగణనలోకి తీసుకోవాలని కాంగ్రెస్ అధిష్టానం భావిస్తున్నట్లు సమాచారం. రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలతో పాటు త్వరలో ఖాళీ కానున్న గవర్నర్ కోటాలోని మూడు ఎమ్మెల్సీ స్థానాలను కూడా కలిపి సామాజిక సమీకరణాలను బ్యాలెన్స్ చేసేలా అభ్యర్థుల ఎంపిక చేపట్టనున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మొత్తం ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు ఎలాంటి సామాజిక సమీకరణాలు ఉండాలన్న దానిపై కాంగ్రెస్ అధిష్టానం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ఎంపికపై తీసుకునే నిర్ణయాన్ని బట్టి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థుల విషయంలోనూ తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.వ్యక్తిగతంగా క్షేత్రస్థాయిలో తిరిగి పట్టభద్రులను ఓటర్లుగా చేర్పించడానికి బాగా కష్టపడాల్సి ఉంటుందని, ఈ స్థాయి ఉన్నవారిని గుర్తించి ఎంపిక చేస్తామని పార్టీ వర్గాలు తెలిపాయి. రెండు నియోజకవర్గాలలో టికెట్ ఆశిస్తున్నవారిలో క్షేత్ర స్థాయిలో ఎవరికి ఎంత బలం ఉందనేది కూడా పిసిసి సర్వే చేయించినట్లు తెలిసింది. ప్రధానంగా పట్టభద్రులైన ఓటర్లతో వారికి ఉన్న సంబంధాలు క్షేత్ర స్థాయిలో ఉన్న ఆర్థిక,అంగబలం వంటివి పరిశీలించినట్లు సమాచారం. ఒక్కో ఎమ్మెల్సీ నియోజకవర్గం దాదాపు 35 అసెంబ్లీ నియోజకవర్గాలు, ఐదేసి ఎంపీ స్థానాల్లో విస్తరించి ఉంది. ఎమ్మెల్యేలు,ఎంపీల సహకారం,మద్దతు కూడా ఉన్నవారినే ఎంపిక చేసేందుకు పిసిసి సిఫార్సులు చేస్తున్నట్లు సమాచారం. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఇప్పటికే ఓటర్ల జాబితా పునఃసిద్ధీకరణ ప్రక్రియకు ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. ఈ మేరకు సోమవారం(సెప్టెంబర్ 28) నుంచే పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రారంభం కానుంది. నవంబర్ 6 వరకు ఫారం18 ద్వారా దరఖాస్తులు స్వీకరించి, డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితా ప్రకటించనున్నారు. దీంతో అధిష్టానం తీసుకునే తుది నిర్ణయంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. పట్టభద్రుల స్థానాలతో పాటు నవంబర్, డిసెంబర్ నెలల్లో నాలుగు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ సీట్లు భర్తీకి రానున్నాయి. ప్రస్తుత ఎమ్మెల్సీలు గోరటి వెంకన్న, బస్వరాజు సారయ్య, బొగ్గారపు దయానంద్‌ల పదవీకాలం నవంబర్ 14న ముగియనుంది. డిసెంబర్ 18న మధుసూదనాచారి పదవీకాలం పూర్తవుతుంది. ఈ నాలుగు నామినేటెడ్ స్థానాలు కూడా అధికార కాంగ్రెస్ ఖాతాలోకే వెళ్లనున్నాయి. కళాకారుల కోటాలో సీఎంతో సన్నిహిత సంబంధాలున్న గోరటి వెంకన్నను మళ్లీ కొనసాగిస్తారా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది. బీఆర్ఎస్ ద్వారా నామినేట్ అయి ప్రస్తుతం కాంగ్రెస్‌లో ఉన్న బస్వరాజు సారయ్య మళ్లీ అవకాశం ఆశిస్తున్నారు. మరోవైపు సమాచార కమిషనర్ బోరెడ్డి అయోధ్యరెడ్డి, కరీంనగర్ గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం పేర్లు గవర్నర్ కోటా రేసులో బలంగా వినిపిస్తున్నాయి.

## సాహితీ ఇన్‌ఫ్రా కేసులో ఎమ్మెల్యే గాంధీ తరపున ఇడి విచారణకు న్యాయవాది హాజరు

**హైదరాబాద్, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:** శేరిలింగంపల్లి ఎంఎల్ఎ అరికపూడి గాంధీకి కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈ డీ) జారీ అయిన సమన్లపై విచారణ మొదలయ్యింది. ఈడీ సమన్లకు ఎంఎల్ఎ గాంధీ తరపున ఆయన న్యాయవాది ఆదివారం బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయానికి హాజరయ్యారు. రియల్ ఎస్టేట్ రంగంలో మూడు వేల కోట్ల రూపాయలను కొల్లగొట్టి వేలాది మంది అమాయకుల ను రోడ్డున పడవేసిన సాహితి ఇన్‌ఫ్రాటెక్ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నుంచి 2.1 కోట్ల రూపాయలను ఎంఎల్ఎ గాంధీ ఎందుకు తీసుకున్నారనే దానిపై న్యాయవాది ఈడీ అధికారులకు వివరణ ఇచ్చారు. సాహితి ఇన్‌ఫ్రా సంస్థ ప్రారంభమైన మొదట్లో ఆ కంపెనీ వెంచర్‌లో స్థలం కోసం ఎంఎల్ఎ గాంధీ ఈ మొత్తాన్ని చెల్లించారని, అయితే ఆ తరువాత సదరు సంస్థపై ఆరోపణలు రావడంతో డబ్బులను వెనక్కు తీ సుకున్నారని న్యాయవాది తెలిపారు. దీనికి సంబంధించి సాహితి ఇన్‌ఫ్రాతో జరిగిన లావాదేవీల తాలూకు పత్రాలను ఆయన ఈడీ అధికారుల కు అందజేశారు. సాహితి ఇన్‌ఫ్రా సంస్థ గోల్‌మాల్ కార్యకలాపాలతో ఎంఎల్ఎ గాంధీకి ఎలాంటి సంబంధం లేదని, ఈ విషయంలో కొందరు చేస్తున్న ఆరోపణలు సరైంది కాదని న్యాయవాది ఈడీ అధికారులకు వివరించారు. సాహితి ఇన్‌ఫ్రాతో ఎంఎల్ఎకు ఎలాంటి సంబంధం లేదని ఆయన తెలిపారు. కాగా ఈ విషయంలో అవసరం అయితే మరోసారి విచారణకు రావాలని ఈడీ అధికారులు న్యాయవాదిని ఆదేశించినట్లు స మాచారం. అవసరం అయితే ఎంఎల్ఎ గాంధీని తీసుకుని రావాల్సి ఉంటుందని ఈడీ అధికారులు వెల్లడించినట్లు తెలిసింది.



మన్ కీ బాత్ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, దీపక్‌రెడ్డి, గౌతంరావు తదితరులు

## మన్ కీ బాత్ శక్తివంతమైన వేదిక

### కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), సెప్టెంబరు 27, ప్రభాతవార్త:** రాజకీయాలకు అతీతంగా సామాన్యుల విజయాలు, ఆవిష్కరణలను వెలుగులోకి తెస్తూ దేశ ప్రజలను ఏకం చేసే శక్తివంతమైన వేదికగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మన్ కీ బాత్ కార్యక్రమం నిలుస్తోందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఫిలింనగర్‌లోని గౌతమ్‌నగర్ చౌరస్తాలో జూబ్లీహిల్స్ వాసులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి ఆదివారం ఆయన మన్ కీ బాత్ 138వ కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి దాదాపు 25 ఏళ్లుగా ప్రజా సేవకు మోదీ అంకితమయ్యారన్నారు. నిరంతర శ్రమ, అంకితభావంతో పనిచేస్తున్న మోదీ దేశ ప్రజలకు స్ఫూర్తిగా నిలుస్తున్నారని అన్నారు. మన్ కీ బాత్‌లో ప్రధాని 2016 సర్జికల్ స్ట్రైక్‌ను ప్రస్తావిస్తూ, ఉగ్రవాదానికి ప్రతిస్పందనగా భారత సైనికులు నియంత్రణ రేఖ(ఎల్ఓసీ) దాటి నిర్వహించిన ఆపరేషన్ గురించి వివరించారని తెలిపారు. జనగణన ప్రాధాన్యాన్ని, అందులో ప్రతి పౌరుడి భాగస్వామ్యాన్ని ప్రధాని వివరించారని కిషన్‌రెడ్డి చెప్పారు. మారుమూల, క్లిష్ట ప్రాంల్లో డిజిటల్ సాంకేతికత వినియోగంతో జనగణన నిర్వహణకు సంబంధించిన ఉదాహరణలను ప్రస్తావించారని తెలిపారు. యువతలో పెరుగుతున్న నషా ముక్త్ యువ అభియాన్‌పై కూడా ప్రధాని మాట్లాడారని, లక్షలాది మంది యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ప్రతిజ్ఞ చేస్తూ, మాదకద్రవ్య రహిత భారతదేశం కోసం తమవంతు బాధ్యతగా ప్రచారం నిర్వహిస్తున్న విషయాన్ని వివరించారన్నారు. కార్యక్రమంలో పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చింతల రామచంద్రారెడ్డి, ప్రేమ్ సింగ్ రాథోడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతంరావు, జాతీయ కౌన్సిల్ సభ్యులు బంగారు శృతి, అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్, ఫిల్మ్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు ముద్దంగుల శ్రీనివాస్, గద్దం వెంకటస్వామి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# అక్టోబరు 11న మహారాజా అగ్రసేన్ జయంతి వేడుకలు

### అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్, శాసన మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డిని ఆహ్వానించిన డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ



మహారాజా అగ్రసేన్ జయంతి ఉత్సవాలకు రావాలంటూ ఆదివారం అసెంబ్లీలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను ఆహ్వానిస్తున్న అఖిల భారత వైశ్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపి, వార్త సిఎండి డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ తదితరులు

**హైదరాబాద్, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:** మహారాజా అగ్రసేన్ 5,150వ జయంతి కార్యక్రమం నగరంలో ఘనంగా జరుగనున్నాయి. ఈ సందర్భంగా అక్టోబరు 11న ఉదయం బంజారా హిల్స్‌లో రోడ్ నంబర్ 12లోని అగ్రసేన్ విగ్రహం వద్ద జరిగే వేడుకలకు దేశంలోని ప్రముఖులతోపాటు రాష్ట్రంలోని ప్రముఖులందరూ హాజరుకానున్నారు. మహారాజా అగ్రసేన్ జయంతి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొనేందుకు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సమ్మతిని తెలియజేశారు. ఈ మేరకు ఆదివారం అసెంబ్లీలో అఖిల భారత వైశ్ ఫెడరేషన్ (ఎఐవైఎఫ్) జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపి, వార్త సిఎండి డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ వారికి ఆహ్వానపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎఐవై ఎఫ్ కేంద్ర, రాష్ట్ర ప్రతినిధులు గోపాల్‌మోర్, బద్రివిశాల్ బన్సల్, సురేష్ అగర్వా ల్ గిరీష్‌కుమార్‌సంఘీ వెంట పాల్గొన్నారు. ఎఐవైఎఫ్ జాతీయ అధ్యక్షుడు గిరీష్‌కుమార్ సంఘీ ఆహ్వానం మేరకు మహారాజా అగ్రసేన్ జయంతి వేడుకల్లో రాష్ట్ర రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా ముఖ్యఅతిథిగా పాల్గొనేందుకు ఇటీవల సమ్మతిని తెలియజేశారు.



మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని మహారాజా అగ్రసేన్ జయంతి ఉత్సవాలకు రావాలని ఆహ్వానిస్తున్న అఖిల భారత వైశ్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపి, వార్త సిఎండి డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ తదితరులు

# పనిచేయని ఐజిఆర్‌ఎస్ పోర్టల్

### తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు

### సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు

**హైదరాబాద్ (మలక్‌పేట జోన్ ప్రతినిధి), సెప్టెంబరు 27, ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతి పోర్టల్ మొరాయించిన ఘటన మరిచిపోక ముందే తెలంగాణ ఐజిఆర్‌ఎస్ పోర్టల్ పనిచేయడం లేదు. కొద్దిరోజులుగా ఐజిఆర్‌ఎస్ పోర్టల్ పనిచేయక పోవడంతో వివిధ పనుల కోసం వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ధరణి స్థానంలో ప్రవేశపెట్టిన భూభారతిలో మొన్న మెరాయించిన ఘటన మరిచిపోక ముందే ఐజిఆర్‌ఎస్ పోర్టల్ పనిచేయకపోవడంపై పలు విమర్శలు వస్తున్నాయి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో స్లాట్ బుక్కింగ్ కావడం లేదని, ఐజిఆర్‌ఎస్ సైట్ ఒపెన్ కావడం లేదని, దీంతోపాటు నెలలో పది రోజులు ఐజిఆర్‌ఎస్ పోర్టల్ పనిచేయడం లేదని పలువురు పేర్కొంటున్నారు. దీని కారణంగా గత కొద్ది రోజులుగా ఇసిలు, సర్టిఫైడ్ కాపీలు రావడం లేదని, దీంతో స్థానికులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఐజిఆర్‌ఎస్ సక్రమంగా పనిచేయక పోవడంతో అవస్థలు తప్పడం లేదు. ఒక వైపు తెలంగాణలో రియల్ ఎస్టేట్ కుదేలు అయ్యింది. రాష్ట్రంలో అరకొర ప్లాటు కొనాలన్నా, లీగల్ ఒపినియన్, ఇసిలు, ప్లాట్లు విక్రయించాలన్న ఐజిఆర్‌ఎస్ కారణంగా ఇసిలు రావడం లేదు. దీంతో సమస్యలు తప్పడం లేదు. భూభారతి సమస్యలు ఒక ఎత్తు అయితే ఐజిఆర్‌ఎస్ పోర్టల్ కారణంగా ఒక గంట పనిచేయకపోతే సంబంధిత అధికారులు వెంటనే స్పందించాల్సి ఉన్నా కాని రోజులు గడిచినా అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారులు సక్రమంగా పనిచేస్తే ఐజిఆర్‌ఎస్, భూభారతి ఎందుకు సమస్యలు వస్తున్నాయని పలువురు ప్రశ్నిస్తున్నారు. అధికారుల సమన్వయలోపం, పనితీరుకు ఇది నిదర్శనం అని వారు విమర్శించారు. ఐజిఆర్‌ఎస్ పోర్టల్‌లో తరుచూ సమస్యలు వస్తున్నా అధికారులు స్పందించడం లేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఆదీనంలో నడిచే ఐజిఆర్‌ఎస్ పోర్టల్ సక్రమంగా పనిచేయకపోవడంపై పలు విమర్శలు వస్తున్నాయి. 'వార్త' దినపత్రికలో కథనం వచ్చిన వెంటనే భూభారతిపై అధికారులు వెంటనే స్పందించి సరిచేసినట్లు తెలిసింది. అయితే ఐజిఆర్‌ఎస్ రాకపోవడంతో ప్రభుత్వానికి ఆదాయం తెచ్చి పెట్టే సమస్యలపై అధికారులు ఎందుకు స్పందించడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రంలో ఇప్పటికే రియల్ ఎస్టేట్ లేక పలువురు అవస్థలు పడుతున్నారు. ప్రజలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టూ సర్టిఫైడ్ కాపీలు, ఇసిలు కోసం తిరుగుతున్నా పట్టడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి వెంటనే ఐజిఆర్‌ఎస్ పోర్టల్ సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

## చీటీల మోసం.. రూ. 16 కోట్లతో జంప్

**హైదరాబాద్, సెప్టెంబరు 27, ప్రభాతవార్త :** హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసిన భారీ చిట్టీల మోసం తీవ్ర కలకలం రేపుతోంది. చిట్టీలు, అధిక వడ్డీల పేరుతో అమాయక ప్రజల నుంచి దాదాపు రూ. 16 కోట్లకు పైగా వసూలు చేసిన ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తు లు రాత్రికి రాత్రే బోర్డు తిప్పేసి పరారయ్యారు. కేపీహెచ్‌బీ ప్రాంతానికి చెందిన రమణారెడ్డి, ఆయన భార్య సీత, కుమార్తె హారీషా రెడ్డి కలిసి దాదాపు 44 మందిని నమ్మించి ఈ భారీ దగాకు పాల్పడినట్లు బాధితులు వాపోతున్నారు. బాధితులు తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని ఒత్తిడి తెచ్చేసరికి నిందితులు ఫోన్లను స్విచ్ ఆఫ్ చేసి, నివాసానికి తాళాలు వేసి అజ్ఞాతంలోకి వెళ్లారు. మోసపోయామని గ్రహించిన బాధితులు వెంటనే పోలీసులను ఆశ్రయించారు. ఈ ఆర్థిక నేరం యొక్క తీవ్రతను పరిగణనలోకి తీసుకుని సైబరాబాద్ ఈఓడబ్ల్యూ (ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్) పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుల బ్యాంక్ ఖాతాలు, వారి కాల్ డేటా ఆధారంగా ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు వేగవంతం చేశాయి.

**కూతుళ్ల పెళ్లిళ్ల కోసం దాచుకున్నాం..**

రమణారెడ్డి కుటుంబంతో తమకు సుదీర్ఘకాలంగా పరిచయం ఉందని, ఆ నమ్మకంతోనే కష్టపడి సంపాదించిన సొత్తును వారి వద్ద చిట్టీల రూపంలో దాచుకున్నామని బాధితులు కన్నీటిపర్యంతమవుతున్నారు. కొందరు తమ కుమార్తెల వివాహాల కోసం, మరికొందరు ఇళ్ల నిర్మాణాల కోసం కూడబెట్టిన కష్టార్జితాన్ని వీరి చేతుల్లో పెట్టి ఇప్పుడు వీధిపాలయ్యారు. క్షేత్రస్థాయిలో బాధితుల సంఖ్య ఇంకా ఎక్కువగా ఉందని, తమ అందరికీ కలిపి నిందితుల నుంచి రావలసిన మొత్తం దాదాపు రూ.70 కోట్ల వరకు ఉంటుందని బాధితులు ఆరోపిస్తున్నారు. పోలీసులు తక్షణమే స్పందించి నిందితులను అరెస్ట్ చేసి తమ సొమ్మును రికవరీ చేయాలని కోరుతున్నారు.

# బరి తెగించిన సైబర్ నేరగాళ్లు

### 20 రోజుల్లో ముగ్గురు నగర వాసుల నుంచి రూ.23.98 కోట్ల దోపిడీ

### ఎర్రగడ్డలో వైద్యుడికి ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట రూ.14.61 కోట్ల టోకరా

**హైదరాబాద్, సెప్టెంబరు 27: ప్రభాతవార్త:** సైబర్ నేరాలపై అన్నివర్గాలు జాగ్రత్తగా వుండాలని పోలీసులు పదే పదే హెచ్చరిస్తున్నా మోసపోతు న్న వారి జాబితా పెరుగుతూనే వుంది. దేశ వ్యాప్తంగా సైబర్ నేరాల సంఖ్య పెరుగుతుండడం ఒక ఎత్తయితే ఈ నేరాలను అరికట్టడంలో దేశంలోనే అగ్రభాగాన వున్న తెలంగాణలోనూ ఈ సంఖ్య ఆగడం లేదు. భారీ మోసాలు కూడా ఇక్కడ వెలుగు చూడడం విశేషం. గడచిన 20 రోజుల వ్యవధిలో హైదరాబాద్‌నే సైబర్ నేరగాళ్ల ముగ్గురు బడా వ్యక్తులను పక్కాగా టార్గెట్ చేసి అక్షరాల 23 కోట్ల 98 లక్షల రూపాయలను దోచుకోగా వారితో పాటు మరో నలుగురు కోటి రూపాయలు పోగొట్టుకున్న తీరు సైబర్ క్రైం పోలీసులనే షాక్‌కు గురచేసింది. ఇందులో ఎర్రగడ్డకు చెందిన ఓ వైద్యుడిని ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట సైబర్ నేరగాళ్ల ఉచ్చులో లాగి విడతల వారిగా 14.61 కోట్ల రూపాయలను దండుకుని నిం డా ముంచారు. దీనిపై బాధిత వైద్యుడు తేరుకునే సరికి జరగాల్సి న నష్టం జరిగి పోయింది. చివరకు అతను సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయిం చగా దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేబట్టారు. తెలంగాణలో ఇదే అతిపెద్ద సైబర్ నేరంగా అధికారులు చెబుతున్నారు మరో ఘటనలో సోమాజిగూడలో విశ్రాంత ఐఎఎస్ అధికారిని మ్యూచువల్ ఫండ్స్, ఐపిఓ పెట్టుబడుల ఆశచూపిన సైబర్ నేరగాళ్లు 3.37 కోట్ల రూ పాయలను దండుకున్నారు. నకిలీ సెక్యూరిటీస్, నకిలీ ట్రేడింగ్ ప్లాట్ ఫా ంను వాడిన సైబర్ నేరగాళ్లు విశ్రాంత బ్యూరోక్రాట్‌కు టోకరా వేశారు. మరో ఘటనలో ఇజ్జత్‌నగర్‌లో హైకోర్టు అడ్వకేట్ అనుకోకుండా డేటింగ్ యాప్‌లో వెళ్లగా అందులో ఓ యువతి పరిచయం అయ్యింది. ఈ క్ర మంలో ఆమెతో కేవలం చాటింగ్ చేయగా సదరు వ్యక్తి తెలివిగా హైకోర్టు న్యాయవాది వ్యక్తిగత ఫోటోలను సేకరించి వాటిని మార్ఫింగ్ చేసిం ది. అనంతరం వాటిని సదరు న్యాయవాదికి పంపి బ్లాక్ మెయిల్ చేసింది. తనకు వెంటనే ఐదు కోట్ల రూపాయలు ఇవ్వకుంటే ఈ ఫోటోలను సోషల్ మీడియాలో వుంచుతానని బెదిరించింది. దీంతో సదరు న్యాయవాది చేసేది లేక ఆ యువతికి ఐదు కోట్ల రూపాయలు ఇచ్చాడు. అయి నా కూడా బెదిరింపులు ఆగక పోవడంతో బాధితుడు సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించాడు. ఈ మూడు ఘటనలే కాకుండా మరో నాలుగు ఘటనలు కూడా సంచలనం రేపాయి. ఈ నాలుగు ఘటనల్లో కోటి రూపాయలు బాధితులు పోగొట్టుకున్నారు.

## మేడారం శ్రీ సమ్మక్క-సారలమ్మ 'మినీ జాతర' తేదీలు ఖరారు

**హైదరాబాద్, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:** మేడారం శ్రీ సమ్మక్క-సారలమ్మ "మినీ జాతర" తేదీలు ఖరారు అయ్యాయి. ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మేడారంలో జరిగే శ్రీ సమ్మక్కసారలమ్మ మినీ జాతర తేదీలు ఆదివారంనాడు ఖరారయ్యాయి. మేడారంలోని పూజారుల (వడ్డెలు) సంఘం సభ్యులు మినీ జాతర నిర్వహణ తేదీలను అధికారికంగా ప్రకటించారు. ఈ మేరకు పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కకు లేఖ ద్వారా వివరాలను తెలియజేశారు. మినీ జాతర తేదీల వివరాలు ఇలా ఉన్నాయి. వచ్చే ఏడాది(2027) ఫిబ్రవరి 17న (బుధవారం) ఫిబ్రవరి 18న (గురువారం) ఫిబ్రవరి 19న (శుక్రవారం) ఫిబ్ర వరి 20న (శనివారం)-ఈ నాలుగు రోజులు అమ్మవార్ల జాతర అమ్మవారి ఉత్సవాలు, పూజాకార్యక్రమాలు అత్యంత వైభవంగా జరగను న్నాయి. పూజారుల సంఘం నాయకులు, వడ్డెలు ఈ వివరాలను దృవీక రిస్తూ లేఖపై సంత కాలు చేశారు. మహాజాతర సమయంలో భారీగా భక్తుల రద్దీ ఉండటంతో మేడారం చేరుకోలేని వారు, తమ మొక్కులు చెల్లించు కోలేక పోయిన భక్తులు మినీ జాతర సందర్భంగా అమ్మవార్లను దర్శించుకు నేం దుకు వస్తుంటారు. దీంతో మినీ జాతరకు కూడా భక్తుల నుంచి మంచి స్పం దన ఉంటుంది. సమ్మక్క-సారలమ్మలను ఆదివాసీ గిరిజన దైవాలుగా కొలుస్తారు.

# కలహాలతో భార్యను కడతేర్చాడు

### రోకలిబండతో బాది.. పోలీసుస్టేషన్‌లో లొంగుబాటు

### చిక్కడపల్లి బాగ్‌లింగంపల్లిలో ఘటన

**హైదరాబాద్ (చిక్కడపల్లి), సెప్టెంబరు 27, ప్రభాతవార్త:** క్షణికావేశం, కుటుంబ కలహాలు ఒక పచ్చని సంసారాన్ని కూల్చేశాయి. కట్టుకున్న భార్యను భర్తే దారుణంగా హత్య చేయగా, కళ్లముందే తల్లి అనంతలోకాలకు వెళ్లడం, తండ్రి జైలుపాలు కావడంతో ఐదేళ్ల పసివాడు అనాథగా మిగిలిన హృదయవిదారక సంఘటన చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎస్. మధుబాబు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. బాగ్‌లింగంపల్లిలోని మాచర్ల జ్యువెలరీ షాప్ సమీపంలో నరేందర్ (34), తేజశ్రీ (29) దంప తులు నివాసముంటున్నారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని అన్నమయ్య జిల్లా రాచోటి ప్రాంతానికి చెందిన దొరబాబు కుమార్తె తేజశ్రీ కి ఆర్టీసీక్రాస్ రోడ్స్ క్రిస్టల్ బార్ అండ్ రెస్టారెంట్ లో పని చేస్తున్న నరేందర్ తో వివాహం జరిగింది. వీరికి ఐదేళ్ల కుమారుడు లోహిత్ ఉన్నాడు. ప్రస్తుతం దొరబాబు కువైట్ లో ఉంటున్నాడు. గత కొంతకాలంగా భార్యాభర్తల మధ్య కుటుంబ కలహాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఆదివారం ఉదయం 11:22 గంటల సమయంలో ఇద్దరి మధ్య మళ్లీ వివాదం చెలరేగింది. ఆగ్రహంతో ఊగిపోయిన నరేందర్ ఇంట్లోని రోకలిబండతో భార్య తలపై తీవ్రంగా బాదాడు. తీవ్ర రక్తస్రావమై తేజశ్రీ అక్కడికక్కడే ప్రాణాలు వదిలింది. రక్తం మడుగులో పడివున్న తల్లిని చూసి ఆ ఐదేళ్ల పసివాడు ఏడుస్తున్న తీరు స్థానికులను తీవ్రంగా కలచివేసింది. సమాచారం అందుకున్న చిక్కడపల్లి పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. క్లూస్ టీం బృందం పూర్తి వివరాలు సేకరించింది. హత్య అనంతరం నిందితుడు నరేందర్ నేరుగా చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయినట్లు సమాచారం. అమ్మ ఇకలేదని, నాన్న జైలుకు వెళ్లాడని తెలియని ఆ పసివాడి రోదనలు ఆ ప్రాంతంలో మిన్నంటాయి. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు. సంఘటన స్థలానికి చిక్కడపల్లి ఏసీపీ రణవీర్ రెడ్డి, ఇన్స్పెక్టర్ ఎల్.మధుబాబు, ఎస్ ఐ శివప్రసాద్ వివరాలు అడిగి తెలుసుకున్నారు.



తేజశ్రీ (ఫైల్)

# మెగా డిఎస్సీ, జాబ్ క్యాలెండర్‌పై అసెంబ్లీలో గళమెత్తుతా



గురుపూజోత్సవంలో మాట్లాడుతున్న మాజీమంత్రి హరీశ్‌రావు

### మంచి సమాజాన్ని నిర్మించేది గురువులే

### ర్యాంకులు, మార్కులే కాదు.. బాధ్యతలు నేర్పించాలి: మాజీ మంత్రి హరీశ్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** సిఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు మెగా డీఎస్సీ అని చెప్పి ఎన్నికల తర్వాత దగా డీఎస్సీ చేశాడని మాజీ మంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీష్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కొండా భూదేవి గార్డెన్‌లో ఆదివారం తెలంగాణ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గురుపూజోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి రాగానే మొదటి యేడాది రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని కేవలం 16 వేల ఉద్యోగాలు ఇచ్చి చేతులు దులుపుకున్నారని పేర్కొన్నారు. జాబ్ క్యా లెండర్‌ను జాబ్ లెస్ క్యాలెండర్‌గా మార్చారన్నారు. మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్‌పై అసెంబ్లీలో గళం ఎత్తుతానని స్పష్టం చేశారు. కార్పోరేట్ విద్యాలయాలు రావడంతో ప్రైవేటు స్కూల్స్ భయాందోళన గురై ఆందోళన చెందుతున్నారని తెలిపారు. మంచి సమాజాన్ని నిర్మించేది గురువులేనని తెలిపారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. ర్యాంకులు, మార్కులే కాకుండా విద్యార్థులకు సమాజం పట్ల మంచి బాధ్యతలు నేర్పించాలన్నారు. విద్యార్థులు సెల్ ఫోన్లు వాడకం తగ్గించి పుస్తక పఠనం చేపడితే మంచి జీవిత పాఠాలు నేర్చుకోవచ్చ న్నారు. మన సంస్కృతి సంప్రదాయాలను విద్యార్థులకు చిన్నప్పటి నుంచి తెలియజేయాలన్నారు. అనంతరం ఉత్తమ పాధ్యాయులను శాలువా, మెమోంటోలతో ఘనంగా సత్కారించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, టిపిఎస్ఏ అధ్యక్షులు భగవాన్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, టిపిఎస్సీ ప్రతి నిధులు రజనీకాంత్‌రెడ్డి, రమేష్, సంపత్‌కుమార్, సంతోష్, హనుమంతరెడ్డి, సురేందర్‌రెడ్డి, సంతు, లింగం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**కాళేశ్వరం మోటార్లు 24 గంటలు నడపాలి**

కాళేశ్వరం మోటార్లు తరుచూ ఆన్ ఆఫ్ పద్ధతితో నడిపితే అవి దెబ్బ తింటాయని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆదివారం నియోజక వర్గంలోని రంగ నాయకసాగర్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కార్ కాళేశ్వరం మోటార్లను 8 గంటలు నడిపి 16 గంటలు బంద్ చేస్తుందని దీని ప్రభావం మోటార్లపై పడి బేరింగులు దెబ్బ తింటాయన్నారు. 24 గంటలు నడిపి రంగనాయక సాగర్‌ను పూర్తిస్థాయిలో గోదావరి జలాలతో నింపాలన్నారు. వచ్చే యాసంగికి సాగునీరు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.



వార్త

ప్రాచీన మూఢవిశ్వాసాలను అంటిపెట్టుకోక, నవ్య సత్యాలకోసం సంసిద్ధుడవై ఉండు.

న- స్వామి వివేకానంద


# ప్రజాస్వామ్యానికి చేటు?

సమిష్టి నిర్ణయాలకు స్వస్తి పలికి దుందుడుకుగా ముందుకు వెళ్లితే ఎలాంటి పరిణామాలు సంభవిస్తాయో బాగా అనుభవానికి వచ్చినట్లున్నది. తాజాగా ఎన్నికల కమిషన్ కోరస్ పాడింది. ముగ్గురూ ఒక మాట మీద ఉండడం. ఆహ్వానించదగినదే. కానీ వాళ్ల మధ్య వచ్చిన విభేదాలు వ్యక్తిగ్నతగా వచ్చినవి కాదు. కేవలం ఓటర్లను గందరగోళపరిచే అంశాల నేపథ్యంలోనే వారి మధ్య పొరపొచ్చాలు వచ్చిన విషయం విదితమే ! కేంద్ర ఎన్నికల సంఘంలో అంతర్గత విభేదాలు ఉన్నాయనే మీడియా నివేదికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం శనివారం క్లారిటీ ఇచ్చింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి న్యూఢిల్లీలోని నిర్వచన్ సదన్‌లో సమావేశమయ్యారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్, కొత్త ఓటర్ల నమోదు, ఇసిఐనెట్, క్యాబినెట్ సెక్రటరీకి పంపిన లేఖ తదితర అంశాలపై ఈసీ వివరణ ఇచ్చింది. ముఖ్యంగా కొత్త ఓటర్ల నమోదుకు ఉపయోగించే ఫామ్ 6లో మార్పులు, ఓటర్ల జాబితా యాక్సెస్, ఇసిఐనెట్ తీరు, గురించి ప్రస్తావనకు వచ్చింది. వీటి ఆధారంగా కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు జ్ఞానేశ్ కుమార్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నాయి. ఆయన రాజీనామా చేయాలని కోరుతున్నాయి. అభిశంసం వైపే అందరూ మొగ్గు చూపుతున్నాయి. 'సర్' ప్రక్రియపై కమిషనర్లలో అంతర్గత విభేదాలు ఉన్నట్లు వచ్చిన ఆరోపణలపై ఈసీ తన వివరణలో స్పష్టతనిచ్చింది. 2025 జూన్ 24న సర్‌ను ప్రారంభించడం, షెడ్యూల్స్ కూడా పూర్తిగా ఏకగ్రీవ ఆమోదంతోనే జరిగినట్లు మీడియాకు తేటతెల్లం చేసింది. నిన్న మొన్నటి వరకు వెల్లువెత్తిన విమర్శలకు కొన్నిటికి జవాబులు దొరకలేదు. కొత్త ఓటర్ల నమోదుకు ఉపయోగించే ఫాం 6లో మార్పులపై మాత్రమే చర్చ జరిగింది. గత సర్ ఓటర్ల జాబితాలో తాత ముత్తాతల పేర్లు, వంశ వృక్షం వంటి అనాలోచిత ప్రశ్నలు చీకాకు కలిగించే కార్యక్రమంగా అఖిల పక్షాలు, సర్వజనులకు వెగటు పుట్టించింది. 14 అభ్యంతరాలు పట్టించుకోకుండా కమిషన్‌ను అభాసుపాలుచేస్తున్న సందర్భంలో మాత్రమే ఇద్దరు కమిషనర్‌లు పెదవి విప్పారు. ఇద్దరు కమిషనర్‌లు ప్రధాన ఎన్నికల కమిషనర్ ఒంటెత్తుపోకడలతో వ్యవహరించిన తీరు, ఆపై విపక్షాల విమర్శలు పర్వం, క్రాక్రోచ్ జనతా పార్టీ జంతర్‌మంతర్ వద్ద ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోరుతూ నిరసన ధర్నా చేస్తామని హెచ్చరించడంతో ప్రభుత్వపెద్దలు వారి మధ్య సయోధ్య కుదిర్చి ఉండవచ్చుననే ఊహాగానాలు బలపరుస్తున్నాయి. అతి పెద్ద ప్రతిష్టాత్మక రాజ్యాంగ వ్యవస్థగాఉన్న ఈసంస్థ 'సర్' ప్రవేశ పెట్టి దాని విధి విధానాలతో జనాన్ని ఇబ్బందుల పాలు చేసి ఎంతోమంది ఓటు హక్కు కోల్పోయేట్లు చేసింది. సాధారణంగా ఐఎఎస్ స్థాయి అధికార్ల పర్యవసానాలు ఆలోచించకుండా అనాలోచితంగా బయటపడరు. కమిషనర్ల మధ్య తలెత్తిన విభేదాలపై కేంద్ర క్యాబినెట్ సెక్రటేరియట్‌కు ఫిర్యాదులు వెళ్లాయన్న వార్తల్ని సమావేశం తోసిపుచ్చింది. రాజ్యాంగ సంస్థ విశ్వసనీయతకు సంబంధించిన వివాదంపై ప్రభుత్వం నోరు విప్పకపోతే అది ఏదో ఒక సమయంలో సంక్షోభంలో పడే అవకాశం ఉంది. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పేరుతో ఓటర్ల జాబితా సవరణ, ఫారం6 మార్పులు వంటి కీలక నిర్ణయాలు తమకు తెలియకుండా, తమ పేరుతో జారీ చేస్తున్నారని, ఇవి "అనధికార, అక్రమ" చర్యలని వారు రికార్డులో రాశారు. దీనిపై ఎన్నికల సంఘం వెంటనే ఖండించింది. 'సర్'తో సహా అన్ని నిర్ణయాలు ముగ్గురి ఏకగ్రీవ ఆమోదంతోనే జరిగాయి" అని సెప్టెంబరు 23న అధికారిక ప్రకటన విడుదల చేసింది. కాగా 1995 సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ప్రధాన ఎన్నికల కమిషనర్‌కి, ఇతర కమిషనర్లకి అభిప్రాయభేదం వస్తే మెజారిటీ నిర్ణయమే చెల్లుతుంది. సిఇసికి ప్రత్యేక 'వీటో' అధికారమేమీ ఉండదు. అంతర్గత చర్చలో అభ్యంతరం నమోదు చేయడం వేరు, అదే చివరి నిర్ణయం కావడంవేరు. కమిషనర్లు తమ అభ్యంతరాలను ఫైల్‌లో రాతపూర్వకంగా నిరసన తెలిపారు. అయినా అది తుది నిర్ణయంగా మారి బయటకు వస్తే అభ్యంతరం వ్యక్తం చేసిన వారిలో విభేదాలు తలెత్తే అవకాశం ఉంది. వీటిపై మీడియా సమావేశంలో ఎలాంటి స్పష్టత ఇవ్వలేక పోవడంతో వివాదం సమసిందన్న సంకేతాలు లేవు. అభ్యంతరం చెప్పి కూడా నిర్ణయాలు ఆగకపోతే, కమిషనర్లు రాజీనామా చేయాలి లేదా బహిరంగంగా మాట్లాడాలి. కేవలం ఫైల్ నోట్ రాసి వదిలేయడం వల్ల ప్రజలకు ఓటర్ల జాబితా విశ్వసనీయతపై అనుమానాలు రాకపోవు. వారి సయోధ్య పర్యవసానంగా 'సర్' సంక్లిష్టతలలో ఒక అంశంపై వెసులుబాటు వచ్చింది. 'సర్' విచారణలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా బిఎల్‌ఒలే వారిని కలుస్తారని వివరించింది. తమ ఓటు హక్కు కోసం ఎంతో మంది ఇప్పటికీ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. తమ విభేదాలు సంబంధించిన సరైన స్పష్టత లేకుండానే,'సర్' నిర్ణయాలన్నీ ఏకగ్రీవమేనని చెప్పే ప్రయత్నం జరిగింది. గత అభ్యం తరాలను ఎందుకు పట్టించుకోవడం లేదన్న విషయంపై ఎలాంటి వివరణలు లేవు. కేవలం తాజా వివాదాల నేపథ్యంలో నష్టనివారణ చర్యలగానే భావించారు. ఇదిలా ఉండగా అంతర్గత వివాదాల విషయమై తగు స్పష్టత అవసరమేనని ఎన్‌డిఎ భాగ స్వామ్య పక్షాలు అభిప్రాయ పడుతున్నాయి. విపక్షాలు మాత్రం ఈవివాదం సజీవంగా ఉన్నట్లు భావిస్తున్నాయి.



యాచన వల్ల మానవుడు అల్పుడౌతాడు. బలి చక్రవర్తిని యాచించటానికి విష్ణుమూర్తి వామనుడు కావలసి వచ్చింది.

రామకృష్ణ పరమహంస



గొప్ప గొప్ప వివాదాలను పరిష్కరించగలిగేది సమర్థులు లేదా వ్యతిరేకులు మాత్రమే, తటస్థులు కాదు.

సిసిరో

## ప్రజావాక్కు



### ఎన్నికల సంఘానిది వెన్నెముక సమస్య

ఎన్నికల కమిషన్ ఒక రాజ్యాంగ సంస్థ. ప్రజాస్వామ్యానికి ఎంతోకీలకమైన ఎన్నికల్ని వివాదరహితంగా, అనుమానాలకు అతీతమైన నిష్పక్షపాతవైఖరితో నిర్వహించాల్సిన గురుతర బాధ్యత కలది. అందుకనే ఆ కమిషన్‌కి విస్తృత అధికార పరిధిఉంది. ఒక ప్రధాన న్యాయమూర్తిని పదవి నుండి తొలగించాలంటే ఎంత క్లిష్టమైన ప్రక్రియ అవసరమో, ప్రధాన ఎన్నికలకమిషనర్‌ని తొలగించాలన్నా అంతే కష్టతరమైన ప్రక్రియ అవసరం. అలాంటి ఏర్పాటు చెయ్యడానికి ముఖ్యకారణం ఏమిటంటే వారు తమ అధికారాన్ని ఏ వత్తిడికీ లోనుకాకుండా స్వేచ్ఛగా చెయ్యాలని. అప్పుడే ప్రజాస్వామ్యం వెలుగొందుతుందని. అయితే దురదృష్టవశాత్తూ ఆ స్థాయిలో పనిచేయాల్సిన ఎన్నికల సంఘం తరచూ వివాదాల్లో చిక్కుకొంటుంది. ప్రతి పక్షాలు ఎన్నికల ప్రధానకమిషనర్ రాజీనామా కోరుతున్నాయి. ఆ సంఘంప్రాసంగికత, ప్రాముఖ్యత ప్రజల నమ్మకం పైనే ఆధారపడిఉంది. ఆనమ్మకాన్ని పునరుద్ధరించుకోవడం ప్రజాస్వామ్య దేశానికి అత్యవసరం.

- డా.డి.వి.జి.శంకరరావు,విజయనగరం

### గ్రామ సభ సమాచారం ఇవ్వాలి

రాష్ట్రంలో చాలా గ్రామాల్లో అధికారులు గ్రామ సభ నిర్వహణ తేదీ,సమయం, వేదికపట్ల అకస్మాత్తుగా సమాచారం ఇవ్వడం పట్ల చదువుకున్న యువత,ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ అధికారులు గ్రామ సభ నిర్వహించే రెండు రోజులు ముందుగానే గ్రామ ప్రజలకు స్పష్టంగా చెప్పాలి. పారదర్శకతతో కూడిన సమాచారం ఇస్తేనే గ్రామయువత, ప్రజలు వాళ్లసమస్యలపట్ల, గ్రామ సమస్యల పట్ల ప్రశ్నించే అవకాశం ఉంటుంది. గ్రామ సభ పాలకవర్గం కొరకు కాదు కదా గ్రామ ప్రజల కోసం అనేది గ్రహించాలి. కొన్ని గ్రామాలలో ఆరు నెలల నుండి గ్రామ సభలు నిర్వహించకపోవడం గమన్హారం.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### హార్టికల్చర్‌వైపు మొగ్గుచూపాలి

జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు విడుదలచేసిన నివేదిక ప్రత్యామ్నాయ పంటల వైపు ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపమని చెపుతుంది. రాష్ట్రంలో గత ఏడాదితో పోలిస్తే వరి సాగు దాదాపు 12 లక్షల ఎకరాల మేర తగ్గుతుంది. ధాన్యం ఉత్పత్తి కూడా దాదాపు 16శాతంమేర తగ్గుతుందని తెలిపిన నేపథ్యంలో తెలంగాణ కూరగాయలు హార్టికల్చర్ వైపు మొగ్గు చూపాలి.

- భారత అవినాష్, జనగామ

### కాలాన్ని వృథా చేయొద్దు

సాధారణంగా కొందరు పనిలేనివారు, వెళ్తున్న వారిని ఆపి, వాళ్ళ వ్యక్తిగత విషయాలను అడిగి తెలుసుకుంటూ కాలాన్ని వృథా చేస్తుంటారు. అసందర్భపు, అప్రస్తుతప్రస్తుత సంభాషణలతో అమూల్యమైన సమయాన్ని కేవలం కాలక్షేపం కోసం వృథా చేయడం అంత మంచిది కాదు. అవసరమైన మాటలు మాట్లాడుకుంటే ఉపయోగమేకాని, అనవసరమైన మా టలతో ఎంతోవిలువైన కాలాన్ని వృథాచేయడం మూర్ఖత్వమే అవుతుంది. డబ్బుపోయినా, ఆస్తులు పోయినా తిరిగి సంపాదించుకోవచ్చు. కానీ గడిచిపోయిన కాలం మాత్రం తిరిగి రాదని గుర్తుంచుకోవాలి. కాలంవిలువ తెలుసుకున్నవారే చక్కగా వృద్ధిలోకివస్తారు. కాలాన్నివృథా చేసేవారు జీవితంలో నిరర్థకంగా మిగిలిపోతారు. కనుక కాలాన్ని వృథా చేయకండి.

- కాయల నాగేంద్ర, హైదరాబాద్

### యుద్ధంపై చర్చలేదు

సెప్టెంబరు 12,13తేదీలలో ఢిల్లీలోజరిగిన బ్రిక్స్ సమావేశంలో పదకొండు మంది సభ్యులు మరో పదిమంది పార్టనర్ దేశాలు పాల్గొని అనేకజాతీయ, అంతర్జాతీయ సమస్యల మీద చర్చలు జరిపాయి. మన ప్రధాని మోడి గారు తన అద్భుత ప్రసంగాలతో ప్రపంచ దేశాల నాయకులను, ప్రజలను ఉత్తేజపరిచారు. ఈసమావేశాల మీదఅనేక వ్యాసాలు వార్తా పత్రికలలో ప్రచురించబడ్డాయి. అంతా బాగానేఉంది. ప్రస్తుతం సంవత్సరాలు, నెలల తరబడి కొన్ని దేశాల మధ్య తీవ్ర యుద్ధం జరుగుతోంది. వీటిని ఆపే ప్రయత్నం గాని, ప్రపంచ శాంతి పునరుద్ధరణకు గాని సీరియస్‌గా చర్చించినసందర్భం కనబడలేదు. ఈసమావేశాలు కేవలంమొక్కుబడిగా జరిగినట్టనిపిస్తోంది. ఎంతసేపు పాకిస్థాన్ చేసిన పహల్గామ్ దాడినే ఎజెండాలో ఒక పాయింట్‌ను చేర్చడం జరిగింది.

- డా.ఎన్.ఎస్.ఆర్.మూర్తి, సికింద్రాబాద్

### స్మార్ట్ రేషన్‌కార్డు పెద్ద సమస్యే

తెలంగాణా ప్రభుత్వం సివిల్ సప్లైస్ డిపార్టుమెంటువారు రేషన్ స్మార్ట్ కార్డులను జారీ చేసారు. ఇవి ఎ.టి.ఎమ్. కార్డు సైజులో ముద్రింపబడ్డాయి. వీటిలో కుటుంబ సభ్యుల పేర్లను పూర్తిగా రాయలేదు. ఆధార్ కార్డులో ఉన్నట్టు ఎడ్రసు లేదు. ఉదహరణకు తిరుమలగిరి మండలం, బీగం పేట8(మం), హైదరాబాద్(డి) 500010 అని రాయబడింది. కార్డులో ఇచ్చిన క్యూఆర్ కోడ్ స్కానింగ్ కావడం లేదు. రేషన్ కార్డు నెంబరు ఒక్కటే సరిగా ఉన్నది. త్వరలో ఇయ్యబోయే రేషన్ బియ్యం ఈ కార్డు ద్వారా ఇస్తే సరిలేకపోతే ఇదొక సమస్యే.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

# పెట్రోల్ బంకు నుంచి సూర్యుడి దాకా!

*వాహనం మారితే మాత్రమే రవాణా స్వావలంబనం రాదు. వాహనానికి శక్తినిచ్చే మూలం కూడా మారాలి. భారత్ వచ్చే పదేళ్లను శక్తి స్వావలంబన దిశగా మలచగలిగితే, దిగుమతి చమురుపై ఆధారాన్ని తగ్గించడంతో పాటు సౌరవిద్యుత్తు, బ్యాటరీలు, ఈవీలు, ఛార్జింగ్ మౌలిక వసతులు, పరిశోధన, దేశీయ తయారీ రంగాల్లో తన సామర్థ్యాన్ని మరింత పెంచుకునే అవకాశం ఉంటుంది. ప్రపంచంలో ముందంజలో నిలవాలన్న భారత లక్ష్యానికి ఇలాంటి శక్తిమార్పు ఒక బలమైనపునాది కావచ్చు. పెట్రోల్ బంకును మూసేయడం లక్ష్యం కాదు. పెట్రోల్ బంకుపై ఆధారపడాల్సిన అవసరాన్ని తగ్గించడం లక్ష్యం.*



శ్రీశైలం దూడం

ఒకప్పుడు వాహనంలో పెట్రోల్ పోయించుకోవాలంటే పెట్రోల్ బంకు ఎక్కడుంది? అని అడిగే వాళ్లం. కాలం మారేకొద్దీ ఎల్‌పీజీ, సీఎన్‌జీ వంటి ప్రత్యామ్నాయ ఇంధనాలు రవాణాలోకి వచ్చాయి. దీంతో అవసరాన్ని బట్టి ఎల్‌పీజీ, సీఎన్‌జీ గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్ ఎక్కడుంది? అని వెతికే పరిస్థితి వచ్చింది. ఇప్పుడు విద్యుత్ వాహనాల కాలంలో ఛార్జింగ్ స్టేషన్ ఎక్కడుంది? అని అడుగుతున్నాం. తరం మారింది. వాహనం మారింది. ఇంధనం మారుతోంది. సాంకేతికత పరుగులు పెడుతోంది. మరి మన ఆలోచన కూడా మరో అడుగు ముందుకు వేయాల్సిన సమయం రాలేదా? అసలు ప్రశ్న ఛార్జింగ్ కేంద్రం ఎక్కడుందన్నది మాత్రమే కాదు వాహనానికి అవసరమైన విద్యుత్తును మనమే ఎంతవరకు ఉత్పత్తి చేసుకోగలం? అన్నదే. పెట్రోల్, డీజిల్ కోసం చెల్లించే డబ్బులో గణనీయమైన భాగం దిగుమతుల రూపంలో దేశ సరిహద్దులు దాటుతుంది. కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద ముడిచమురు వినియోగదారు. వార్షిక ముడిచమురు దిగుమతి బిల్లు దాదాపు 144 బిలియన్ డాలర్లు, అంటే సుమారు రూ.13 లక్షల కోట్లు. అంతర్జాతీయ ధరలు, సరఫరా అంతరాయాలు, భౌగోళిక రాజకీయ పరిణామాలు మారినప్పుడల్లా దిగుమతులపై ఆధారపడే దేశాలకు ప్రభావం తప్పదు. అందుకే విద్యుత్ వాహనాల వైపు మారడం ఒక దశ మాత్రమే. ఆ విద్యుత్తు ఎక్కడి నుంచి వస్తోంది? అన్నదే తదుపరి ప్రశ్న. బొగ్గు, గ్యాస్ తదితర వనరులతో ఉత్పత్తి చేసిన విద్యుత్తుతో ఈవీని నడపడం ఒక మార్పు. అదే విద్యుత్తులో పెరుగుతున్న భాగాన్ని సూర్యుడి నుంచి పొందగలిగితే మరో మెట్టు. ఇంటి పైకప్పుపై సౌర విద్యుత్ ప్యానెళ్లు, ఇంటి వద్ద ఈవీ ఛార్జర్, అవసరమైతే బ్యాటరీ నిల్వ, స్మార్ట్ మీటర్-ఇవన్నీ ఒకే వ్యవస్థగా పనిచేసేరోజులు దూరంలో లేవు. ఇప్పటికే ఆ దిశలో పునాది పడుతోంది. 2026 ఆగస్టు 12 నాటికి పీఎం సూర్య ఘర్ పథకం కింద 51.58 లక్షల కుటుంబాలు రూఫ్‌టాప్ సోలార్ ద్వారా లబ్ధి పొందుతున్నాయి. 14.8 గిగావాట్ల సామర్థ్యం ఏర్పాటు కాగా, దాదాపు 19 లక్షల కుటుంబాలకు సున్నా విద్యుత్ బిల్లులు వస్తున్నాయని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. మరోవైపు ఈవీ రంగం కూడా వేగంగా విస్తరిస్తోంది. అంతర్జాతీయ ఇంధన సంస్థ ఐఈఏ ప్రకారం 2025లో ప్రపంచవ్యాప్తంగా ఎలక్ట్రిక్ కార్ల విక్రయాలు 2 కోట్లను దాటాయి. కొత్తగా అమ్ముడైన ప్రతి నాలుగు కార్లలో ఒకటి ఎలక్ట్రిక్ కారు. ఈ వాహనాల వినియోగం 2025లో రోజుకు సుమారు 12 లక్షల బ్యారెల్ల చమురు అవసరాన్ని భర్తీ చేసినట్లు ఐఈఏ అంచనా వేసింది. భారత్‌లో 2025లో ఎలక్ట్రిక్ కార్ల విక్రయాలు 75శాతం పెరిగి 1.65లక్షలకు చేరాయి. మొత్తం కార్ల విక్రయాల్లో వాటా దాదాపు నాలుగు శాతం. వీటిలో సుమారు 60 శాతం దేశీయంగా టాటా, మహీంద్రా సంస్థలు తయారు చేసినవేనని ఐఈఏపేర్కొంది. పీఎం ఈ-డ్రైవ్ పథకం కింద 2026 జూలై 22 నాటికి 23,22,878 ఎలక్ట్రిక్ వాహనాలకు ప్రోత్సాహకాలు అందించినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ప్రజా ఈవీఛార్జింగ్ కేంద్రాల ఏర్పాటుకు రూ.2,000 కోట్లు కేటాయించగా, 6,562 ఛార్జర్ల ఏర్పాటుకు రూ.689 కోట్లు ఆమోదించింది. ఇక్కడే తదుపరి ఆలోచన మొదలవ్వాలి. పెట్రోల్ బంకు నుంచి ఛార్జింగ్ కేంద్రానికి వచ్చాం. ఇక ఛార్జింగ్ కేంద్రం నుంచి సూర్యుడి దాకా వెళ్లాలి. ప్రతి ఈవీపై తప్పనిసరిగా సౌర ప్యానెళ్లు అమర్చాలన్నది ఆలోచన కాదు. వాహనం కదులుతూనే సూర్యకాంతితో విద్యుత్తు ఉత్పత్తి




చేసుకునే సాంకేతికతపై పరిశోధనలు జరుగుతున్నాయి. అయితే వాహనం పైకప్పుపై పరిమిత స్థలం, ప్యానెళ్ల బరువు, ఉష్ణోగ్రత, దుమ్ము, వర్షాలు, నీడ, తయారీ వ్యయం వంటి సవాళ్లు ఉన్నాయి. అందుకే ప్రయోగశాల ఫలితాలను వెంటనే సామూహిక వినియోగానికి సిద్ధమైన సాంకేతికతగా చూడకుండా, భారత వాతావరణ పరిస్థితుల్లో దీర్ఘకాలిక పరీక్షలు, ఖర్చు-ప్రయోజన విశ్లేషణ, మన్నిక పరీక్షలు జరపాలి. వాహనం మీద ప్యానెల్ పెట్టకపోయినా సూర్యుడి విద్యుత్తును వాహనానికి అందించవచ్చు. అపార్ట్‌మెంట్ల పార్కింగ్ ప్రదేశాలు, కార్యాలయాలు, మార్కెట్లు, పాఠశాలలు, ఆసుపత్రులు, బస్టాండ్లు, హైవే పక్కన ఉన్న పార్కింగ్ ప్రాంతాల్లో సోలార్ కార్‌పోర్టులు ఏర్పాటు చేసి పగటిపూట ఉత్పత్తి చేసిన విద్యుత్తుతో వాహనాలను ఛార్జ్ చేయవచ్చు. అవసరమైన చోట బ్యాటరీ నిల్వను జత చేయవచ్చు. గ్రామీణప్రాంతాల్లో ఈ-ఆటోలు, చిన్న సరకు వాహనాలు, వ్యవసాయ అవసరాల కోసం ఉపయోగించే విద్యుత్ వాహనాలకు స్థానిక సౌర విద్యుత్తుతో చిన్న ఛార్జింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయవచ్చు. సూర్యుడు పగటిపూట ఉన్నా వాహనం అవసరం రాత్రి రావచ్చు కాబట్టి బ్యాటరీ నిల్వ కూడా కీలకం. రూఫ్‌టాప్ సోలార్, బ్యాటరీ నిల్వ, ఈవీ ఛార్జింగ్, స్మార్ట్ మీటరింగ్, స్థానిక విద్యుత్ గ్రిడ్ సామర్థ్యాన్ని సమన్వయం చేయాలి. భవిష్యత్తులో వాహనం నుంచి ఇంటికి లేదా గ్రిడ్‌కు విద్యుత్తు పంపే ద్విముఖ ఛార్జింగ్ సాంకేతికత కూడా ఉపయోగపడే అవకాశం ఉంది. సౌర విద్యుత్‌లోనూ పరిశోధన వేగంగా సాగుతోంది. సిలికాన్‌తో పాటు పెరోవ్‌స్కైట్ ఆధారిత టాండమ్ సౌర కణాలు అధిక సామర్థ్యాన్ని సాధిస్తున్నాయి. అయితే ప్రయోగశాలలో సాధించిన సామర్థ్యం, తక్కువ ఖర్చుతో దీర్ఘకాలం పనిచేసేవాణిజ్య ఉత్పత్తి ఒకటే కాదు. మన్నిక, భారీస్థాయి తయారీ, వ్యయం, భారత వాతావరణ పరిస్థితుల్లో పనితీరు వంటి అంశాలపై మరింత పరిశోధన అవసరం. అందుకే మన దృష్టి కేవలం ఎన్ని ఈవీలు అమ్ముడయ్యాయి? అనే లెక్కపైనే ఉండకూడదు. ఎన్ని ఈవీలకు దేశీయంగా ఉత్పత్తి చేసిన సౌర విద్యుత్తు అందుతోంది? అనే ప్రశ్న కూడా భవిష్యత్తు విధాన చర్చలో భాగం కావాలి. ఈవీ తయారీతో పాటు సోలార్ ప్యానెళ్లు, బ్యాటరీలు, ఛార్జర్లు, విద్యుత్ నియంత్రణ పరికరాలు, నిల్వ వ్యవస్థల దేశీయ తయారీ పెరిగితే కొత్త పరిశ్రమలకు, ఉపాధికి అవకాశాలు ఏర్పడవచ్చు. ఇంటి పైకప్పుపై ఉత్పత్తి చేసిన విద్యుత్తులో కొంత భాగాన్ని ఇంటి అవసరాలకు, కొంత భాగాన్ని వాహన ఛార్జింగ్‌కు వినియోగించగలిగితే కొనుగోలు చేసే విద్యుత్తు లేదా పెట్రోల్-డీజిల్‌పై ఆధారపడే వ్యయం తగ్గే అవకాశం ఉంటుంది. అయితే వాహనం ఉచితంగా నడుస్తుందనడం సరికాదు. వాహన కొనుగోలు, బ్యాటరీ, బీమా, టైర్లు, నిర్వహణ, ఛార్జింగ్ పరికరాలు వంటి ఖర్చులు ఉంటాయి. లక్ష్యం ప్రయాణాన్ని ఉచితం చేయడం కాదు, శక్తి కోసం బయటకు వెళ్లే డబ్బును సాధ్యమైనంతవరకు దేశంలోనే ఉంచడం. విధానపరంగా రూఫ్‌టాప్ సోలార్‌తో ఈవీ ఛార్జింగ్‌ను అనుసంధానించే పట్టణ, గ్రామీణ ప్రయోగాత్మక ప్రాజెక్టులు చేపట్టవచ్చు. అపార్ట్‌మెంట్లు, కార్యాలయాలు, ప్రజా పార్కింగ్ ప్రాంతాల్లో సోలార్ కార్‌పోర్టులు, బ్యాటరీ నిల్వ, స్మార్ట్ ఛార్జింగ్ వ్యవస్థలను ప్రోత్సహించవచ్చు. వాహనాలపై సౌర విద్యుత్తు ఉత్పత్తి, అధిక సామర్థ్య సౌరకణాలు, తక్కువ ఖర్చు బ్యాటరీలు, ద్విముఖ ఛార్జింగ్ వంటిరంగాల్లో భారతీయ పరిశోధనా సంస్థలు-వాహన తయారీదారులు కలిసి దీర్ఘకాలిక పరిశోధన చేయవచ్చు. ప్రతివాహనం వెంటనే ఈవీగామారడం సాధ్యంకాదు. విమానాలు, భారీ రవాణా, నౌకాయానం వంటి రంగాలకు వేర్వేరు శక్తి పరిష్కారాలు అవసరం. అందుకే విద్యుదీకరణతో పాటు ఇతర ప్రత్యామ్నాయ ఇంధన సాంకేతికతల అభివృద్ధి కూడా కొనసాగాలి. వాహనం మారితే మాత్రమే రవాణా స్వావలంబనం రాదు. వాహనానికి శక్తినిచ్చే మూలం కూడా మారాలి. భారత్ వచ్చే పదేళ్లను శక్తి స్వావలంబన దిశగా మలచగలిగితే, దిగుమతి చమురుపై ఆధారాన్ని తగ్గించడంతో పాటు సౌరవిద్యుత్తు, బ్యాటరీలు, ఈవీలు, ఛార్జింగ్ మౌలికవసతులు, పరిశోధన, దేశీయతయారీ రంగాల్లో తన సామర్థ్యాన్ని మరింత పెంచుకునేఅవకాశం ఉంటుంది. ప్రపంచంలో ముందంజలో నిలవాలన్న భారత లక్ష్యానికి ఇలాంటి శక్తిమార్పు ఒకబలమైనపునాది కావచ్చు. పెట్రోల్ బంకును మూసేయడం లక్ష్యం కాదు. పెట్రోల్ బంకుపై ఆధారపడాల్సిన అవసరాన్ని తగ్గించడంలక్ష్యం. ●

# శ్రమజీవి సంక్షేమమే సమాజానికి రక్ష

ముద్దగౌని సుభాష్

అమ్మకు చదువొస్తే, అందరికీ వచ్చినట్లే అనే సూక్తి ఎంత నిజమో ప్రతిపక్షం బాగుంటే, ప్రజలు బాగుంటారు అన్నది కూడా అంతే నిజం! ముఖ్యంగా పార్లమెంటరీ వ్యవస్థలో, ప్రతిపక్ష పార్టీలు బాధ్యతాయుతంగా పని చేస్తేనే, ప్రభుత్వ పాలన కూడా, పారదర్శకంగా ఉండే అవకాశం ఉంటుంది. ఎందుకంటే రాచరిక వ్యవస్థ నుండి నేటి ప్రజాస్వామ్య పాలన వరకు కూడా, రాజులైనా నేటి పాలకులైనా తమంతట తాముగా ప్రజల కోసం చేసింది ఏమీ లేదు! అక్కడక్కడ ఏవైనా అడగకుండానే కొన్ని సౌకర్యాలు కల్పించారు అంటే, అది కచ్చితంగా వారి స్వప్రయోజనాలు అందులో ఇమిడి ఉన్నాయి అనిఅర్థం! ఏదిఏమైనా, ఈరోజు ప్రజలు అనుభవిస్తున్న ప్రతి ప్రభుత్వ సౌకర్యాల వెనుక, ప్రజలు చేసిన పోరాటాలున్నాయి. అవి ప్రతిపక్ష పార్టీల రూపంలో కావచ్చు. ప్రజా పోరాటాల రూపంలో కావచ్చు. ప్రజలు పాలకులను నిలదీసిన ఫలితంగాకావొచ్చు! ఈ విధంగా అనేక రూపాల్లో ప్రశ్నించే ప్రజల ఉద్యమాలే, ప్రతిపక్ష పార్టీల పోరాటాలే.. దేశంలో జరిగిన అభివృద్ధికి ప్రధాన కారణం! అయితే ప్రతిపక్షం అంటే ప్రశ్నించడం కాబట్టి, ప్రశ్నలు ఎక్కడైనా ప్రశ్నలాగా మిగిలిపోకూడదు. ఆ ప్రశ్నకు ఒక సామాజిక ప్రయోజనం ఉండాలి! సమాజం పట్ల, సామాజిక సమస్యల పట్ల అవగాహన ఉండాలి. ముఖ్యంగా ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయాలనేసంకల్పం కంటే, ప్రజలకు మేలు జరిగే పనులు సాధించుకోవాలనే పట్టుదల ఉండాలి. ఇక వ్యక్తులను ప్రశ్నించేటప్పుడు ఆ ప్రశ్నల్లో సహేతుకత, శాస్త్రీయత, సామాజిక స్పృహ ఉండాలి. అంతేగాని ఆ వ్యక్తుల వ్యక్తిత్వం మీద దాడిచేసే విధంగా, వారిని అగౌరవపరిచే విధంగా ఉండకూడదు. గ్రామ పంచాయతీ నుండి అసెంబ్లీ పార్లమెంట్ వరకు కూడా, సర్పంచ్ మొదలుకొని మంత్రులవరకు కూడా వాళ్ల పాలనలో ఏదైనా ప్రజలకు ఉపయోగపడే పనులు చేసినప్పుడు, వాళ్లను అభినందించాలి. అదే సమయంలో ప్రజలకునష్టం కలిగే పనులు చేసినప్పుడు, కచ్చితంగా వారినిప్రశ్నించాలి. అంతేకానీ మనకు వ్యతిరేక పార్టీ కాబట్టి, అతను ఏమంచి పని చేసినా మనం వ్యతిరేకించాలి, అనే అప్రజాస్వామిక ధోరణి ఉండకూడదు! ప్రజల కోసం మంచి పనులు చేయడం పాలకుల విధి కదా. అలాంటప్పుడు వాళ్ళని ఎందుకు అభినందించాలి? అని కొందరు అనుకోవచ్చు. ఎందుకంటే, మన అభినందన వాళ్లకి ప్రోత్సాహాన్నిస్తుంది. అప్పుడువాళ్లు ప్రజలకు, మరిన్ని ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించడానికి ఉపయోగపడుతుంది కాబట్టి! ఇక ఎన్నికల వ్యవస్థను పూర్తిగా భ్రష్టుపట్టించిన ప్రస్తుత పరిస్థితుల్లో, ప్రతిపక్ష పార్టీల పాత్రమరింత బాధ్యతాయుతంగా నిర్వహించాల్సిన అవసరం ఉంది! సంపన్నులు, బడా పెట్టుబడిదారులు రాజకీయాల్లోకి వచ్చి, వారి అక్రమ సంపాదన అంతాపెట్టుబడిగా ఎన్నికల్లో ఖర్చుపెట్టి, అధికారాన్ని కైవసం చేసుకుంటున్నారు. ఈ పరిణామాల ఫలితంగా కొన్ని గ్రామాల్లో, ప్రతిపక్ష పార్టీలమెంబర్లు లేని గ్రామపంచాయతీ వ్యవస్థ నెలకొని ఉంది! ఇలాంటప్పుడు ఆ గ్రామపరిస్థితి ఎట్లా ఉంటుందో ఒక్కసారి ఆలోచించండి! గ్రామ అభివృద్ధి పనులకు సంబంధించిన విధానం, ఎంత ఒంటెద్దు పోకడతో ఉంటుందో ఆలోచించండి! అక్కడ ఆ సర్పంచ్‌లపాలన, ఎంత నిరంకుశంగా ఉంటుందో ఆలోచించండి! మరి ఇలాంటి పరిస్థితులు ఉన్నచోట, ఆగ్రామంలో ఉన్న ప్రతిపక్ష పార్టీలు ప్రజలకు అండగా ఉండాలి. ప్రజలను కలుపుకొని, ప్రధాన ప్రతిపక్షం అవ్వాలి. అప్పుడే ఆ గ్రామ పాలనగాడి తప్పకుండా ఉంటుంది! అయితే సంపన్నులు కూడా మనుషులేకదా. వారి పాలన ఇట్లా ఎందుకు ఉంటుంది అంటే ఈ సంపన్నుల స్వభావంలో, సామాజిక స్పృహ ఉండదు కాబట్టి! వీళ్లలో ఉండేదల్లా స్వార్థం, అందిన కాడికి దోచుకోవడం, కీర్తికాంక్షలు పెంచుకోవడమే ఉంటుంది. ఎందుకంటే వీళ్లకుఆకలి, అసమానతలు, వివక్షలు, పేదరికం తెలియవు కాబట్టి! అందుకే ఈదేశానికి సంపద ఉన్నవాళ్లు కాదు, సామాజికస్పృహ ఉన్నవాళ్లే, సమాజ పాలకులు కావాలి! అప్పుడే శ్రామిక ప్రజల బతుకులుబాగుపడతాయి! కాబట్టి రాజకీయ రంగంలో అయినా, మరేరంగంలో అయినా, సమాజంలోజీవించే వాళ్ళకి కనీస సామాజిక చైతన్య జ్ఞానం ఉండాల్సిన అవసరం ఉంది. ఈ సమాజం ఏ దేవుళ్ళతోనో మరెవరితోనో నడవడంలేదు. ఇది కులాలకు మతాలకు అతీతంగా, సకల శ్రామిక ప్రజలు శ్రమలు చేస్తేనే, ఈ సమాజం మనుగడ సాగిస్తోంది. కాబట్టి ఈసమాజ పురోగతికి కారణమవుతున్న శ్రమజీవుల సంక్షేమా నికి, వారి జీవన వికాసానికి మనం కృషి చేయాలి అని తెలియజెప్పే జ్ఞానమే సామాజికజ్ఞానం! ఈ జ్ఞానాన్ని ప్రజలు పెంపొందించుకోవాలి. ●

# సంబరాలు సరే.. సామాజిక బాధ్యత లేదా?

గుళ్ళపూడి

దేశవ్యాప్తంగా కోట్లాదిమంది ఘనంగా గణపతి నవరాత్రి వేడుకల్ని చేసుకున్నారు. డీజే సంగీతం, ఆడంబరంగా తీర్చిదిద్దిన మండపాలు, భారీ అలంకరణల గణేశ విగ్రహాలతో పూజలు, నిమజ్జనాలు వైభవంగా నిర్వహించారు. కొన్ని పెద్ద నగరాల్లో అయితే సెప్టెంబర్ 25 (శుక్రవారం) నాటి నిమజ్జనం విగ్రహాల తాకిడితో రెండు రోజుల పాటుకొనసాగే పరిస్థితి ఏర్పడింది. ఎన్నో చోట్ల భక్తి తత్పరతతో అన్నదానాలు, ప్రసాద వితరణ పెద్ద ఎత్తున సాగించారు. ఇదంతా బాగుంది కానీ అత్యంత కీలకమైన సామాజిక బాధ్యతను ప్రతి ఒక్కరూ విస్మరించడమే బాధాకరంగా మారింది. పేదరికం, అనారోగ్య పరిస్థితులు సహా ఏ సమస్యలపై అయితే గత కొన్ని దశాబ్దాలుగా దేశమంతటా ఎన్నో ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు పని చేస్తున్నట్టు చెప్పుకుంటున్నామో ఆ ప్రయత్నాలన్నింటినీ వెక్కిరించేలా ఈ వేడుకలు సజీవ సాక్ష్యంగా నిలిచాయి. ఇందులో ప్రభుత్వం, ప్రజలు అందరివంతూ ఉందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇటీవలి గణపతి నవరాత్రుల సందర్భంగా ఈ పరిణామాలుయావత్ దేశమంతటా కనిపించినప్పటికీ మరీ ముఖ్యంగా రాష్ట్రపాలక వర్గం, పెద్ద సంఖ్యలో అధికార, విపక్ష పార్టీల ప్రజాప్రతినిధులు కొలువైన హైదరాబాద్ నగరంలోనూ చూడాల్సి రావడం దురదృష్టకరం. వినాయక చవితి పండుగ అనగానే అందరికీ ఠక్కున గుర్తుకు వచ్చేది హైదరాబాదులోని ఖైరతాబాద్‌లో కొలువయ్యే బడా గణేశ్, ఆ తర్వాత లడ్డూ వేలం పాటకు ప్రసిద్ధి చెందిన బాలాపూర్ గణేశుడు. ముఖ్యంగా ఈ రెండు చోట్లా, అలాగే మరిన్ని ప్రాంతాల్లో జరిగిన నవరాత్రి వేడుకల్లో పెద్దఎత్తున చూడాల్సి వచ్చిన దృశ్యమేంటంటే పిల్లలకు వారి తల్లులే గాంధీ వేషం వేసి వారిని ఆయా మండపాల వద్ద గంటలు గంటలు నిలబెట్టి భిక్షాటన చేయించారు. ఆ పిల్లలకు ప్రమాదకర రసాయనాలతో కూడిన సిల్వర్ రంగు పూశారు. ఈ రంగుల వల్ల చర్మంపై బొబ్బలు వచ్చి, శరీరం ఎర్రబడి మంట, దురద వంటి ఎన్నో సమస్యలు వస్తాయి. ఈ సిల్వర్ ఎనామిల్ పెయింట్ చర్మంలోని స్వేద రంధ్రాలను మూసివేసి, చెమటబయటకు రానివ్వదు, దాంతో శరీర ఉష్ణోగ్రత పెరిగి సొమ్మసిల్లి పడిపోతారు. ఇదంతా అందరికీ బహిరంగంగా కనిపించేదే. అక్కడే పోలీసులు, అధికారులు, ప్రజలు అందరూ వారిని చూస్తూ తిరుగుతుంటారు. ఎవరికీ ఏమీ పట్టదు. పేదరికం, నిరక్షరాస్యత వల్ల వారు ఇలా చేస్తున్నప్పటికీ కనీసం చూసేవారైనా పట్టించుకోకపోవడాన్ని ఏమనుకోవాలి? ఈ పండుగల సందర్భంగా నాలుగు డబ్బులు సంపాదించుకోవడానికి సొంత రాష్ట్రం నుంచేగాక పక్కరాష్ట్రాలు, ఇంకా బీహార్, ఛత్తీస్‌గఢ్ లాంటి దూర ప్రాంతాల నుంచి సైతం



చిరు వ్యాపారులు హైదరాబాద్ బాట పట్టారు. వీరు తమ పిల్లా పాపలతో వచ్చి కుటుంబమంతా ఈ పది రోజులూ చిన్నచిన్న వస్తువులు అమ్ముకుంటూ గణపతి మండపాల చుట్టు పక్కలే కాపురాలు పెట్టారు. ఈ చిరువ్యాపారులలో పెద్ద సంఖ్యలో మహిళలూ ఉన్నారు. వీరిలో చంటిపాపలున్న మహిళలు వారిని చంకనెత్తుకుని వ్యాపారులు చేసుకోగా, నాలుగైదేళ్ళు, ఆ పై వయసున్న పిల్లల్ని ఆ రోడ్లపై అలాగే వదిలేయడం కనిపించింది. ఈ పిల్లలు తినీ తినక అనారోగ్య కర పరిస్థితుల్లో అక్కడక్కడే తిరుగుతూ పూట గడిపేయడం కనిపించింది. ఆడపిల్లల పరిస్థితి మరీ దారుణం. కర్రలకు కట్టిన తాళ్ళపై ఆడుతూ జీవనం సాగిస్తున్న వారు కూడా కనిపించారు. ఈ వ్యాపారులంతా అత్యంత నిరుపేదలైన సంచార వర్తకులు. ఎక్కడ పండుగ, జాతరల్లాంటివి జరిగినా ఆపిల్లలతో పాటు అక్కడికి వెళ్ళిపోయి వ్యాపారం చేసుకుంటూ ఉంటారు. ఫలితంగా ఆ పిల్లలకు స్థిరనివాసమనేది లేక విద్యావకాశాలు లభించక, పౌష్టికాహారం దొరకక అదే పేదరికంతో జీవితాలు గడిచిపోయి దారీ తెన్నూలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. నిజానికి ఇది దేశవ్యాప్తసమస్య, అందువల్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇలాంటి వారి విషయంలో సంయుక్త కార్యాచరణచేపట్టాలి. ఇలాంటి నిరుపేద వ్యాపారులను గుర్తించి వ్యవస్థీకృతం చేయకుంటే వీరి జీవితాలు ఎప్పటికీ ఇలాగే ఉండిపోతాయి. వీరిలో చాలామందికి ఓట్లుండవు కనుకనే రాజకీయ నాయకులు పట్టించుకోరని అనుకోవాలా? నిజానికి ఇది దీర్ఘకాల ప్రణాళిక. కానీ ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు దృష్టి పెడితే వీరి జీవితాలను గాడిన పెట్టవచ్చు. శతాబ్దాలు, దశాబ్దాల పాటు దేశాన్ని పీడించిన ఎన్నో సమస్యలను మనం పరిష్కరించుకున్నాం. ఈ అత్యంత నిరుపేదసంచార వ్యాపారులకు మొదట తాత్కాలికంగా ఏం చెయ్యవచ్చని ఆలోచిస్తే, సాధారణంగా సామూహిక ఉత్సవాలైన గణపతి నవరాత్రులు, దేవీ నవరాత్రుల వంటి పలు సందర్భాలలో ఈ వ్యాపారులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. వీరి కోసం ఆ 10రోజులూ ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలి. వీరి పిల్లలకు ఆ కొద్దిరోజుల పాటు ఆటపాటలతో చదువుచెప్పే సంచార పాఠశాలలు నిర్వహించాలి. ఇలా చేస్తున్న స్వచ్ఛంద సంస్థలున్నాయి. పేదలైన తల్లిదండ్రులు స్వస్థలాలు వీడి వ్యాపారాలకు వెళ్ళి నప్పుడు పిల్లల చదువులు పాడవకుండా వీరికి హాస్టల్‌వసతి కల్పించాలి. ఈ నిరుపేద సంచార వర్తకులకు వారి ఆసక్తిని బట్టి శిక్షణ నిచ్చి తమ ప్రాంతాల్లోనే ఆయా వృత్తుల్లో స్థిరపడేలా ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు విస్తృత అధ్యయనంతో పథకాలను అమలుచేస్తే వీరి జీవితాల్లో వెలుగులు నింపవచ్చు. ●

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు

మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# దేశ ప్రగతికి అంకితమైన మహోన్నతుడు అశోక్ సింఘాల్

## ఆయన జ్ఞాపకాలను స్మరించుకున్న ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 27:** 'పరోపకారార్థమిదం శరీరం' అని మన ప్రాచీన వివేచనాత్మక నానుడి. ఈ ప్రకృతిలో వృక్షం తన పండ్లను తానే ఆరగించదు ఏ నదీ తన నీటిని తానే తాగదు అలాగే సాధుజనులు కూడా ఈ ధరణిపై ఆ స్ఫూర్తితోనే జన్మనెత్తుతారని ఇది ప్రబోధిస్తుంది. ఆశ్రితులకు పండ్లతో ఆకలి తీర్చే వృక్షం. తీరం చేరినవారికి దప్పిక తీర్చే నది. వ్యక్తిగత విజయం కన్నా సాటివారి సంక్షేమానికి అంకితమైన జీవితానికి ఎంతో పరమార్థం ఉంటుందని మన ఋషులు, మునులు అనాదిగా ప్రబోధిస్తూనే వచ్చారు. ఆ స్ఫూర్తిని తన జీవితంలో నింపుకొని ప్రతిబింబించిన వ్యక్తుల్లో అశోక్ సింఘాల్ కూడా ఒకరు. 1981నాటి ఒక సంఘటనలో ఆయన స్వదస్తూరితో రాసిన లేఖ నాకు అందింది. సహజంగానే నాకు అదొక ప్రత్యేక సం దర్భంగా అనిపించింది. త్వరలో చేపట్టబోయే ఓ కీలక కార్యక్రమాన్ని ఆ లేఖలో ప్రస్తావిస్తూ, ఆయన కర్తవ్య నిర్దేశం చేశారు. ఆయన దశ ఖాలపాటు రేయింబవళ్లు శ్రమించడం నేను స్వయంగా చూశాను. ప్రత్యేకించి గుజరాత్‌లోని గిరి జన ప్రాంతాలలో పర్యటనకు ఆయన ఆసక్తి చూపేవారు. దేశంలోని ఏ ప్రాంతంలోనైనా ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే, బాధితులకు ఆపన్న హస్తం అందించడం కోసం అందరికన్నా ముందు అక్కడికి చేరడం, లేదా అప్పటికే చేరు కున్న కార్యకర్తలకు దిశా నిర్దేశం చేయడంలో అశోక్ అగ్రస్థానంలో ఉండేవారు. గుజరాత్‌లోని కచ్‌లో 2001 నాటి భూకంపం తర్వాత ఆయనతో కలిసి పనిచేసిన నా అనుభవం చిరస్మరణీయం. సాటి మానవులపై కరుణ, వారి సంక్షేమంపై శ్రద్ధ చూపే విశిష్ట లక్షణాలను అశోక్ జీ బాల్యంలోనే అలవరచు కున్నారు. ఆయన తండ్రి మహావీర్ పరిపాలన యంత్రాంగంలో అత్యున్నత హోదాగల అధికారి. అలాంటి ఎంతో గొప్ప, సంపన్న కుటుంబంలో అశోక్ సింఘాల్ జన్మించారు. ఆయన సోదరులలో ఒకరైన బి.పి. సింఘాల్ పోలీసు అధికారిగా ఉద్యోగం చేసి, ఆ తర్వాత పార్లమెంటు సభ్యుడిగా ప్రజలకు సేవలందించారు. మరో సోదర వి.పి.సింఘాల్ త్రిపుర రాష్ట్రం ఏర్పడి నప్పుడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. అశోక్ చిన్న నాటినుంచే భిన్న దృక్కో ణం వైపు ఆకర్షితులయ్యారు. మాతృ భూమికి పునరుజ్జీవం, భరతమాత బిడ్డల పూర్వ వైభవ పునరుద్ధరణ. చిన్నతనాన ప్రయాగ్‌రాజ్‌లో నదీ సంగమం వద్ద అశోక్ గంటల తరబడి దీర్ఘా లోచనలో మునిగిపోయేవారు. అక్కడ ఆ నదిని చూస్తూ, దానిపైనే కాకుండా, అక్కడ పుణ్యస్నానాలు చేయడానికి వచ్చే సాధువులు, సన్యాసులు, భక్తులపైనా ఆసక్తి పెంచుకున్నారు. పరోపకారార్థమిదం శరీరం అనే నానుడికి అనుగుణంగా ఆయన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) వైపు ఆకర్షితులయ్యారు. తదాదిగా తనకు అప్పగించిన ప్రతి బాధ్యతను ఉత్సాహం తో,క్రమశిక్షణతో, కర్తవ్య భావనతో నిర్వర్తించారు. పట్టుదల, అవిరళ కృషితో సంస్థలను, ఉద్య మాలను అశోక్ సింఘాల్ నడిపించారు. అద్భుత కంఠస్వరం, యావత్ సభను మంత్రముగ్ధం చేయగల వాగ్ధాటి ఆయన సొంతం. మరోవైపు సాటి కార్యకర్తలతో సోహార్ద సంబంధాలపై ఆయన శ్రద్ధ కూడా ప్రశంసనీయం. సింఘాల్‌తో పరిచయం తర్వాత ఆయనెంత నిరాడంబరుడో తెలిసి, అందరూ ఆశ్చర్యపోవాల్సిందే. సాధువుల తులలోనూ ఆయనకు ప్రగాఢ అనుబంధం ఉండేది. కాబట్టే, దేశంలోని సాధువులు, దార్శ నికులలో ఆయనపై అపార గౌరవం కనిపించేది. వారంతా ఆయన సలహాలు, సూచనలకు ఎంతో విలువనిస్తూ, శ్రద్ధగా ఆలకించేవారు. ఈ నేపథ్యంలో అశోక్ సింఘాల్ మహోన్నత వ్యక్తి త్వాన్ని చాటే రెండు సందర్భాలను స్మరిం కొస్తున్నాను. మొదటిది షికాగోలో స్వామి వివేకానంద ప్రసంగ శతాబ్ది వేడుకల్లో భాగంగా 1993 లో విశ్వ హిందూ పరిషత్ అమెరికాలో ఒక సదస్సును నిర్వహించింది. అనేక ఇలాంటి కార్యక్రమాన్ని విదేశాల్లో నిర్వహించాలనే విశిష్ట ఆలోచన, తదనుగుణ ప్రణాళిక, వివిధ భాగస్వాములను ఏకతాటిపైకి తేవడం ఆయనలోని అసమాన నిర్వహణ సామర్థ్యానికి మచ్చుతునకలు. ఇక రెం డోది ట్రినిడాడ్‌టొబాగోలోని పోర్ట్ ఆఫ్ స్పెయిన్‌లో ప్రపంచ హిందూ సదస్సు 2000 నిర్వహణ. రామజన్మభూమి ఉద్యమంలో అశోక్ సింఘాల్ కీలక పాత్ర పోషించిందన్ని గుర్తుచేసుకోకపోతే ఆయన ప్రస్థానానికి అర్థం ఉండదు. ఆయన 1991నాటి బోట్ క్లబ్ సభలో చేసిన ప్రసంగం ప్రతి ఒక్కరి మదిలో నేటికీ నిలిచి ఉంది. సమాజం సామరస్యం నెలకొనాలని, సౌభ్రాత్ర భావన సందేశాన్ని పునరుద్ఘాటించాలని ఆయనెంతో గట్టిగా చెప్పేవారు. ఈ స్పష్టమైన వ్యక్తీకరణ ఆయన విశ్వాసంలో వ్యక్తమయ్యేది. అయోధ్యలో రామమందిర నిర్మాణానికి తొలి పునాది రాయిని బీహార్‌లోని అణగారిన వర్గాల క్షేత్రస్థాయి విహెచ్ పీ కార్యకర్త కామేశ్వర్ చౌపాల్ చేతుల మీదుగా వేయించాలన్నది ఆయన ఆలోచనే. ఇక కాశీలో ఒక దళిత పరిరక్షణ సభలో డోమ్ రాజును సత్కరించాలని నిర్ణయించుకున్నది ఆయనే, ఆ తర్వాత వివిధ సామాజిక కార్యక్రమాలలో ఆయనతో కలిసి పనిచేశారు. దేశ పునర్‌గమనంతోపాటు మరో రెండు రంగాలపై అశోక్ సింఘాల్ ఎంతో ఆసక్తి చూపేవారు. వాటిలో ఒకటి విద్య రెండోది సంగీతం. బీహెచ్‌యూలో విద్యాభ్యాసం చేసిన సమయంలో ఉత్తమ విద్యార్థిగా ఎంతో ప్రశంసలు పొందారు. అశోక్ సింఘాల్ అద్భుత గాయకుడని ఆయనతో సాన్నిహిత్యం గలవారికి తెలుసు. నాగ్‌పూర్‌లో సమావేశాల సందర్భంగా ఆయన ఏకల్ గీత్ ఆలాపనతో అందరినీ ఆశ్చర్యచకితులను చేయడం నేను ప్రత్యక్షంగా చూశాను. తద్వారా ఆయన సమావేశాలకు ఒక సువ్యాద్వారా వాతావరణాన్ని సృష్టించేవారు. ముఖ్యంగా తన 90వ జన్మదినం సందర్భంగా 2015లో ఆయన అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తుతూ 'హే మాత్ర భూమి మేరే హే పితృభూమి మేరే' అని పాడిన వీడియో ఎంతగా ప్రజల్లోకి దూసుకెళ్లిందో నాకిప్పటికీ గుర్తుంది. ఈ నేపథ్యంలో ఆవాళ ఆయన శతజయంతి సందర్భంగా యువతరం మరింతగా ఆయన మహోన్నత వ్యక్తిత్వ సింఘాల్ గురించి తెలుసుకునేలా మనం కృషి చేద్దాం. మన మాతృభూమి కోసం, ప్రజా సంక్షేమం కోసం ఆయన కన్న కలల సాకారం దిశగా మన ప్రతిజ్ఞను పునరుద్ఘాటిద్దాం.



# రక్షణ రంగంలో స్వయంప్రతిపత్తి

## రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 27:** చిన్న స్క్రూల నుంచి చిప్స్, పూర్తిస్థాయి ఆయుధ వ్యవస్థల వరకు అన్నీ దేశంలోనే తయారు చేయడం ద్వారా భారత్ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని సాధిస్తుం దని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. దేశం ప్రస్తుతం అదే దిశగా ముందుకు సాగుతోందని ఆయన అన్నారు. ఆదివారం జరి గిన డిఫెన్స్ సమ్మిట్‌లో ఆయన మాట్లాడుతూ మేక్ ఇన్ ఇండియా విధానం వెనుక ఉన్న ఉద్దే శాన్ని వివరించారు. మన సిద్ధాంతం చాలా సుల భం. ఇక్కడ తయారు చేయగలిగిన వస్తువును బయట నుంచి ఎందుకు కొనుగోలు చేయాలి దీన్నే మనం స్వావలంబన అంటాం. చిప్స్ నుం చి నౌకల వరకు, స్క్రూల నుంచి సంపూర్ణ ఆ యుధ వ్యవస్థల వరకు దేశీయంగా తయారు చేయడం ద్వారానే వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి సాధ్యమవుతుందని రాజ్‌నాథ్ సింగ్ నొక్కి చెప్పారు. భవిష్యత్ సవాళ్లను ఎదుర్కోవడానికి భారత్ సన్నద్ధతపై మాట్లాడుతూ, రక్షణ రంగం లో ఇప్పటికే కీలకమైన, నిర్మాణాత్మక సంస్క రణలు చేపట్టామని తెలిపారు. మేము కేవలం ప్రస్తుత అవసరాలను తీర్చడానికే పరిమితం కాలేదు. స్వావలంబన, భవిష్యత్ లక్ష్యాలతో ముందుకు వెళుతున్నాం. రక్షణ రంగం వేగం పుంజుకుందని ఆయన వివరించారు. టెలికాం రంగంలో 2జీ నుంచి 5జీకి మారిన వృద్ధిని ఉదా హరణగా చూపుతూ, యుద్ధ తంత్రాలు కూడా ఇప్పుడు 5వ తరంలోకి ప్రవేశించాయని అన్నా రు. ప్రస్తుతం 5వ తరం యుద్ధాలపై చర్చ జరు గుతోంది. మారుతున్న ఈ వాతావరణంలో ప్రధా నమంత్రి నాయకత్వంలో మన రక్షణ సన్నద్ధత కూడా అభివృద్ధి చెందుతోంది. స్వదేశీ క్వాంటం టెక్నాలజీని ప్రోత్సహిస్తున్నాం. కాంటాక్ట్, నాన్ కాంటాక్ట్, కైనెటిక్, నాన్‌కైనెటిక్ యుద్ధాల్లో మన సామర్థ్యాలను బలోపేతం చేసుకుంటున్నాం" అని తెలిపారు. భవిష్యత్తులో యుద్ధాలు మల్టీడొమైన్ ఎన్విరాన్‌మెంట్‌లో జరుగుతాయని, పూర్తిగా టెక్నాలజీ ఆధారితంగా ఉంటాయని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఆధునిక సైనికుడు కేవలం సైనికుడు మాత్రమే కాదు. వారు మల్టీడొమైన్‌లో పనిచేస్తారు. భవిష్యత్తులో యుద్ధ క్షేత్రం టెక్నాల జీతో నడుస్తుంది. టెక్నాలజీలో ఏ దేశం ముం దుంటుందో, యుద్ధంలోనూ అదే దేశం ముం దుంటుంది. మన రక్షణ వ్యూహం భవిష్యత్ సవాళ్లకు సిద్ధంగా ఉందని ఆయన భరోసా ఇచ్చారు.


# మొజ్తబా ఖమేనీ శిథిలాల నుంచి వెలికితీశాం

## మొహ్సెన్ హెయ్‌దరీ వెల్లడి



**టెహ్రాన్, సెప్టెంబరు 27:** ఇరాన్‌పై అమెరికా– ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభించిన మొదట్లోనే మాజీ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మర ణించిన సంగతి తెలిసిందే. ఆ దాడిలో ఆయన కుమారుడు, కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబా కూడా మరణించినట్లు తొలుత వార్తలు వచ్చినప్పటికీ.. దాడుల నుంచి ఆయన త్రుటిలో బయటపడినట్లు ఇరాన్ వెల్లడించింది. ఫిబ్రవరిలో జరిగిన ఈ ఘటన గురించి ఇరాన్ అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్ సభ్యుడు మొహ్సెన్ హెయ్‌దరీ తాజాగా కీలక విషయాలు వెల్లడించారు. తమ అగ్రనేతపై దాడి జరిగింది ఒకసారి మాత్రమే కాదని.. రెండుసార్లు అమెరికా ఆయనను లక్ష్యంగా చేసుకుందని తెలిపారు. 'అలీ ఖమేనీ సహా కీలక నేతలు ఓ భవనంలో సమావేశమైన సమయంలో అమెరికా దాడులు చేసింది. ఈ ఘటనలో మాజీ సుప్రీం లీడర్ నేత ప్రాణాలు కోల్పోయారు. తీవ్రంగా గాయపడిన మొజ్తాబాను వైద్యం కోసం వెంటనే ఓ ఆస్పత్రికి తరలించాం. తర్వాత అమెరికా–ఇజ్రాయెల్ దళాలు ఆ ఆస్పత్రిపై కూడా విరుచు పడ్డాయి. దీంతో అది పూర్తిగా ధ్వంస మైంది. కొన్ని గంటల పాటు శ్రమించి మా బల గాలు శిథిలాల నుంచి మొజ్తాబాను బయటకు తీశారు. కొన ఊపిరితో ఉన్న ఆయనను మరో సురక్షిత ప్రాంతానికి తరలించి చికిత్స అం దిం చాం. బహిరంగంగా ప్రకటించే వరకు.. ఆయ నను తదుపరి సుప్రీంగా ఎన్నుకున్న విషయం కూడా మొజ్తాబాకు తెలియదు. తర్వాత దానిని ఆయన అంగీకరించక తప్పలేదు.

# పుతిన్‌తో మాట్లాడాలి: జెలెన్‌స్కీకి ట్రంప్ సూచన



**వాషింగ్టన్, సెప్టెంబరు 27:** నాలుగేళ్లకుపైగా రష్యా–ఉక్రెయిన్ మధ్య ఘర్షణ లు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో అమె రికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో మాట్లాడి త్వరలో ఓ ఒప్పందానికి వస్తా రని ఆశి స్తున్నట్లు తెలిపారు. ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశంలో జెలెన్‌స్కీతో భేటీపై మీ డియా వద్ద ఈవ్యాఖ్యలు చేశారు. 'ఇన్నేళ్లుగా పు తిన్, జెలెన్‌స్కీ సర్దుకుపోతూవస్తున్నారు. త్వర లోనే వారు ఓ ఒప్పందానికి రావచ్చు. శీతా కా లానికి ముందే ప్రకటన వెలువడినా ఆశ్చర్యపో న క్కరలేదు.ఎందుకంటే యుద్ధాన్నిముగించాలని జె లెన్‌స్కీకోరుకుంటున్నారు'అనిట్రంప్ పేర్కొన్నారు.

# కాంగ్రెస్ హయాంలో అన్నీ కుంభకోణాలే..

## గుజరాత్‌లో ఎల్ఎన్‌జి రైలును ప్రారంభించిన హోంమంత్రి అమిత్‌షా



**సబర్మతి, సెప్టెంబరు 27:** కాంగ్రెస్ హయాంలో కుంభకోణాలు తప్ప మరేమీ జరగలేదని, కానీ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పాలనలో రైల్వేలో సమూల మార్పులు జరిగాయని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. గత 12 ఏళ్లలో మోడీపై ఎవరూ అవినీతి ఆరోపణలు చేయలేక పోయారని చెప్పారు. అర్థరహితంగా మాట్లాడే కాంగ్రెస్ పార్టీని వాస్తవాలు, గణాంకాల ఆధారంగా చర్చకు రావాలని సవాలు చేయా లంటూ ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం గుజరాత్ లోని సబర్మతి రైల్వే స్టేషన్ నుంచి భార తదేశపు తొలి ఎల్ఎన్‌జీ రైలును జెండా ఊపి ప్రారంభించారు. ఈ సం దర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభలో షా ప్రసంగించారు. మోడీ ప్రభుత్వం, రైళ్లలో 97 శాతం బయోటాయి లెట్లను ఏర్పాటు చేసిందని, అలాగే 87 శాతం ఎల్‌హెచ్‌బి కోచ్‌లను భారతదేశంలోనే తయారు చేశా రని అమిత్ షా పేర్కొన్నారు. వీటితో పాటు రైల్వే విద్యుదీకరణ 70 శాతానికి పెరిగిందని, రైల్వే భద్రతకు సం బంధించి బడ్జెట్ 67 శాతం పెరిగిందని, అలాగే లోకోమోటివ్ తయారీ సామ ర్థ్యం కూడా 66 శాతం పెరిగిందని ఆయన పేర్కొ న్నారు. మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ భావనలను మోడీ బలోపేతం చేశారని చెప్పారు. 2015 -16లో రైల్వేలు 293 కోట్ల లీటర్ల డీజిల్‌ను వినియోగించాయి. 2024-25 నాటికి ఇది 108 కోట్ల లీటర్లకు తగ్గింది. 2030 నాటికి ఇది సున్నాకి చేరుతుంది. ఫలితంగా విదేశీ కరె న్సీని ఆదా చేయగలుగుతాం అని షా పేర్కొ న్నారు. 2010-11లో ఏటా కేవలం 75 కి.మీ. మేర రైల్వే మార్గాల విద్యుదీకరణ జరగ్గా, 202324 నాటికి ఆ సంఖ్య 7,188 కి.మీ.కి పెరిగిందని షా చెప్పారు.రైల్వే శాఖ 99.6 శాతం విద్యుదీకరణను పూర్తి చేసిందని, మిగిలిన 0.3 శాతాన్ని కూడా తాము పూర్తి చేస్తామని చెప్పారు. విద్యుదీకరణ విషయంలో చైనాలో 92 శాతం, స్పెయిన్‌లో 68 శాతం, ఫ్రాన్స్‌లో 60 శాతం, బ్రిటన్ వంటి దేశంలో 49 శాతం పురోగతి ఉంది. భారత్‌లో మాత్రం దీన్ని 100 శాతానికి చేర్చే దిశగా తాము ముందుకు సాగుతామని షా పేర్కొన్నారు.ఈ సందర్భంగా రూ.1500 కోట్లకు పైగా విలువైన ప్రధాన రైల్వే ప్రాజెక్టులకు అమిత్‌షా శంకుస్థాపన చేశారు. వీటిలో రైలు మార్గాల డబ్లింగ్ పనులు, రైలు ప్రమాదాలను నివారించే కవచ్ రక్షణ వ్యవస్థ, ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థ, 12 ఎలక్ట్రిక్ లోకోమోటివ్ నిర్వహణ ఉన్నాయి. ఈ కార్యక్రమంలో గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్, ఉప ముఖ్యమంత్రి హర్ష్ సంఘవి, రైల్వే శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# ఆధార్ ఉచిత అప్‌డేట్ గడువు పొడిగింపు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 27:** ఆధార్ ఫ్రీ అప్‌డేట్ విషయంలో యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా కీలక ప్రకటన చేసింది. 5 నుంచి 17 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేట్‌ను ఈనెల 30 వరకు ఉచితంగా చేసుకునే అవకాశం ఉంది. ఆ తర్వాత వర్తించే రుసుములు చెల్లించాల్సి రావచ్చు. ఐదు సంవత్సరాల లోపు పిల్లల ఆధార్ నమోదు సమయంలో వేలిముద్రలు, కనుపాపల వివరాలు తీసుకోరు. పిల్లలకు ఐదేళ్ల నిండినప్పుడు ఫొటో, వేలిముద్రలు, రెండు కను పాపల వివరాలతో తొలి తప్పనిసరి బయో మెట్రిక్ అప్‌డేట్ చేయాలి. 15 ఏళ్లు నిండి నప్పుడు మరోసారి బయోమెట్రిక్ వివరాలను అప్‌డేట్ చేయాల్సి ఉంటుంది. యుఐడిఎఐ ప్రకారం 5-7, 15-17 ఏళ్ల వయస్సు మధ్య జరిగే నిర్దేశిత బయోమెట్రిక్ అప్‌డేట్లు ఉచితంగా ఉంటాయి. 7 నుంచి 15 ఏళ్ల మధ్య పిల్లల తొలి తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేట్‌కు ప్రత్యేకంగా ఫీజు మినహాయింపు ఇచ్చింది.




# లవ్లీ ప్రొఫెషనల్ వర్సిటీలో విద్యార్థుల నిరసన

**అమృత్‌సర్, సెప్టెంబరు 27:** సోషల్ మీడియాలో వైరల్ అయిన నిర్ధారణ లేని పోస్టులు పంజాబ్‌లోని లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ (ఎల్‌పీయూ)లో తీవ్ర విధ్వంసానికి దారితీశాయి. ఓ విద్యార్థినిపై సామూహిక అత్యాచారం జరిగిందని అనంతరం ఆమె ఆత్మహత్య చేసు కున్నట్లు ప్రచారం జరగడంతో పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఈ ఆరో పణలకు సంబంధించి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఇప్పటివరకు ఎలాంటి ఆధారాలు కూడా లభించలేదని పోలీసులు స్పష్టం చేశారు. ఫగ్వారా ప్రాంతంలోని ఎల్‌పీయూ క్యాంపస్‌లో గత అర్ధరాత్రి తర్వాత ఈ ఉద్రిక్తత మొదలైనట్లు తెలుస్తోంది. సుమారు 2 వేల మంది విద్యా ర్థులు లేడీస్ హాస్టల్ సమీపంలో గుమిగూడి నిరసనకు దిగారు. మొదట నినాదాలు, ఆందోళనతో కొనసాగిన నిరసన క్రమంగా తీవ్ర ఉద్రిక్తంగా మారింది. అనంతరం కొందరు విద్యార్థులు క్యాంపస్‌లోని కిటికీ అద్దాలు, ఫ్లవర్ పాట్స్, ఇతర సామగ్రిని ధ్వంసం చేశారు. కొన్ని వస్తువులకు, బిల్డింగ్‌లోని కొన్ని ప్రాంతాలకు నిప్పు పెట్టినట్లు వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.విద్యార్థుల ఆందోళన కేవ లం ఎల్‌పీయూ క్యాంపస్‌కే పరిమితం కాలేదు. జలంధర్‌ఫగ్వారా జాతీయ రహదారిపైకి వెళ్లి రాకపోకలను అడ్డుకున్నారు. దీంతో నేషనల్ హైవేపై భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు కపుర్తలా పోలీసులు భారీగా మోహరించారు. ఎస్ఎస్పీ గౌరవ్ తూరా స్వయంగా ఘటనాస్థలికి చేరుకుని విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం రహదా రిని క్లియర్ చేసి పోలీసులు ట్రాఫిక్‌ను పునరు ద్ధరించారు.వైరల్‌అవుతున్న అత్యాచారం, ఆత్మ హత్య ఆరోపణలపై పోలీసులు కీలక విషయా లను వెల్లడించారు. కపుర్తలా ఎస్ఎస్పీ గౌరవ్ తూరా వెల్లడించిన వివరాల ప్రకారం విద్యా ర్థులు చెబుతున్నట్లుగా అత్యాచారం జరిగినట్లు నిర్ధారించే ఆధారాలు ఇప్పటివరకు లభించలేదు.

# నాలుగేళ్లలో పార్టీ ఫిరాయించిన ఎంపి, ఎమ్మెల్యేలు 111

## పార్టీల విలీనం, ఫిరాయింపులే కీలకం



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 27:** దేశంలో గడచిన నాలు గేళ్లలో 111 మంది సిట్టింగ్ ఎంపీలు, ఎమ్మెల్యేలు తమ రాజకీయ పార్టీలు మారారు. వీరిలో 26 మంది లోక్‌సభ ఎంపీలు, ఏడుగురు రాజ్యసభ ఎంపీలు, 78 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఈ 111 మందిలో 29 మంది అంటే 26 శాతం మంది ప్రజాప్రతినిధులు బీజేపీలో చేరారు. పార్టీ మారిన ప్రజాప్రతినిధులను చేర్చుకోవడంలో ఆ పార్టీ రెండవ అతిపెద్ద పార్టీగా నిలిచింది. అత్యధికంగా 32 మంది ప్రజాప్రతినిధులు నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్‌పీఎఫ్)లో చేరారు. ఇది మొత్తం సంఖ్యలో 29 శాతం ఉన్నది. ఎమ్మె ల్యేలు పార్టీ మారడం వల్ల కాకుండా 2025లో పార్టీ విలీనం వల్ల ఇది జరిగింది. ముఖ్యమంత్రి నెయిఫియు రియో నేతృత్వంలోని నేషనలిస్ట్ డెమోక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ (ఎన్డీపీపీ)కి చెందిన 32 మంది ఎమ్మెల్యేలు, కేవలం ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్న ఎన్‌ఫీఎఫ్‌లో విలీనమ్యారు. ఈ విలీనం తర్వాత ఎన్‌పీఎఫ్ శాసనసభాపక్ష నాయకుడిగా సీఎం రియో ఎన్నికయ్యారు. అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్, నేషనల్ ఎలక్షన్ వాచ్ నిర్వహించిన తాజా విశ్లేషణ ప్రకారం ఈ వివరాలు వెల్లడయ్యాయి. 2022 -26 మధ్య జరిగిన సాధారణ ఎన్నికలు, ఉప ఎన్నికలను పరిగణనలోకి తీసుకుని ఈ అధ్యయనం జరిపాయి. ఈ నివేదిక ప్రకారం, 17 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో పార్టీ మార్పులు జరిగాయి. అత్యధికంగా నాగాలాండ్‌లో 32 మంది ప్రజా ప్రతినిధులు పార్టీ మారారు. ఆ తర్వాతి స్థానాల్లో పశ్చిమ బెంగాల్ (20 మంది), తెలంగాణ (తొమ్మిది మంది), గోవా, పంజాబ్‌లో ఎనిమిది మంది చొప్పున ప్రజా ప్రతినిధులు పార్టీలు మారారు. అయితే ఈ 111 మంది ప్రజా ప్రతినిధుల కేసులు కేవలం సాధారణ పార్టీ ఫిరాయింపులు మాత్రమే కావు. పార్టీ విలీనాలు, ఉప ఎన్నికల్లో గెలిచే ముందు రాజీనామా చేసి పార్టీ మారిన ప్రజాప్రతినిధులు, అలాగే అనర్హతకు గురై ఆ తర్వాత మరో పార్టీ టికెట్‌పై గెలిచిన వారిని కూడా ఏడీఆర్ పరిగణనలోకి తీసుకున్నది. మరోవైపు ఏడీఆర్ జాబితా ప్రకారం బీజేపీలో చేరిన 29 మంది చట్టసభ సభ్యులలో, ఏడుగురు రాజ్యసభ ఎంపీలు, 22 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నుంచి ఎన్నికైన ఏడుగురు రాజ్యసభ సభ్యులైన స్వాతి మాలివాల్, అశోక్ మిట్టల్, హర్భజన్ సింగ్, రాఘవ్ చద్దా, సందీప్ కుమార్ పాఠక్, విక్రమ్‌జిత్ సింగ్ సాహ్నీ, రాజిందర్ గుప్తా ఆ తర్వాత బీజేపీలో చేరారు. ఇక బీజేపీలో చేరిన 22 మంది ఎమ్మెల్యేల్లో కాంగ్రెస్‌కు చెందిన 8 మంది గోవా ఎమ్మెల్యేలు, గుజరాత్ నుంచి నలుగురు, హిమాచల్ ప్రదేశ్ నుంచి ఇద్దరు శాసన సభ్యులు ఉన్నారు. మణిపూర్‌కు చెందిన ఐదుగురు జేడీ(యూ) ఎమ్మెల్యేలు కూడా బీజేపీలో చేరినట్లు ఈ నివేదిక పేర్కొంది. కాగా, ఎన్‌పీఎఫ్, బీజేపీ తర్వాత త్రిపురా రాష్ట్రానికి చెందిన నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎన్‌సీపీఐ) 20 మంది ప్రజాప్రతినిధులను ( 111 మందిలో 18 శాతం) తనలో చేర్చుకున్నది. 2026 పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అధికారాన్ని కోల్పోయిన తర్వాత, ఆ పార్టీకి చెందిన 20 మంది లోక్‌సభ ఎంపీలు తిరుగుబాటు చేశారు. జూన్ 14న తక్కువ ప్రాచుర్యం కలిగిన ఎన్‌సీపీఐలో తమ పార్టీని విలీనం చేస్తున్నట్లు వారు తెలిపారు. లోక్‌సభలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి మద్దతు ప్రకటించారు.

# గుట్కా అక్రమ తరలింపును అడ్డుకున్న తమిళనాడు పోలీస్

## జేమ్స్‌బాండ్ తరహాలో హెడ్‌కానిస్టేబుల్ ఛేజింగ్




**చెన్నై,సెప్టెంబరు 27:** కర్ణాటక నుంచి అక్రమంగా గుట్కా తరలిస్తున్న ముగ్గురు రాజస్థాన్‌కు చెందిన వ్యక్తులను తమిళనాడులోని కోయంబత్తూరు పోలీసులు సినిమా స్టైల్‌లో ఛేజ్ చేసి పట్టుకు న్నారు. బెంగళూరు నుంచి కారులో 300 కిలోల నిషేధిత పొగాకు ఉత్పత్తులను తరలిస్తుండగా కోవిల్‌పాళయం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. తనిఖీల సమయంలో పోలీసులు ఆపడానికి ప్రయత్నించగా, నిందితులు ఎస్ఐని పక్కకు తోసేసి కారుతో పరారయ్యేందుకు యత్నిం చారు. నిందితులను పట్టుకునేందుకు హెడ్ కానిస్టేబుల్ వేల్మురుగన్ అత్యంత సాహసంతో పరుగులు తీస్తున్న కారు పైకప్పుపైకి దూకారు. కారుపై పోలీసు వేలాడుతున్నప్పటికీ నిందితులు ఏమాత్రం పట్టించుకోకుండా సుమారు 40 కిలోమీటర్ల దూరం వేగంగా కారును నడిపారు. ఈ వాహనం విళాంకురిచ్చి, కాళపట్టి, సిత్రా మీదుగా కనియూర్ టోల్‌ప్లాజా వైపు దూసుకెళ్లింది. కారు పైకప్పుపై హెడ్ కానిస్టేబుల్ వేలాడుతున్న దృశ్యాలను దారిన పోయే వాహనదారులు తమ సెల్‌ఫోన్లలో వీడియోలు రికార్డు చేశారు. సమాచారం అందుకున్న ఇతర పోలీసులు, అంబులెన్స్ సిబ్బంది వెంటనే అప్ర మత్తమై కారును వెంబడించారు. అవినాశి పోలీ సుల సహకారంతో అన్నపూర్ణ హోటల్ సమీ పంలో పోలీసులు ఆ కారును పూర్తిగా చుట్టు ముట్టి నిలిపివేశారు.

కారు ఆగిన వెంటనే ఇద్దరు నిందితులు పారిపోయేందుకు ప్రయత్నించగా, అప్రమత్తమైన పోలీసులు వెంటాడి ఆ ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిం దితుల నుంచి 300కిలోల గుట్కా, పొగాకు ఉత్ప త్తులతో పాటు రవాణాకు ఉపయోగించిన కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రా ణాలను సైతం లెక్కచేయకుండా కారు పైకప్పుపై 40 కి లోమీటర్లు ప్రయాణించి నిందితులను పట్టుకోవ డంలో కీలక పాత్ర పోషించిన హెడ్ కాని స్టేబుల్ వేల్మురుగన్ ధైర్యసాహసాలను అభినందిస్తూ తమిళనాడు వ్యాప్తంగా ప్రశంసలు వెల్లు వెత్తుతున్నాయి.

# సంక్షిప్త వార్తలు

## 110 రోజులకు చేరిన నిరసనలు



**పాక్ ఆక్రమిత కాశ్మీర్, సెప్టెంబరు 27:** పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పిఒకె)లో కొంతకాలంగా ఆందోళనలు కొనసాగుతున్న సంగతి తెలిసిందే. తమను భారత్‌లో కలపాలంటూ పిఒకెలో స్థానిక ప్రజలు అవామీ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తున్నారు. గత జూన్ 9న ప్రారంభమైన నిరస నలు శనివారానికి 110 రోజుకు చేరాయి. పాక్ ఆక్రమిత జమ్మూ కాశ్మీర్‌ను ఇండియాలోని జమ్మూ కాశ్మీర్‌లో కలపాలని అక్కడి వారు డిమాండ్ చేస్తున్నారు. పిఒకెలోని ముందోల్ గ్రామంలో శని వారం భారీ నిసరన ప్రదర్శన జరిగింది. ఈ ఆందోళనల్లో 25,000 మంది పాల్గొన్నారు.

## భారత్‌కు శాశ్వత సభ్యత్వం ఉండాలి: సెర్గీ లావ్రోవ్




**న్యూయార్కు, సెప్టెంబరు 27:** ఐక్యరాజ్యసమితిలో ఇండియాకు శాశ్వత సభ్యత్వం కల్పించే ప్రతిపా దనకు తాము మద్దతు ఇస్తున్నామని రష్యా ప్రకటించింది. పశ్చిమ దేశాలకు మాత్రం ఈ విష యంలో చోటు లేదని కూడా రష్యా స్పష్టం చేసింది. అమెరికా, న్యూయార్క్‌లో ఐక్యరా జ్యసమితి సాధారణ సర్వసభ్య వార్షిక సమావేశం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ మాట్లాడారు. ఇండియా శాశ్వత సభ్యత్వానికి మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. ఇదే సమయంలో ఏ పాశ్చాత్య దేశానికి కొత్తగా శాశ్వత సభ్యత్వం కల్పించేందుకు తాము వ్యతిరేకం అని లావ్రోవ్ స్పష్టం చేశారు.

## దక్షిణాఫ్రికాలో కాల్పులు: 27 మంది మృతి



**జోహాన్స్‌బర్గ్, సెప్టెంబరు 27:** ప్రపంచంలోనే అత్యధిక నేరాలు జరిగే దేశాలలో ఒకటైన దక్షిణాఫ్రికా మరోసారి రక్తమోడింది. జోహన్నెస్‌బర్గ్, కేప్‌టౌన్ ప్రాంతాల్లో జరిగిన ఈ దారుణ కాండలో కనీసం 27 మంది ప్రాణాలు కోల్పోయారు. జోహన్నెస్‌బర్గ్ నగరానికి నైరుతి దిశలో ఉన్న వెడెలా టౌన్ షిప్‌లోని ఒక బార్‌లో గత రాత్రి ఘోర కాల్పులు చోటుచేసుకున్నాయి. ఏకే47 రైఫిల్స్, పిస్టళ్లతో వచ్చిన ఎనిమిది మంది దుండగులు ఒక్కసారిగా బార్‌పై విచక్షణారహి తంగా కాల్పులు జరిపారు. ఈ దాడిలో అక్కడికక్కడే 17 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మరువకముందే కేప్‌టౌన్ సమీపంలోని ల్యాండ్లే ప్రాం తంలో ఆదివారం తెల్లవారు జామున జరిగిన సామూహిక కాల్పుల్లో మరో 10 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో మరో 11 మంది తీవ్రంగా గాయపడ్డారు.

## నేపాల్ హిమపాతంలో 10మంది గల్లంతు



**ఖాట్మండు, సెప్టెంబరు 27:** నేపాల్‌లో ఆదివారం ఉదయం సంభవించిన హిమపాతం వల్ల 10 మంది గల్లంతైనట్లు పర్వతా రోహణ సంస్థ నిర్వాహకులు ప్రకటించారు. ఈ ఘటన పశ్చిమ నేపాల్, హిమ్లుంగ్ హిమల్ బేస్ క్యాంప్‌లో ఆదివారం ఉదయం జరిగింది. ఈ ప్రాంతం టిబెట్ సరిహద్దులో ఉంటుంది. వరు సగా కురుస్తున్న మంచు వల్ల మంచు పర్వతం విరిగిపడటం వల్ల పదిమంది కొట్టుకుపోయారని నిర్వాహకుడు మింగ్మా గ్యాల్జె షెర్పా తెలిపారు. గల్లంతైన వారిలో ఇద్దరు కిచెన్ స్టాఫ్ కూడా ఉన్నట్లు వెల్లడించారు. షెర్పా తెలిపిన వివరాల ప్రకారం వాతావరణం సరిగ్గా లేదని గతవారమే హెచ్చరించారు.

## బంగ్లాదేశ్‌లో మరో హిందూ నగల వ్యాపారి హత్య



**ఢాకా, సెప్టెంబరు 27:** బంగ్లాదేశ్‌లో మైనారిటీల భద్రతపై మరోసారి తీవ్ర కలకలం రేగింది. తాజాగా మణికట్టు వ్యాపారం చేసుకునే ఒక హిందూ జ్యువెలర్ దారుణ హత్యకు గురయ్యారు. మైమన్ సింగ్ జిల్లాలోని ఒక స్లూయిస్ గేట్ వద్ద నీటిలో తేలుతున్న ప్లాస్టిక్ డ్రమ్‌లో ఆయన మృతదేహం కనిపించడం అక్కడి స్థానికులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. చనిపోయిన వ్యక్తిని 50 ఏళ్ల నిరంజన్ చంద్ర సూత్రధార్‌గా గుర్తించారు.

# దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షించేందుకు ప్రభుత్వం కృషి

## ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా పర్యాటకులకు సిఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు

**హైదరాబాద్,సెప్టెంబరు27,ప్రభాతవార్త:** ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రజలకు, దేశ విదేశాల నుంచి మన రాష్ట్రాన్ని సందర్శిస్తున్న పర్యాటకులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణకు ఉన్న అపారమైన సహజ, సాంస్కృతిక, చారిత్రక, ఆధ్యాత్మిక సంపదను ప్రపంచ పర్యాటక పటంలో మరింత ఉన్నత స్థానంలో నిలపాలన్నది ప్రజాప్రభుత్వ సంకల్పం. చారిత్రక కట్టడాలు, దేవాలయాలు, కోటలు, జలపాతాలు, అటవీ ప్రాంతాలు, వన్యప్రాణి అభయారణ్యాలు, చెరువులు, జానపద కళలు, పండుగలు తెలంగాణ ప్రత్యేకతను చాటుతున్నాయన్నారు. రామప్ప, వరంగల్, యాదాద్రి, భద్రాద్రి, అలంపూర్, మేడారం, హైదరాబాద్‌లోని చారిత్రక కట్టడాలు వంటి అనేక ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేసి దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది.
తెలంగాణ టూరిజం పాలసీ 2025-30 ద్వారా పర్యాటక రంగంలో పెట్టుబడులకు ప్రోత్సాహం కల్పిస్తూ, కొత్త పర్యాటక ప్రాజెక్టులు, అడ్వెంచర్ టూరిజం, క్యారవాన్ పార్కులు, వేసైడ్ అమినిటీస్, ఎకో టూరిజం తదితర రంగాల్లో ప్రైవేట్ పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని కల్పిస్తున్నాం. ఎకో టూరిజం, టెంపుల్ టూరిజం, మెడికల్ టూరిజంతో పాటు వారసత్వ పర్యాటకానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. పర్యాటకులకు మెరుగైన వసతులు, సౌకర్యవంతమైన ప్రయాణం, నాణ్యమైన సేవలు అందించడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యాల్లో ఒకటి.
పర్యాటక రంగంలో పెట్టుబడులను ఆకర్షించి తెలంగాణను దేశంలోనే ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. తెలంగాణ పర్యాటక రంగ అభివృద్ధిలో స్థానిక ప్రజలు, పర్యాటక రంగ సంస్థలు, హోటళ్లు, ట్రావెల్ ఏజెన్సీలు, కళాకారులు, హస్తకళాకారులు, యువత భాగస్వామ్యం ఎంతో కీలకం. మన వారసత్వాన్ని కాపాడుకుంటూ, ప్రకృతిని పరిరక్షిస్తూ, స్థానిక సంస్కృతికి గౌరవం ఇస్తూ స్థిరమైన పర్యాటక అభివృద్ధిని సాధిద్దామన్నారు. తెలంగాణకు వచ్చే ప్రతి పర్యాటకుడికి ఆత్మీయ స్వాగతం పలుకుతూ, మన రాష్ట్ర ప్రత్యేకతలను ప్రపంచానికి చాటుదాం. తెలంగాణను ప్రపంచ స్థాయి పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దే ప్రయాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరుతున్నాను' అని ముఖ్యమంత్రి ఒక సందేశంలో పేర్కొన్నారు.



ఆదివారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా దుద్దిళ్ల శ్రీపాదరావు సెంట్రల్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నివాళి అర్పించిన స్పీకర్ ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తదితరులు

## ఢిల్లీలో రేపు దళిత, ఆదివాసీ ఆత్మాభిమాన సమావేశం: ఎంపి మల్లు రవి


**హైదరాబాద్,సెప్టెంబరు 27,ప్రభాతవార్త:** దేశ రాజధాని ఢిల్లీలో ఈ నెల 29న దళిత, ఆదివాసీ ఆత్మాభిమాన సమావేశం నిర్వహించనున్నట్లు నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి తెలిపారు. న్యూఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్‌లో కాం గ్రెస్ ఎస్సీ, ఎస్టీ ఎంపీల ఫోరమ్ ఆధ్వర్యంలో ఈ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ భేటీలో దళిత, ఆదివాసీల సమస్యలు, హక్కులు, సామాజిక న్యాయం వంటి అంశాలపై చర్చించనున్నట్లు ఎంపీ పేర్కొన్నారు. ఈ సమావేశానికి దేశవ్యాప్తంగా ఉన్న కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎస్సీ, ఎస్టీ ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు హాజరుకానున్నట్లు మల్లు రవి తెలిపారు. అలాగే కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు హాజరుకానున్నారని వెల్లడించారు. ఇటీవల ఉత్తరాఖండ్‌లో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు జరిగిన అవమానకర ఘటనపైనా చర్చించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఖర్గేను అవమానించడం అంటే యావత్ దళిత వర్గాన్ని అవమానించడమే అని ఆయన పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా దళితులు, ఆదివాసీలపై జరుగుతున్న దాడులు, సామాజిక వివక్ష, వారి రాజ్యాంగ హక్కుల పరిరక్షణ, సమానత్వం కోసం కాంగ్రెస్ పార్టీ చేపట్టాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించనున్నట్లు ఎంపీ రవి తెలిపారు. అలాగే ఆయా అంశాలకు సంబంధించిన భవిష్యత్ కార్యాచరణపైనా నిర్ణయం తీసుకోనున్నట్లు చెప్పారు. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని సమగ్రంగా, సమర్థవంతంగా అమలు చేయాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులను కోరనున్నట్లు ఎంపీ మల్లు రవి వెల్లడించారు.

## ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి వేడుకలు

**హైదరాబాద్ (సైఫాబాద్), సెప్టెంబరు 27, ప్రభాతవార్త:** నిజాం నిరకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన పోరాట యోధుడు, తెలంగాణ ఆత్మగౌరవ ఉద్యమ యోధుడు, ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్‌బాపూజీ 111వ జయంతి వేడుకలు ఆదివారం ట్యాంక్‌బండ్ వద్దగల జలదృశ్యంలోని ఆయన విగ్రహం వద్ద ఘనంగా జరిగాయి. బాపూజీ విగ్రహానికి హర్యానా రాష్ట్ర మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రాష్ట్ర శాసన మండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ సలహాదారు వి.హనుమంతరావు, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, మాజీ ఎంపి ఎం.అంజన్‌కుమార్‌యాదవ్, బిసి కమీషన్ మాజీ చైర్మన్‌లు బి.ఎస్.రాములు, వి.కృష్ణమోహనరావు, బిసి రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్, వివిధ సంఘాల నాయకులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ బాపూజీ చూపిన మార్గం తరతరాలకు స్ఫూర్తిదాయకమని, ఆయన జీవితం ప్రజాసేవకు ప్రతీకగా నిలిచిందన్నారు. తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ చేనేత రంగం అభివృద్ధికి బాపూజీ చేసిన సేవలు చారిత్రాత్మకమని, ఆయన అశయాలకు అనుగుణంగా ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమం కోసం ఆనేక కార్యక్రమాలను చేపడతున్నదని, కార్మికుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉందన్నారు. వి.హనుమంతరావు మాట్లాడుతూ తెలంగాణ కోసం రాజీలేని పోరాటం చేసిన మహానాయకుడు కొండా లక్ష్మణ్‌బాపూజీ, ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ ప్రజల గుండెల్లో శాశ్వత స్థానం సంపాదించుకున్న నాయకుడే నిజమైన నాయకుడని అలాంటి మహోన్నతమైన వ్యక్తి బాపూజీ అని కొనియాడారు. దాసు సురేష్ మాట్లాడుతూ బాపూజీ కలలు గన్న సామాజిక తెలంగాణ నిర్మాణం కోసం బిసిలకు రాజకీయ, సామాజిక, ఆర్థిక న్యాయం సాధించేవరకు తమ ఉద్యమం నిరంతరం కొనసాగుతుందన్నారు.



కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద మాట్లాడుతున్న హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ



డిజిపి కార్యాలయంలో కొండా ఆచార్య లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎఐజి అన్యోన్య సహా ఇతర అధికారులు.

## డిజిపి కార్యాలయంలో కొండా ఆచార్య లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు

**హైదరాబాద్, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:** తెలంగాణ స్వాప్నికుడు, గాంధేయవాది ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు ఆదివారం నాడు డిజిపి కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏఐజి అన్యోన్య బాపూజీ చిత్ర పటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా అన్యోన్య మాట్లాడుతూ బాపూజీ తెలంగాణ కోసం జీవితాంతం పోరాడిన మహనీయు డని అన్నారు. అనేక ప్రజా ఉద్యమాల్లో బాపూజీ పాత్ర కీలకంగా వుందని ఆయన తెలిపారు. స్వాతంత్ర సమరయోధుడిగా, ప్రజా నాయకుడిగా సామాజిక న్యాయం కోసం , అణగారిన వర్గాల కోసం పోరాడిన వ్యక్తిగా బాపూజీ పేరు చరిత్రలో చిరస్థాయిలో నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిజి పి కార్యాలయ స్పోర్ట్స్ డిఎస్‌పి సత్యనారాయణ సహా ఇతర అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణ సాధనకే త్యాగశీలి కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం అంకితం

### బిసి సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

### ప్రభుత్వపరంగా ఘనంగా 111వ జయంతి వేడుకలు



కొండాలక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న పొన్నం, వివేక్, హనుమంతరావు, శ్రీనివాస్, అనిల్‌కుమార్, జాజుల, గుజ్జ సత్యం తదితరులు

**హైదరాబాద్ (రవీంద్రభారతి), సెప్టెంబరు 27, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర సాధనకే తన జీవితాన్ని అంకితం చేసిన త్యాగశీలి, తెలంగాణ ప్రజల ఆకాంక్షలకే ప్రాధాన్యమిచ్చిన మహనీయుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని తెలంగాణ రాష్ట్ర బిసి సంక్షేమ, రవాణాశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తెలంగాణ తొలి, మలి ఉద్యమ చరిత్రలో ఆయన పోరాటం, త్యాగం మరువలేనిదని చెప్పారు. ప్రత్యేక రాష్ట్రం కోసం తన పదవిని, రాజకీయ భవిష్యత్తు సైతం త్రుణపాయంగా వదిలేసిన గొప్పనాయకుడిగా చరిత్రలో కలకాలం నిలిచిపోతారని, ఆయన ఆశయాలు, పోరాటస్ఫూర్తి అందరికీ ఆదర్శమని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర బిసి సంక్షేమశాఖ, కొండా లక్ష్మణ్‌బాపూజీ 111వ జయంతి వేడుకల కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో ఆదివారం మధ్యాహ్నం కమిటీ చైర్మన్ గూడూరు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రభుత్వపరంగా కొండా లక్ష్మణ్ బాపూజీ 11వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి, ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా మంత్రి పొన్నం ప్రభాకర్ విశిష్ట అతిథులుగా కార్మికశాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి, ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, దూడెం వెంకటరమణ, జక్కని అనిత, ఈరవర్తి, అనిల్‌కుమార్, మెట్టుసాయికుమార్, జాజుల శ్రీనివాస్‌గౌడ్, గుజ్యసత్యం, చెరుపల్లి సీతారాములు, గుంజ రేణుక నారాయణ తదితర ప్రముఖులు పాల్గొని ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలవేసి జ్యోతిప్రకాసనంచేసి ఘననివాళులర్పించి ప్రసంగించారు. కొండా లక్ష్మణ్‌బాపూజీ కేవలం పద్మశాలిలకే కాదు యావత్ తెలంగాణ జాతికి చెందిన మహామనీషి అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం ప్రజాపాలనతో భాగంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి బిసి సామాజికవర్గాలకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారని, దానికి తగ్గట్టుగా బిసి వర్గాలు ఒక్కతాటిపైకి వచ్చి మన సమస్యలు పరిష్కరించుకుని లక్ష్యాలను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రభుత్వ కులగణన చేసి బిసిలకు 42శాతం రిజర్వేషన్లు అమలుచేయడానికి చట్టం చేసిందని, కేంద్రప్రభుత్వం జనగణనలో కులగణన చేస్తామని తెలిపినా జనగణనలో ఎస్సీ, ఎస్టీల గురించి తప్ప బిసిల గురించి అడగలేదని, దేశవ్యాప్తంగా కులగణన చేయాలని పొన్నం డిమాండ్ చేశారు.
మంత్రి జి.వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ బిసిలందరికీ కొండా లక్ష్మణ్ రోల్‌మోడల్ అన్నారు. ఆయన పేరును ఒక విశ్వవిద్యాలయానికి, ఆస్పత్రికి పెట్టిందని గుర్తుచేశారు, లక్ష్మణ్ స్ఫూర్తితో బిసిల హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని, బాపూజీ చేసిన త్యాగాలు, పోరాటాలు స్ఫూర్తిగా ముందుకుసాగాలని, హక్కుల సాధనకు ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాడాలని పిలుపునిచ్చారు.

## మూలనివాసీల ఐక్యతతోనే సామాజిక న్యాయం

### బహుజన్, మూలనివాసీ ఉద్యమ అధినేత, బాంసెఫ్ జాతీయ అధ్యక్షుడు వామన్ మేష్రామ్

**హైదరాబాద్ (చిక్కడపల్లి) సెప్టెంబరు 27, ప్రభాతవార్త** : మూలనివాసీల ఐక్యతతోనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని బహుజన్, మూలనివాసీ ఉద్యమ అధినేత, బాంసెఫ్ జాతీయ అధ్యక్షుడు వామన్ మేష్రామ్ స్పష్టం చేసారు. ఆదివారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో దేశంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ వర్గాల రాజ్యాంగ హక్కుల పరిరక్షణ, సముచిత ప్రాతినిధ్యం మరియు సామాజిక న్యాయ సాధనే లక్ష్యంగా రాష్ట్రీయ ముస్లిం మోర్చా 5వ జాతీయ మహాసభలకు వామన్ మిశ్రామ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను కాపాడుకోవడానికి మూలనివాసీ సమాజాల మధ్య బలమైన ఐక్యత అవసరమని పిలుపునిచ్చారు.
రాజ్యాంగబద్ధమైన రిజర్వేషన్లు, సామాజిక పరిరక్షణలు పూర్తిస్థాయిలో అమలయ్యే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సభలో డిమాండ్ లను ఆమోదించింది.
దేశవ్యాప్తంగా సమగ్ర ఓబీసీ కుల గణనను తక్షణమే చేపట్టాలని సభ ఏకగ్రీవంగా డిమాండ్ చేసింది. జనాభా నిష్పత్తికి అనుగుణంగా సంక్షేమ ఫలాలు, బడ్జెట్ కేటాయింపులు సాధించ వచ్చని నేతలు పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలతో పాటు ముస్లింలు, ఇతర అల్పసంఖ్యాక వర్గాలు 'మూలనివాసీ' గుర్తింపుతో ఒకే వేదికపైకి రావడం ద్వారానే బహుజన హక్కులను కాపాడుకోగలమని ప్రతిపాదించారు. తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాల నుండి పెద్ద సంఖ్యలో ప్రతినిధులు, సామాజిక విశ్లేషకులు, హక్కుల కార్యకర్తలు ఈ మహాసభలో పాల్గొన్నారు. సభను మర్కజ్ దారులు బీర్ అధ్యక్షుడు డాక్టర్ సయీద్ అహ్మద్ ఉమరి ప్రారంభించగా సభలో జాతీయ ముస్లిం మోర్చా అధ్యక్షుడు సయ్యద్ మక్సుద్ సాహెబ్, మోర్చా జాతీయ నేత చాంద్ మహమ్మద్, రాష్ట్రీయ పిచడా జాతీయ అధ్యక్షుడు చౌదరి వికాస్ పటేల్, రిటైర్డ్ డీజీపీ ఎం.డబ్ల్యూ అన్సారీ తదితరులతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి ప్రతినిధులు పాల్గొన్నారు.

## 20 యేళ్లయినా బిఆర్ఎస్ అధికారంలోకి రాదు

### ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్

**హైదరాబాద్,సెప్టెంబరు27,ప్రభాతవార్త:** 20 ఏళ్లయినా బీఆర్ఎస్ అధికారంలోకి రాదని, తెలంగాణ అస్తిత్వం అంటే అమరవీరులు మాత్రమేనని, కేసీఆర్ కాదని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ అన్నారు. ఆదివారం సీఎల్పీ మీడియా సెంటర్ వేదికగా ఆయన బీఆర్ఎస్‌పై తీవ్రంగా మండిపడ్డారు. చావు నోట్లో కేసీఆర్ తలకాయ పెడితే తెలంగాణ వచ్చిందనేది అబద్ధమని చెప్పారు. సోనియా గాంధీ తెలంగాణ ఇవ్వకపోతే కేసీఆర్ ఎక్కడ తలకాయ పెట్టినా ఉపయోగం ఉండదని విమర్శించారు. తెలంగాణ అంటే తామే అన్న కల్వకుంట్ల కుటుంబాన్ని సీఎం రేవంత్ రెడ్డి పాతాళానికి తొక్కారన్నారు. అలాగే ఈ సెప్టెంబర్‌లోనే రేవంత్ అడుగు సిరిసిల్లలో పడబోతోందని తెలిపారు. బంధువులు, అనుచరులతో కేసీఆర్ నిర్మించుకుంటున్న సామ్రాజ్యాన్ని బద్దలు కొట్టడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తానని చెప్పి.. కేటీఆర్ తెలంగాణ ద్రోహిగా మారారని ధ్వజమెత్తారు.

## బిజెపి రాష్ట్ర కార్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు

### బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్

**హైదరాబాద్, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ తొలితరం ఉద్యమనేత కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బిజెపి ఓబిసి మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరేందర్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎంపి డాక్టర్ బూర నర్సయ్య గౌడ్, రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ సమత, తదితర ముఖ్య నాయకులు పాల్గొని కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఓబిసి మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ గౌడ్ మాట్లాడుతూ, మహాత్మా గాంధీ తర్వాత యావత్ ప్రజలచే బాపూజీగా పిలిపించుకున్న ఏకైక మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు. స్వాతంత్ర్య పోరాటం, రజాకార్ల వ్యతిరేక ఉద్యమం, తెలంగాణ సాధన ఉద్యమాల్లో ఆయన పాత్ర అమోఘమని పేర్కొన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడేంతవరకు ఏ మంత్రి పదవినీ చేపట్టబోనని శపథం చేసి చివరివరకు ఆ మాటకు కట్టుబడిన నిబద్ధత గల నాయకుడని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరేందర్ గౌడ్ మాట్లాడుతూ, బాపూజీ జీవితం భావితరాలకు ఆదర్శప్రాయమని తెలిపారు. దేశ స్వాతంత్ర్య పోరాటంతో పాటు తెలంగాణలో రజాకార్ల అకృత్యాలకు వ్యతిరేకంగా ప్రాణాలకు తెగించి పోరాడిన యోధుడని అన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ మాట్లాడుతూ, కొండా లక్ష్మణ్ బాపూజీని తెలంగాణ ఉక్కు మనిషిగా అభివర్ణించారు. రజాకార్ల దౌర్జన్యాలను అంతమొందించేందుకు కోఠి వద్ద నిజాంపై బాంబులు విసిరిన నారాయణరావు పవార్, గండయ్య వంటి విప్లవకారులకు సోలాపూర్‌లో తన సొంత ఖర్చులతో ఆయుధ శిక్షణ ఇప్పించిన ఘనత బాపూజీకే దక్కుతుందని గుర్తుచేశారు. స్వతహాగా న్యాయవాది అయిన బాపూజీ, తన యావదాస్తిని తెలంగాణ ఉద్యమం కోసం ధారపోశారని తెలిపారు. మలిదశ ఉద్యమానికి నాంది పలికిన చారిత్రక జలదృశ్యం ఆయన నివాసమేనని, అక్కడి నుంచే తెలంగాణ ఉద్యమం ఊపిరిపోసుకుందని పేర్కొన్నారు.

## హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

### ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదు

### మాజీ మంత్రి కెటిఆర్ విమర్శ

**రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు మూడేళ్లు కావస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రేవంత్‌రెడ్డిని నమ్ముకుంటే కుక్కతోక పట్టుకుని గోదావరి ఈద్చినట్టేనని ఆయన వ్యాఖ్యానించారు. శంషాబాద్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మణికొండ ప్రాంతానికి చెందిన పలువురు నాయకులు బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. సీతారాం ఆధ్వర్యంలో పలువురు నాయకులు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేల వ్యవహారాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ప్రకాశ్‌గౌడ్ కాంగ్రెస్‌లో ఎందుకు చేరారో అందరికీ తెలుసని, సుల్తాన్‌పూర్, ఘన్‌సిమియాగూడ భూముల కోసమే ఆయన పార్టీ మారారని ఆరోపించారు.

**మూసీ ప్రక్షాళనపై విమర్శలు..**

మూసీ ప్రక్షాళన పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. ఎస్టీపీల నిర్మాణం పూర్తయితే మురుగునీరు మూసీలోకి చేరకుండా అడ్డుకోవచ్చన్నారు. కేసీఆర్ హయాంలో హైదరాబాద్‌లో లక్ష డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించామని పేర్కొన్నారు. మూసీ బాధితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తాము చేపట్టిన పాదయాత్రలో చిన్నారులు సైతం తమ కిడ్డీ బ్యాంకుల్లోని డబ్బులను తీసి ముఖ్యమంత్రి వద్దకు ఇవ్వాలని కోరుతున్నారని కేటీఆర్ పేర్కొన్నారు.

**మంత్రుల ఫామ్‌హౌస్‌లు హైడ్రాకు కనిపించవా?**

హైడ్రా చర్యల విషయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి పట్నం మహేందర్‌రెడ్డిల ఫామ్ హౌస్‌లు ఎందుకు కనిపించడం లేదని కేటీఆర్ ప్రశ్నించారు. హైడ్రా చర్యలు అందరికీ సమానంగా ఉండాలని ఆయన వ్యాఖ్యానించారు. పరిశ్రమల నిర్వాహకులు తమ వద్ద నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడం, శాంతిభద్ర తలు దెబ్బతినడం వంటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఎయిర్‌పోర్టు మెట్రోకు టెండర్ ప్రక్రియ పూర్తయినా కాంగ్రెస్ ప్రభుత్వం దానిని రద్దు చేసిందని ఆయన విమర్శించారు.

**కెసిఆర్‌పై తగ్గని అభిమానం**

కేసీఆర్‌పై ప్రజల్లో అభిమానం ఉందన్న కేటీఆర్‌ఇటీవల తాను ది ప్యారడైజ్ సినిమాను చూశానని కేటీఆర్ తెలిపారు. మూడు గంటల సినిమాలో కేసీఆర్ పాత్ర కేవలం కొద్ది నిమిషాలే ఉన్నప్పటికీ ప్రజల నుంచి స్పందన వచ్చిందని అన్నారు. అధికారం మాత్రమే పోయిందని, ప్రజల్లో కేసీఆర్‌పై ఉన్న అభిమానం, అనురాగం కొనసాగుతోందని ఆయన వ్యాఖ్యానించారు. పది, పదకొండు రోజులుగా ఓ వ్యక్తికి నిద్ర పట్టడం లేదు అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి పరోక్ష వ్యాఖ్యలు చేశారు. పోలీసులు దోపిడీలు జరిగినప్పుడు చర్యలు తీసుకోవాల్సింది పోయి డీజేలను నిలిపి వేస్తున్నారని విమర్శించారు. గడ్డిపోచ కూడా గడ్డపారగా మారి తిరగబడుతుందని వ్యాఖ్యానించారు. రాబోయే పట్టభద్రుల ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం సాధిస్తుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీమంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డి, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ నేత పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ సమక్షంలో పార్టీలో చేరుతున్న నాయకులు

## స్వరాష్ట్రం కోసం సర్వస్వం త్యాగం చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ

### అసెంబ్లీలో చిత్రపటానికి స్పీకర్ ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి నివాళి

**హైదరాబాద్, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:** తెలంగాణ బాపూజీ, స్వర్గీయ కొండా లక్ష్మణ్ బాపూజీ స్వరాష్ట్రం కోసం పదవులతో పాటు సర్వస్వం త్యాగం చేసిన గొప్ప వ్యక్తి అని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. బాపూజీ మూడు పోరాటాలు చేసిన యోధుడన్నారు. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా క్విట్ ఇండియా ఉద్యమంలో, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, ఆ తర్వాత ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడిన గొప్ప నాయకుడని గుర్తు చేశారు. ఆదివారం బాపూజీ జయంతి సందర్భంగా అసెంబ్లీ లాబీలోని దుద్దిళ్ల శ్రీపాదరావు సెంట్రల్ హాల్‌లో ఆయన జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, బాపూజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, శాసన పరిషత్ శాసన పరిషత్ ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, శాసనసభ కార్యదర్శి రేండ్ల తిరుపతి, అదనపు కార్యదర్శి ఉపేందర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొని, బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 1915 సెప్టెంబర్ 27న ఆసిఫాబాద్ జిల్లా వాంకిడిలో ఒక సాధారణ పద్మశాలి చేనేత కుటుంబంలో పుట్టిన బాపూజీ దేశం కోసం, తెలంగాణ కోసం తన జీవితాన్నే అంకితం చేశారని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చెప్పారు. 1969లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగసినప్పుడు బాపూజీ తన మంత్రి పదవికి రాజీనామా చేసి బయటకు వచ్చారని, పదవి కంటే ప్రజలే ముఖ్యం అని చాటిన నిజమైన ప్రజా నాయకుడని కొనియాడారు. బాపూజీ ఎప్పుడూ బడుగు, బలహీన వర్గాల కోసం ముఖ్యంగా బీసీలు, చేనేత కార్మికులు, పద్మశాలీల హక్కుల కోసం కొట్లాడారని చెప్పారు. ఆనాడు బాపూజీ కన్న కలలను ఈ రోజు ప్రజా ప్రభుత్వం నిజం చేస్తోందన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం నేటి తరానికి ఆదర్శనియమని, స్వాతంత్ర్య సమరయోధుడిగా, తెలంగాణ ఉద్యమ నేతగా, సామాజిక న్యాయం కోసం పోరాడిన నాయకుడిగా ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని గుత్తా సుఖేందర్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షల కోసం తన పదవులను సైతం త్యాగం చేసిన గొప్ప నాయకుడు బాపూజీ" అని అన్నారు. తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలపై ఆనాడే గళమెత్తి, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను బలంగా వినిపించిన నాయకుల్లో కొండా లక్ష్మణ్ బాపూజీ అగ్రగణ్యులని పేర్కొన్నారు. ప్రజల ప్రయోజనాల విషయంలో రాజీ పడకుండా, తాను నమ్మిన సిద్ధాంతాలకు జీవితాంతం కట్టుబడి పనిచేశారని కొనియాడారు.

## నమ్మిన సిద్ధాంతం కోసం రాజీలేని పోరాటం చేసిన ఆదర్శనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ : కెసిఆర్

**హైదరాబాద్,సెప్టెంబరు27,ప్రభాతవార్త:** స్వాతంత్ర్య సమర యోధుడు, తెలంగాణ తొలితరం ఉద్యమకారుడు, గాంధేయవాది, కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా వారి కృషిని కేసీఆర్ స్మరించుకుంటూ, ఘన నివాళి అర్పించారు. నమ్మిన సిద్ధాంతం కోసం మొక్కవోని పట్టుదలతో, రాజీలేని పోరాటం చేసిన బాపూజీ జీవితం, నేటి తరానికి ఆదర్శనీయం అని కేసీఆర్ తెలిపారు. ఈ సందర్భంగా, కొండా లక్ష్మణ్ బాపూజీతో తనకున్న అనుబంధాన్ని కేసీఆర్ స్మరించుకున్నారు. తాను పార్టీని స్థాపించి మలిదశ తెలంగాణ ఉద్యమం ప్రారంభించిన నాడు, నాటి సమైక్య పాలకుల దమన నీతిని ఎదురించి, భుజం తట్టి అండగా నిలిచిన సందర్భాన్ని కేసీఆర్ గుర్తు చేసుకున్నారు. తన జల దృశ్యం నివాసాన్ని తెలంగాణ స్వీయ రాజకీయ అస్తిత్వ పార్టీ ఆవిర్భావానికి వేదికగా నిచ్చిన బాపూజీ, గొప్ప వ్యక్తిత్వం కలిగిన రాజనీతిజ్ఞుడని కేసీఆర్ కొనియాడారు. వారి కృషిని గౌరవిస్తూ, వారి త్యాగాలు రేపటి తరాల వారికి గుర్తుంచు కునేలా, పదేండ్ల బిఆర్ఎస్ ప్రభుత్వం కాలంలో పలు కార్యక్రమాలు అమలుచేశామన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని అధికారికంగా నిర్వహించే సంప్రదాయాన్ని ప్రారంభించామన్నారు. ట్యాంక్ బండ్ వద్ద వారి విగ్రహాన్ని ఏర్పాటు చేయడమే కాకుండా, వారి పేరుతో హార్టికల్చరల్ యూనివర్సిటీనీ స్థాపించుకున్నామని, బాపూజీ ఆశయాలకు అనుగుణంగా సబ్బండ కుల వృత్తుల సంక్షేమం అభివృద్ధి కోసం అమలు చేసిన పలు కార్యక్రమాలు విజయవంతమై దేశం దృష్టిని ఆకర్షించాయని కేసీఆర్ గుర్తుచేశారు. బహుజన వర్గాల అభ్యున్నతి కోసం నిత్యం పరితపించిన బాపూజీ ఆశయాలను ఆచరించడం ద్వారానే, వారికి ఘనమైన నివాళులు అర్పించిన వారమౌతామని కేసీఆర్ స్పష్టం చేశారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయ సాధనే మార్గదర్శకం : కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:** తెలంగాణ ఉద్యమ యోధుడు, పద్మశ్రీ కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, కొండ లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం మరియు సామాజిక హక్కుల కోసం బాపూజీ చేసిన పోరాటాలను, ఆయన త్యాగాలను స్మరించుకుంటూ వారి స్ఫూర్తిని కొనియాడారు.

## జర్మనీలో తెలంగాణ ఎల్ఇడి వీధిదీపాలు

### 61 శాతం మేర 230 మిలియన్ యూనిట్ల ఆదా

### ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ ఆధ్వర్యంలో ప్రదర్శన

**హైదరాబాద్, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:** కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖకు చెందిన ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) ఆధ్వర్యంలో జర్మనీలో జరగనున్న అంతర్జాతీయ అధ్యయన పర్యటనలో భారతదేశపు ఇంధన సామర్థ్య, స్వచ్ఛ ఇంధన కార్యక్రమాలను ప్రదర్శించనుంది. కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ అధికారవర్గాల వివరాలు ప్రకారం ఈ నెల 28 నుండి అక్టోబర్ 2, 2026 వరకు జర్మనీలోని రావెన్స్ బర్గ్‌లో జరిగే విజ్ఞాన మార్పిడి కార్యక్రమంలో, రాష్ట్రాలవ్యాప్తంగా ఇంధన సామర్థ్యం, స్వచ్ఛ ఇంధన కార్యక్రమాలను అమలు చేయడంలో భారతదేశంలో అమలు చేస్తున్న ప్రాజెక్టులను ప్రదర్శించనుంది. ఇందులో భాగంగా సాంప్రదాయ దీపాల స్థానంలో ఏర్పాటు చేసి, గణనీయమైన ఇంధన ఆదాను అందించిన తెలంగాణ ఎల్ఇడి వీధి దీపాల ప్రాజెక్టును కూడా ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ సంస్థ తన ప్రదర్శనలో చేర్చనుంది. అలాగే స్వచ్ఛ ఇంధన పరిష్కారాలు, సుస్థిర అభివృద్ధి రంగాలలో తన అనుభవాన్ని కూడా పంచుకోనుంది. విద్యుత్ ఆదాను అందించడం, ప్రజా సేవలను మెరుగుపరచడం, సుస్థిర అభివృద్ధికి మద్దతు ఇవ్వడం కోసం, విస్తరించగల మరియు స్థానికంగా స్వీకరించగల పరిష్కారాల సామర్థ్యాన్ని ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ ప్రదర్శించనుంది.

కాగా తెలంగాణలోని గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో, ఈఈఎస్ఎల్ సంస్థ దాదాపు 5.5 లక్షల సాంప్రదాయ వీధి దీపాలను తొలగించి, వాటి స్థానంలో విద్యుత్ సామర్థ్యం గల ఎల్ఈడీ వీధి దీపాలను అమర్చి ఈ ప్రాజెక్టును విజయవంతంగా అమలు చేసింది. దీని ఫలితంగా 61 శాతానికి పైగా గణనీయమైన విద్యుత్ ఆదా జరిగింది. దీనివల్ల సంవత్సరానికి 230 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఆదా అవ్వడం, సంవత్సరానికి 0.19 మిలియన్ టన్నుల కార్బన్‌డైయాక్సైడ్ ఉద్గారాలు తగ్గడం, 60 మెగావాట్ల గరిష్ట డిమాండ్‌ను నివారించడం జరిగింది. ఈ ఫలితాలను దృష్టిలో ఉంచుకుని ఎనర్జీ ఎఫిషియెన్సీ సంస్థ జర్మనీ ప్రదర్శనలో తెలంగాణ వీధి దీపాల ప్రాజెక్టు ప్రదర్శనకు అవకాశం కల్పించింది.

### టెక్నాలజీ పొరపాటు చేస్తే..

## గిటార్‌ను హెల్మెట్‌లేని వ్యక్తిగా భావించి రూ.500 జరిమానా

### బెంగళూరులో పోలీసుల ఎఐ ఆధారిత కెమెరా తీరుపై నెటిజన్ల ఆగ్రహం



బెంగళూరు నగరంలో గిటార్ ధరించిన వ్యక్తికి ఎఐ కెమెరా జరిమానా విధించిన తాలూకు ఫొటో

**హైదరాబాద్, సెప్టెంబరు 27: ప్రభాతవార్త:** టెక్నాలజీ ఎంత అభివృద్ధి చెందినా అది మానవ నియంత్రణలోనే వుండాలని నిపుణులు చెబుతున్నది నిజమని మరోసారి తేలింది. బెంగళూరు నగరంలో సావిక్ దత్తా అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనంపై ఔటర్ రింగు రోడ్డులో వెళుతుండగా అతని వీపుపై గిటార్‌ను తగిలించుకున్నాడు. సదరు వ్యక్తి హెల్మెట్ ధరించినప్పటికీ వెనకాల వున్న గిటార్‌ను ట్రాఫిక్ పోలీసులు వాడుతున్న ఏఐ ఆధారిత కెమెరా మనిషిగా పొరబడి ఆ వాహనదారుడికి ఏకంగా 500 రూపాయల జరిమానా విధించింది. మధ్యాహ్నం వేళ ఈ ఘటన జరగగా మరుసటి రోజున సావిక్ దత్తాకు ట్రాఫిక్ పోలీసుల చలాన్ రాగా అతను ఆశ్చర్య పోయాడు. దీంతో తనకు వచ్చిన జరిమానా తాలూకు ఫోటోను సోషల్ మీడియాలో పంచుకున్నాడు. ఇదికాస్త వైరల్‌గా మారడంతో నెటిజన్లు టెక్నాలజి వాడకంలో మానవ ప్రమేయం కచ్చితంగా వుండాలని, అది ఏం చెబితే దానికి సై అంటే ఇలాగే వుంటుందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా ఈ ఘటనపై ట్రాఫిక్ జాయింట్ పోలీసు క మిషనర్ కార్తిక్ రెడ్డి స్పందిస్తూ దీనిపై పరిశీలిస్తామని ఏఐ కెమెరా గిటార్‌కు జరిమానా విధించడం నిజమని తేలితే వెంటనే రద్దు చేస్తామని తె లిపారు. గతంలో ఇవే ఏఐ కెమెరాలు నంబర్ ప్లేట్లను తప్పుగా చదవడం వల్ల వాహన దారులకు ఒకరికి బదులు మరొకరికి జరిమానాలు రావడ ంతో గందరగోళం ఏర్పడింది. దీంతో పాటు బెలగానిలో ఓ కారు డ్రైవర్ ఇదే కెమెరా హెల్మెట్ ధరించలేదని జరిమానా విధించడం సంచలనం రేపింది.

## ఇంటింటికి కుట్టుమెషీన్లు

### భారీగా 4,30,594 దరఖాస్తులు

**హైదరాబాద్, సెప్టెంబరు 27, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని బీసీ మహిళలకు స్వయం ఉపాధి కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుట్టు మెషీన్ల పథకానికి ఇబ్బడిముబ్బడిగా దరఖాస్తులు వస్తున్నాయి. ఈ నెల 25వ తేదీ నాటికి రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన లబ్ధిదారుల నుంచి 4,30,594 దరఖాస్తులు వచ్చినట్లు వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారవర్గాలు వెల్లడించాయి. ఈ పథకం కింద దరఖాస్తు చేసుకునేందుకు జిల్లాల వారీగా పోటీ నెలకొంది. రాష్ట్రంలోనే అత్యధికంగా నల్లగొండ జిల్లా 26,549 దరఖాస్తులతో ప్రథమ స్థానంలో నిలవగా, జగిత్యాల జిల్లా 25,237 దరఖాస్తులతో రెండో స్థానాన్ని దక్కించుకుంది. ఆ తర్వాతి స్థానాల్లో నిజామాబాద్ 25,025, సిద్దిపేట 22,713, కరీంనగర్ 21,735 జిల్లాలు నిలిచాయి. కేవలం పట్టణాలే కాకుండా మారుమూల ప్రాంతాల నుంచి కూడా మహిళలు ఈ పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు క్షేత్రస్థాయిలో దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేసి, అర్హులైన మహిళలకు త్వరలోనే కుట్టు మెషీన్లు అందజేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రాథమికంగా ప్రతి నియోజకవర్గానికి 1,000 మంది చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 1.19 లక్షల మందికి పంపిణీ చేయాలని బీసీ సంక్షేమ శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ పథకం కింద 100 శాతం సబ్సిడీతో రూ.12,000 విలువైన ఆటోమేటిక్ కుట్టు మెషీన్లను పంపిణీ చేయనున్నట్టు అధికారులు వెల్లడించారు.

# 'శత'క్కొట్టారు!



## వెస్టిండీస్‌పై భారత్ ఘనవిజయం

### విరాట్ కోహ్లీ, శుభ్‌మన్‌గిల్ సెంచరీలు

### కోహ్లీ రికార్డుల వెల్లువ

**తిరువనంతపురం, సెప్టెంబరు 27:** వన్డే ప్రపంచకప్ సన్నాహక సిరీస్‌ను భారత జట్టు ఘనంగా మొదలెట్టింది. తిరువనంతపురంలో శివాలెత్తిన విరాట్ కోహ్లీ(139 నాటౌట్) వన్డేల్లో 55వ శతకంతో రెచ్చిపోగా కెప్టెన్ శుభ్‌మన్ గిల్(110) సెంచరీతో వెస్టిండీస్ బౌలర్ల భరతం పట్టాడు. రెండో వికెట్‌కు 151 పరుగుల భాగస్వామ్యంతో గెలుపు పునాది వేశారిద్దరూ. బౌండరీలతో దడ పుట్టించిన ఈ జోడీ విధ్వంసంతో 296 పరుగుల లక్ష్యం కరిగిపోయింది. అలవోకగా గెలుపొందిన టీమిండియా మూడు వన్డేల సిరీస్‌లో అదిరే బోణీ కొట్టింది. విండీస్ నిర్దేశించిన 296 పరుగుల ఛేదనలో ఓపెనర్ రోహిత్ శర్మ(32) ఉన్నంతసేపు ఆకట్టుకున్నాడు. బౌండరీ వద్ద అల్జారీ జోసెఫ్ క్యాచ్ జారవిడవంతో బతికిపోయిన హిట్‌మ్యాన్ పెద్ద స్కోర్ చేయలేదు. అతడు త్వరగా ఔటైనా గిల్ దూకుడైన ఆటతో స్కోర్ బోర్డును ఉరికించాడు. తనదైన షాట్లతో అలరిస్తూ ఈ ఫార్మాట్లో 21వ ఫిఫ్టీ సాధించాడు గిల్. రోహిత్ ఔటయ్యాక విరాట్ కోహ్లీ(139 నాటౌట్) జతగా హాఫ్ సెంచరీ భాగస్వామ్యం నెలకొల్పాడు.

అల్జారీ ఓవర్లో సిక్సర్‌తో విరాట్ యాభై పూర్తి చేసుకున్నాడు. రెండో వికెట్‌కు 151 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పిన ఈ జోడీని విడదీశాడు. గిల్ ఔటయ్యాక మరింత రెచ్చిపోయిన కోహ్లీ రోస్టన్ చేజ్ ఓవర్లో కళ్లు చెదిరే సిక్సర్లు బాదాడు. మోతీ ఓవర్లో బంతిని లాంగ్ ఆన్‌లో స్టాండ్స్‌లోకి పంపిన విరాట్ వన్డేల్లో 55వ శతకం అందుకున్నాడు. సెంచరీ తర్వాత భీకరంగా ఆడిన కోహ్లీ కార్టీ వేసిన 42వ ఓవర్లో సిక్సర్‌తో మ్యాచ్‌ను ముగించాడు. ఎనిమిది వికెట్ల తేడాతో గెలుపొందిన టీమిండియా మూడు వన్డేల సిరీస్‌లో సూపర్ బోణీ చేసింది.

భారత పర్యటన తొలి వన్డేల్లో వెస్టిండీస్‌కు ఓపెనర్లు శుభారంభమిచ్చారు. తిరువనంతపురంలో జస్టిన్ గ్రీవ్స్(107), జాన్ క్యాంప్‌బెల్(62)లు ఖతర్నాక్ బ్యాటింగ్‌తో అలరిస్తూ శతక భాగస్వామ్యం నెలకొల్పారు. టీమిండియా బౌలర్లను కాచుకున్ ఈ ద్వయం దూకుడుగా ఆడడంతో విండీస్ స్కోర్ పరుగులు తీసింది. క్రీజులో పాతుకు పోయిన క్యాంప్ బెల్‌ను పెవి లియన్ పంపిన కుల్దీప్ యాదవ్ (440) తొలి వికెట్ అందించాడు. 20వ ఓవర్లో అతడు ఫ్లయిట్ చేసిన రెండో బంతిని స్వీప్ షాట్‌కు ప్రయత్నించిన ఈ లెఫ్ట్ హ్యాండర్ ప్రసిధ్ కృష్ణకు దొరికాడు.

దాంతో 135 వద్ద తొలి వికెట్ పడింది. అనంతరం కేసీ కార్టీ(13), కెప్టెన్ షాయ్ హోప్(12)లు క్రీజులో నిలవలే. ఓవైపు వికెట్లు పడుతున్నా సాధికారిక ఇన్నింగ్స్ ఆడిన గ్రీవ్స్ 104 బంతుల్లో 12 ఫోర్లతో తొలి శతకం సాధించాడు. భారత గడ్డపై వంద కొట్టిన 13వ కరేబియన్ బ్యాటర్‌గా రికార్డు సాధించిన అతడిని సైతం కుల్దీప్ బోల్తా కొట్టించాడు. 36వ ఓవర్లో మూడో బంతికి గ్రీవ్స్ ఎల్బీగా ఔటవ్వగా తర్వాతి బంతికే ఆండ్రూ(0) స్లిప్‌లో రోహిత్ చేతికి చిక్కాడు. కుల్దీప్ హ్యాట్రిక్‌పై నిలవగా రోస్టన్ ఛేజ్(24 అందుకు ఛాన్స్ ఇవ్వలేదు. ఆపై అమిర్ జంగూ(58 నాటౌట్) జతగా ఛేజ్ ఐదో వికెట్‌కు యాభై రన్స్ జోడించాడు. ప్రసిధ్ ఓవర్లో ఛేజ్ క్లీన్ బౌల్డయ్యాక వేగం పెంచిన జంగూ 38 బంతుల్లోనే ఫిఫ్టీ సాధించాడు. ఫలితంగా విండీస్ నిర్ణీత ఓవర్లలో పరుగులు చేసింది.

అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యంత వేగంగా 15 వేల పరుగులు మైలురాయిని అందుకున్న రెండోక్రికెటర్‌గా విరాట్‌కోహ్లీనిలిచారు. 303 ఇన్నింగ్స్‌లో ఈ ఫీట్‌ను సాధించారు. గతంలో సచిన్ టెండూల్కర్ 377 ఇన్నింగ్స్‌లో 15వేల పరుగుల మైలురాయిని అధిగమించి రికార్డుసాధించిన విషయం తెలిసిందే. తాజాగా విరాట్‌కోహ్లీ సెంచరీతో అంతర్జాతీయ క్రికెట్‌లో 86వ సెంచరీకాగా, వన్డేల్లో 55వ సెంచరీ.

## ఆన్‌లైన్ గేమ్స్ సంస్థ గేమ్స్ క్రాఫ్ట్‌కు ఇడి షాక్

### రూ.442 కోట్ల ఆస్తులు జప్తు

**హైదరాబాద్, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా లక్షలాది మంది యువతను ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసలుగా చేసిన గేమ్స్ క్రాఫ్ట్ అలియాస్ గేమ్స్ క్రాఫ్ట్ టెక్నాలజీస్ అనే సంస్థకు కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ మరోసారి భారీ షాక్ ఇచ్చింది. ఈ సంస్థకు చెందిన 442 కోట్ల రూపాయలను తాజాగా జప్తు చేసింది.

గేమ్స్ క్రాఫ్ట్ సంస్థకు చెందిన 2400 కోట్ల రూపాయలను ఈడీ ఇప్పటికే జప్తు చేయడం తెలిసిందే. మొదటి దఫా జప్తు అయిన ఆస్తుల్లో ఖరీదైన ప్రాంతాలలో వున్న విల్లాలు, ఖాళీ ప్లాట్లు, రిసార్టులు వుండగా తాజాగా జప్తు చే సిన వాటిలో సదరు సంస్థకు చెందిన ప్రముఖుల ఖరీదైన బంగళాలు, వాణిజ్య భవనాలు, నివాస సముదాయాలు వున్నాయి. మనీలాండరింగ్ కింద వీటిని జప్తు చేసినట్లు ఢిల్లీలోని ఈడీ అధికారులు ఆదివారం వెల్లడించారు. తాజా జప్తుతో గేమ్స్ క్రాఫ్ట్‌కు చెందిన 2882 కోట్ల రూపాయల ఆస్తులు ఈడీ కస్టడీకి చేరినట్లయ్యింది. కాగా గేమ్స్ క్రాఫ్ట్ సంస్థ రమ్మీ, టైమ్ టెక్నాలజీస్ సంస్థలు ఒకే గొడుగు కింద పనిచేస్తున్నాయి. రమ్మీ కల్చర్, రమ్మీ ప్రైం, ఫ్లేషిప్ తదితర మొబైల్ యాప్‌లను గేమ్స్ క్రాఫ్ట్ అభివృద్ధి చేసి వాటి ద్వారా ఆన్‌లైన్ రియల్ మనీ గేమ్స్ నిర్వహిస్తున్నట్లు ఈడీ విచారణలో తేలింది. దీని వల్ల మనీలాండరింగ్‌కు పాల్పడుతున్నట్లు ఈడీ తేల్చింది.

ఈ సంస్థ అభివృద్ధి చేసిన యాప్‌లను వినియోగిస్తున్న వారు దేశంలో మూడు కోట్లకు పైగా వున్నారని ఈడీ విచారణలో తేలింది. కాగా గేమ్స్ క్రాఫ్ట్ యాప్‌లను వాడి సర్వం కోల్పోయి, ఆత్మహత్యలకు పాల్పడిన వారిలో తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్నాటకు చెందిన వారు ఎక్కువగా వున్నారని ఈడీ విచారణలో వెలుగు చూసింది.

తమ యాప్‌లు చట్టబద్ధంగా పనిచేస్తున్నట్లు గేమ్స్ క్రాఫ్ట్ నిర్వాహకులు చెబుతున్నా ఇందులో వాస్తవం లేదని ఈడీ విచారణ లో తేలింది. యాప్‌లు వాడుతున్న వారికి తెలియకుండా అల్గారిథం అనే సాఫ్ట్‌వేర్‌తో పనిచేసే బాట్ అనే సాధనాలను వినియోగించి వినియోగ దారులను మోసం చేసి వారు ఓడిపోయేలా నిర్వాహకులు చేస్తున్నారని ఈడీ తేల్చింది. ఈ కారణంగానే గేమ్ క్రాఫ్ట్, రమ్మీ టైమ్స్‌కు భారీగా లాభాలు వచ్చాయని ఈడీ తేల్చింది.

## టిజి సేఫ్ దాడులకు బెదరని హోటళ్ల నిర్వాహకులు

### దాడులు ముగిసిన మరుసటి రోజునే యథావిధిగా వ్యాపారాలు

**హైదరాబాద్, సెప్టెంబరు 27: ప్రభాతవార్త:** కల్తీ ఆహార వస్తువులపై ఉక్కుపాదం మోపేందుకు సర్కారు కొత్తగా ఏర్పాటు చేసిన రాష్ట్ర స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎస్సెన్షియల్ డ్రగ్స్ (టిజి సేఫ్) దాడులకు హోటళ్ల నిర్వాహకుదు ఏమాత్రం భయపడడం లేదని ఆయా ప్రాంతాలలోని ఉదంతాలు తేటతెల్లం చేస్తున్నాయి. టిజి సేఫ్ ఏర్పాటైన తరువాత రాష్ట్ర వ్యాప్తంగా అనేక చోట్ల హోటళ్లతో పాటు దాబాలు, రెస్టారెంట్ల పై దాడులు చేయడం తెలిసిందే. ఇందులో క్యూర్ పరిధిలో (ఓఆర్ఆర్ లోపలి వరకు) ఎక్కువగా వుండడం గమనార్హం. ఇతర ప్రాంతాలలో నూ దాడులు జరిగినా క్యూర్ పరిధిలో జరిగిన దాడుల్లో పెద్ద ఎత్తున అక్రమాలు వెలుగు చూశాయి. అధికార యంత్రాంగం బలంగా వున్న ఈ ప్రాంతంలోనే హోటళ్లలో ఎక్కడా నిబంధనలు అమలవక పోవడం, వంటశాలల్లో కనీస ప్రమాణాలు వుండక పోవడం, కుళ్లిన మాంసంతో పా టు కుళ్లిపోయిన కూరగాయలు వుండడం, బొద్దింకలతో పాటు ఈగలు విపరీతంగా వుండడం అధికారులను షాక్‌కు గురిచేసింది. ఆహార పదార్థాల తయారీలో వాడే వస్తువుల్లో నకిలీవి ఎక్కువగా వుండడం మరో విశేషం. కృత్రిమ పన్నీర్‌ను విచ్చలవిడిగా వాడుతుండడం, సింథటిక్ రం గులను ఉపయోగిస్తుండడం కనిపించింది. దాబాలలో తయారవుతున్న ఆహార పదార్థాలు కనీస నాణ్యత కూడా లేకపోవడం గమనార్హం. వీటన్ని ంటి నేపథ్యంలో పలు హోటళ్ల లైసెన్స్‌లను అధికారులు రద్దు చేయగా కొన్నింటికి నోటీసులు ఇచ్చి తగిన గడువులోగా అన్నింటిని మార్చుకోవా లని ఆదేశించారు. ఇంతవరకు బాగానే వున్నా లైసెన్స్ రద్దయిన హోటళ్ల మరుసటి రోజు నుంచే యథావిధిగా పనిచేస్తుండడం ఆయా ప్రాంతా ల ప్రజలను నివ్వెర పరుస్తోంది. కేవలం ఒకరోజు వ్యవధిలోనే నిర్వాహకులు ఎలా మేనేజ్ చేసుకున్నారనే దానిపై ప్రజలు ఆశ్చర్యపోతున్నారు. ఇక నోటీసులు అందుకున్న హోటళ్లు, రెస్టారెంట్లలో సైతం టిజి సేఫ్ దాడుల తరువాత ఎలాంటి మార్పులు కనిపించడం లేదని ఆయా ప్రాం తాల ప్రజలు అంటున్నారు. వీటిలో ఆహార పదార్థాల నాణ్యత, రుచి సరిగ్గా వుండడం లేదని వారంటున్నారు. ఈ విషయంలో టిజి సేఫ్ అధి కారులు ఇకనైనా దృష్టి పెట్టాలని వారు కోరుతున్నారు.

## ఆదిలాబాద్ రిమ్స్‌లో రూ.50 కోట్లతో అత్యాధునిక ఎంసిహెచ్

### 150 పడకలతో మాతా శిశు సంరక్షణకు ప్రత్యేక విభాగం ఏర్పాటు

**హైదరాబాద్,సెప్టెంబరు27,ప్రభాతవార్త:** ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో మాతాశిశు సంరక్షణకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఇటీవల ఆసుపత్రిలో విద్యు దాఘాతంతో చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో చిన్నారులు మృత్యువాత పడిన నేపథ్యంలో వైద్య సదుపాయాల బలోపేతంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా రూ.50 కోట్ల అంచనా వ్యయంతో 150 పడకల సామర్థ్యం కలిగిన అత్యాధునిక మాతాశిశు సంరక్షణ కేంద్రాన్ని నిర్మించాలని నిర్ణయించింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆర్థికశాఖ ఆమోదం కోసం ప్రతిపాదనలు పంపించారు. అనుమతులు లభించిన వెంటనే టెండర్ల ప్రక్రియ ప్రారంభం కానుంది.

ఆదిలాబాద్ రిమ్స్‌లో ఇప్పటివరకు ప్రత్యేకంగా మాతాశిశు సంరక్షణ కేంద్రం అందుబాటులో లేదు. నవజాత శిశువులకు చికిత్స అందించేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక నవజాత శిశు సంరక్షణ విభాగంలోనే చిన్నారులకు వైద్య సేవలు అందిస్తున్నారు. తల్లులకు ప్రసవానికి ముందు, ప్రసవ సమయంలో, ప్రసవం తర్వాత అందించాల్సిన సేవలన్నింటినీ ఒకే చోట సమగ్రంగా అందించే ప్రత్యేక విభాగం లేకపోవడంతో కొత్త కేంద్రం అవసరం ఏర్పడింది. ఇటీవల రిమ్స్‌లో విద్యుదాఘాతంతో అగ్నిప్రమాదం చోటుచేసుకొని చిన్నారులు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటన అనంతరం ఆసుపత్రిలో మరమ్మతులు, మౌలిక సదుపాయాల మెరుగుదలకు ప్రభుత్వం తక్షణమే రూ.11 కోట్లు మంజూరు చేసింది. తాజాగా ప్రత్యేక ఎంసీహెచ్ నిర్మాణానికి నిర్ణయం తీసుకోవడం ద్వారా మాతాశిశు వైద్య సేవలను మరింత విస్తరించేందుకు చర్యలు చేపట్టింది.

కొత్తగా నిర్మించనున్న ఎంసీహెచ్ భవనాన్ని అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో, అవసరమైన వైద్య ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దనున్నారు. గర్భిణులకు ప్రసవానికి ముందు వైద్య సేవలు అందించేందుకు యాంటీనేటల్ కేర్ వార్డును ఏర్పాటు చేస్తారు. సాధారణ ప్రసవాలు, సిజేరియన్ ఆపరేషన్ల కోసం ప్రత్యేక లేబర్ గదులు అందుబాటులోకి తీసుకురానున్నారు. ప్రసవం అనంతరం తల్లులకు వైద్య సంరక్షణ అందించేందుకు పోస్ట్‌నేటల్ కేర్ వార్డులను ఏర్పాటు చేయనున్నారు. నెలలు నిండకుండానే జన్మించిన శిశువులు, ప్రత్యేక వైద్య పర్యవేక్షణ అవసరమైన చిన్నారుల కోసం ప్రత్యేక నవజాత శిశు సంరక్షణ విభాగాలను నిర్మించనున్నారు. వీటితో పాటు నవజాత శిశువుల కోసం ప్రత్యేక ఐసీయూలను కూడా ఏర్పాటు చేయనున్నారు.

శిశువులకు అవసరమైన రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించేందుకు ఆధునిక వైద్య పరికరాలను సమకూర్చనున్నారు. తల్లులు, నవజాత శిశువులకు అత్యవసర పరిస్థితుల్లోనూ మెరుగైన వైద్యం అందించేలా కేంద్రాన్ని రూపొందించనున్నారు. రాష్ట్రంలోని ఇతర ఎంసీహెచ్ కేంద్రాలతో పోలిస్తే అత్యాధునిక సదుపాయాలతో ఆదిలాబాద్ రిమ్స్ కేంద్రాన్ని నిర్మించాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సూచించినట్లు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు ఆర్థికశాఖ ఆమోదం కోసం ఎదురుచూస్తోంది. అనుమతులు వచ్చిన వెంటనే టెండర్ల ప్రక్రియ చేపట్టి నిర్మాణ పనులు ప్రారంభించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఈ కేంద్రం అందుబాటులోకి వస్తే ఆదిలాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాల గర్భిణులు, నవజాత శిశువులకు ప్రత్యేక వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి.

## ఎస్ఐఆర్ ప్రక్రియ వల్ల ప్రజలు ఇబ్బందులు

### ఎంపి అసదుద్దీన్ ఒవైసీ

**హైదరాబాద్ (చార్మినార్), సెప్టెంబరు 27, ప్రభాతవార్త :** దేశంలో అమలవుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ వల్ల పేద ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారని ఎఐఎంఐఎం అధ్యక్షులు, హైదరాబాద్ పార్లమెంట్ సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ తెలిపారు.ఎంపి అసదుద్దీన్ ఒవైసీ ఆదివారం మీడియాతో మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియపై తాను మొదటి నుంచి వ్యతిరేకిస్తున్నానని, ఎస్ఐఆర్‌కు సంబంధించిన డాక్యుమెంట్ల కోసం ప్రజలు తిరుగుతూ నానా అవస్థలు పడుతున్నారని తెలియజేశారు.తుది జాబితాలో పేర్లు లేని వారి పరిస్థితి గురించి బిజెపి ప్రభుత్వం స్పష్టమైన సమాధానం ఇవ్వాలని ఎంపి అసదుద్దీన్ ఒవైసీ డిమాండ్ చేశారు.

## తెలంగాణ వచ్చినా అవసరాలు తీరలేదు

### కృష్ణా నదిలో తెలంగాణ వాటా తేల్చాలి : ఎమ్మెల్సీ కోదండరాం

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు 27, ప్రభాతవార్త :** నీళ్లలో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని ఎదుర్కోవడానికి ప్రధానంగా ఉద్యమం మొదలైందని కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకుని కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా స్పష్టంగా తీర్చాలని ఎమ్మెల్సీ కోదండరాం అన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా వంగూరు మండలం లోని ఉల్పర నుంచి ఉమ్మడి మహబూబ్‌గర్ జిల్లా పెండింగ్ ప్రాజెక్టుల సాధన జేఏసీ ఆధ్వర్యంలో కల్వకుర్తి వరకు చేపట్టిన పాదయాత్ర ముగింపులో ప్రొ॥ ఎమ్మెల్సీ కోదండరాం పాల్గొని ప్రసంగించారు.

జేఏసీ ఆధ్వర్యంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం లో భాగంగా చేపట్టిన డిండి లిఫ్టు ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పాదయాత్రకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ టీజేఏసీ మాజీ చైర్మన్ కోదండరాం మాట్లాడుతూ లక్ష కోట్లు ఖర్చుపెట్టి గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు కడితే అది కూలిందని కానీ ఆ డబ్బులను జాగ్రత్తగా ఖర్చు పెట్టి ఉంటే పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పనులు కూడా పూర్తయ్యేవని కోదండరామ్ అన్నారు. కేవలం 1000 కోట్లు కేటాయిస్తే పాలమూరు రంగారెడ్డి తో పాటు ఇతర ప్రాజెక్టులు కూడా పనులు పూర్తయ్యవని అన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాకు వచ్చే కొన్నిటిలో వాటిని నల్గొండకు తరలించడం సరికాదన్నారు. నల్గొండకు నీళ్ల ఇవ్వాలని కానీ అది పాలమూరు నుంచి తరలించాల్సిన అవసరం లేదన్నారు. ప్రొ॥ హరగోపాల్ మాట్లాడుతూ ఉమ్మడి పాలమూరుకు నీళ్ల సాధించే వరకు పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పెండింగ్ ప్రాజెక్టుల సాధన జేఏసీ చైర్మన్ రాజేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ బెక్కం జనార్ధన్, జేఏసీ నాయకులు వీర బ్రహ్మాచారి, రాఘవాచారి, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, తల్లోజు ఆచారి, పవన్ కుమార్ రెడ్డి, దోకూర్, కట్ట సుధాకర్, ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి, తిరుపతి, బీజేపీ ముఖ్య నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉత్తరప్రదేశ్‌లో గవర్నర్ శివప్రతాప్‌శుక్లా

**హైదరాబాద్,సెప్టెంబరు27,ప్రభాతవార్త:** ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా పర్యటిస్తున్నారు. ఆక్కడ నోయిడాలోని సెక్టార్ 62, ఇంటనర్నేషనల్ ట్రేడ్ ఎక్స్‌పో సెంటర్‌లో రాష్ట్రీయ ఆయుష్ మహోత్సవ్ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఆయుర్వేదిక్ వైద్య ఎడ్యు,హెల్త్ ఫౌండేషన్ ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది.

## 41 కొత్త 2బి బార్లకు దరఖాస్తుల ఆహ్వానం.. నేటి నుంచి స్వీకరణ

**హైదరాబాద్,సెప్టెంబరు27,ప్రభాతవార్త:** తెలంగాణలో 41 కొత్త 2బీ బార్ల ఏర్పాటుకు ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించింది. క్యూర్ పరిధిలో 14, మిగిలిన మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పరిధిలో 27 బార్లకు దరఖాస్తుల స్వీకరణకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. సోమవారం(ఈనెల 28) నుంచి అక్టోబర్ 12 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఒక్కో దరఖాస్తుకు రూ.లక్ష రుసుము చెల్లించాలి. క్యూర్ ఏర్పాటు, కొత్త మున్సిపాలిటీల ఏర్పాటు, మున్సిపాలిటీల్లో గ్రామాల విలీనం తదితర కారణాలతో పెరిగిన జనాభాకు అనుగుణంగా కొత్త 2బీ బార్ల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతించింది. క్యూర్ పరిధిలోని గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి ప్రాంతాల్లోని 14 బార్లకు సంబంధించి అబ్కారీ భవన్‌లోని కమిషనర్ కార్యాలయంతో పాటు సంబంధిత డిప్యూటీ కమిషనర్ కార్యాలయాల్లో దరఖాస్తులు సమర్పించవచ్చు.

## పెండింగ్‌లో అంగన్‌వాడీ బకాయిలు

### 46 మందికి రూ.29 లక్షలు పెండింగ్

**హైదరాబాద్, సెప్టెంబరు 26, ప్రభాతవార్త:** తెలంగాణలో పనిచేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పెండింగ్ బకాయిలకై ఎదురు చూస్తున్నారు. గత రెండేళ్లలో 3,895 మంది అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు విధుల రిలీవ్ కాగా వారిలో ఇంకా 46 మందికి ఆర్థిక ప్రయోజనాలు అందలేదు. అంగన్‌వాడీల కార్యర్తలు వెల్లడించిన వివరాలు ప్రకారం 2017లో, అంగన్‌వాడీ ఉపాధ్యాయులకు సేవాంతపు ప్రయోజనాన్ని రూ.60 వేలుగా నిర్ణయించగా, అంగన్‌వాడీ సహాయకులు, మినీ అంగన్‌వాడీ ఉపాధ్యాయులు రూ.30 వేలకు అర్హులుగా ఉండేవారు. 2023లో, ఈ ప్రయోజనాలను అంగన్‌వాడీ ఉపాధ్యాయులకు రూ.1 లక్షకు, సహాయకులు, మినీ అంగన్‌వాడీ ఉపాధ్యాయులకు రూ.50 వేలకు మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పెంచింది. తదనంతరం, మరోసారి అంగన్‌వాడీ ఉపాధ్యాయులకు రూ.2 లక్షలు, అంగన్‌వాడీ సహాయకులు, మినీ అంగన్‌వాడీ ఉపాధ్యాయులకు రూ.1 లక్షకు ప్రయోజనాలను పెంచారు.

## పంటలు ఎండబెట్టి ఆంధ్రకు నీళ్లు

### పాలమూరుకు ప్రధాన శత్రువు సిఎం రేవంత్‌రెడ్డి

### కాలువలు, మోటార్లు రెడీగా ఉన్నా నీళ్లెందుకు ఇవ్వరు?

### బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్



మీడియాతో మాట్లాడుతున్న కెటిఆర్

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు 27, ప్రభాతవార్త :** ఇక్కడ పంటలు ఎండబెట్టి నీటిని ఆంధ్రాకు తరలిస్తున్నాడని, చంద్రబాబు దగ్గర పిల్లిలా ఉండి, నల్లమల్లలో పులిని అంటూ ప్రగల్భాలు పలుకుతున్నాడు అని సీఎం రేవంత్ రెడ్డి నీ ఉద్దేశించి బి ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రైతులకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని, రైతులకు న్యాయం జరిగే వరకు ఈ ప్రభుత్వాన్ని వదిలిపెట్టబోమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు హెచ్చరించారు. నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి తండ్రి దశదినకర్మకు సింగోటం వెళ్లిన ఆయన నాగర్ కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలోని దేశిట్యాల వద్ద పత్తి, మొక్కజొన్న, మినుము పంటలను కేటీఆర్ పరిశీలించారు. అనంతరం మీడియా తో కేటీఆర్ మాట్లాడుతూ ఉమ్మడి పాలమూరు జిల్లాకు ప్రధాన శత్రువు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే అన్నారు. కృష్ణా, గోదావరిలో 248 టీఎంసీల నీరు పుష్కలంగా ఉన్నా వాడుకోవడం లేదన్నారు. కృష్ణ గోదావరి బేసిన్ లో జలాలు పుష్కలంగా ఉన్నాయి. పాలమూరు బిడ్డగా చెప్పుకునే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు ఇదే జిల్లాకు శత్రువుగా మారడానికి కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. రైతులకు నీళ్ల ఇస్తే మళ్లీ యూరియా, కరెంటు ఇవ్వాలని, పంటలు కొనాలని, వరికి బోనస్ ఇవ్వాల్సి వస్తుందనే నీళ్ల ఇవ్వడం లేదని ఆరోపించారు. గతంలో కేసీఆర్ హయాంలో 24 గంటల కరెంటు ఉండేదన్నారు. వచ్చే ప్రభుత్వం మనదే అని, కేసీఆర్ ప్రభుత్వంలో రైతులకు తప్పక న్యాయం చేస్తాం అని కేటీఆర్ భరోసా ఇచ్చారుకొల్లాపూర్ చౌరస్తా సమీపంలోని దేశిటిక్యాల గ్రామ శివారులో మాజీ మంత్రులు డా.సి.లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్,జగదీష్ రెడ్డి తో కలిసి ఎండిన పంటలను పరిశీలించారు. కొల్లాపూర్ వెళ్లి తిరుగు ప్రయాణంలో రైతులు చూపించిన ఎండిన మొక్కజొన్న, పత్తి పంటలను పరిశీలించి,రైతులతో మాట్లాడి పంటల పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు.

# రూ.7.86లక్షల కోట్ల కేంద్ర రుణ లక్ష్యం

**ఇందులో రూ.15 వేలకోట్ల సావరిన్ గ్రీన్ బాండ్స్**

**రూ.50 వేల కోట్ల వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సెస్**

**ప్రస్తుత 2026-27 రెండో అర్ధబాగానికి రుణ ప్రణాళిక**

**హైదరాబాద్, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:** ప్రస్తుత 2026-27 ఆర్థిక సంవత్సరం రెండవ అర్థభాగం కోసం కేంద్ర ప్రభుత్వం రుణ ప్రణాళికను నిర్ణయించింది. ఈ అర్థభాగంలో రూ.7.86 లక్షల కోట్ల రుణం సేకరించనుంది. ఈ మేరకు దీనికి సంబంధించి కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రతిపాదనలు రూపొందించింది. ఆర్థిక మంత్రిత్వ శాఖలోని సీనియర్ కార్యదర్శి ఒకరు వీటి వివరాలను తెలిపారు. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తో సంప్రదించి, 2026-27 ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో (హెచ్2) రూ.7,86,000 కోట్లు రుణం తీసుకోవాలని నిర్ణయించింది. ఇందులో రూ.15 వేల కోట్ల సావరిన్ గ్రీన్ బాండ్ల (ఎస్‌జిఆర్‌బిఎస్) జారీ కూడా ఉంది. 2026 -27 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ అంచనాలైన రూ.17.20 లక్షల కోట్లతో పోలిస్తే, భారత ప్రభుత్వం కాలపరిమితి గల సెక్యూరిటీల ద్వారా రూ.15,99,506 కోట్ల మార్కెట్ రుణం తీసుకుంటుందని అంచనా వేసింది. ఈ నేపథ్యంలో ఈ ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో తీసుకునే మొత్తం 23 వారపు వేలం ద్వారా రూ.7,86,000 కోట్లు స్థూల మార్కెట్ రుణాల సేకరణ పూర్తి చేయబడుతుందని ప్రణాళికలో పేర్కొంది. ఈ మార్కెట్ రుణాలు 3, 5, 7, 10, 15, 30, 40 మరియు 50 సంవత్సరాల కాలపరిమితి గల సెక్యూరిటీలపై విస్తరించబడతాయని పేర్కొంది. వివిధ కాలపరిమితుల క్రింద రుణాల వాటాలో భాగంగా 3సంవత్సరాలు (6.9 శాతం), 5సంవత్సరాలు (12.1 శాతం), 7 సంవత్సరాలు (9.1 శాతం), 10సంవత్సరాలు (26.3 శాతం), 15 సంవత్సరాలు (17.6 శాతం), 30సంవత్సరాలు (9.2 శాతం), 40 సంవత్సరాలు (8.9 శాతం), 50సంవత్సరాలు (9.9శాతం) చొప్పున వడ్డీ ప్రక్రియను సులభతరం చేయడానికి ప్రభుత్వం సెక్యూరిటీల మార్పిడి చేయనుంది. బహిరంగ ఈ వేలంలో సూచించిన ప్రతి సెక్యూరిటీకి రూ.2 వేల కోట్ల వరకు అదనపు రుణం కింద గ్రీన్‌షూ ఆప్షన్‌ను వినియోగించుకునే హక్కును ప్రభుత్వం వినియోగించుకోనుంది. అలాగే 2026-27 ఆర్థిక సంవత్సరం మూడవ త్రైమాసికంలో, ప్రభుత్వం 13 వేలం వారాలలో ట్రెజరీ బిల్లుల (టిబిల్లులు) జారీ ద్వారా వారానికి రూ.23 వేల కోట్లు రుణం తీసుకోనుంది. దీనికి గాను కేటాయింపులు చూస్తే 91రోజుల టిబిల్లుల కింద రూ.8 వేల కోట్లు, 182రోజుల టిబిల్లుల కింద మరో రూ.8, వేల కోట్లు, 364రోజుల టిబిల్లుల కింద రూ.7 వేల కోట్లుగా ఉన్నాయి. కాగా ప్రభుత్వ ఖాతాలలో ఏవైనా తాత్కాలిక అసమతుల్యతలు ఏర్పడితే వాటిని సరిదిద్దేందుకు, 2026-27 ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థానికి గాను వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సెస్ (డబ్ల్యూఎంఎ) పరిమితిని రిజర్వ్ బ్యాంక్ రూ.50 వేల కోట్లుగా నిర్ధారించింది.



## మణిపూర్‌లో నాగాపౌరుల కాల్చివేత

**ఇంఫాల్, సెప్టెంబరు 27:** మణిపూర్‌లో హింసాత్మక సంఘటనలు కొనసాగుతున్నాయి. తాజాగా ఇద్దరు నాగా పౌరులను సాయుధ వ్యక్తులు కాల్చి చంపారు. ఈ కాల్పుల్లో మరో ఇద్దరు నాగా పౌరులు గాయపడ్డారు. భద్రతా దళాలు సంఘటనా ప్రాంతానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించాయి. సేనాపతి జిల్లాలోని కాలెన్‌జాంగ్ గ్రామంలో ఈ సంఘటన జరిగింది. గ్రామ పెద్దకు చెందిన ఇంట్లో ఉన్న నాగా పౌరులపై గుర్తు తెలియని సాయుధ వ్యక్తులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ఇద్దరు నాగా పౌరులు మరణించగా మరో ఇద్దరు గాయపడ్డారు. మృతులను ఆ జిల్లాలోని వేర్వేరు గ్రామాలకు చెందిన రాకీ, కుమార్‌గా గుర్తించారు. ఈ కాల్పుల సంఘటన గురించి తెలిసిన వెంటనే పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడి పరిస్థితిని సమీక్షించారు.

## మహాకుంభమేళా కోసం సిఎం పూర్వీకుల ఇల్లు కూల్చేసిన అధికారులు

**ఉజ్జయిని, సెప్టెంబరు 27:** మధ్యప్రదేశ్‌లో 2028 లో జరిగే సింహాస్థ మహాకుంభమేళా కోసం ఉజ్జయినిలో రోడ్డు విస్తరణ పనులు గత కొన్ని రోజులుగా సాగుతున్న సందర్భంగా ఉజ్జయిని లోని సీఎం మోహన్ యాదవ్ పూర్వీకుల ఇంటిని అధికారులు కూల్చేశారు. ఈ కార్యక్రమాన్ని స్వయంగా సీఎం ప్రారంభించారు. ఉజ్జయినిలో రోడ్డు విస్తరణ ప్రాజెక్టులో భాగంగా అడ్డుగా ఉన్న మొత్తం 272 కట్టడాలను కూల్చివేయాలని అధికారులు నిర్ణయించారు. ఇందులో సీఎం మోహన్ యాదవ్ పూర్వీకుల ఇల్లు కూడా ఉంది. అయితే ఆ ఇంటిని కూల్చేందుకు అధికారులు వెనకాడడంతో స్వయంగా సీఎం మోహన్ యాదవ్ గునపంతో తొలి దెబ్బ ఇంటి ముందు గడప వద్ద కొట్టి కూల్చివేత పనులను ప్రారంభించారు. అంతకుముందు ఇంట్లో పూజలు నిర్వహించారు. అయితే తన చిన్ననాటి జ్ఞాపకాలు ఉన్న ఇల్లు కావడంతో ఒకింత సీఎం భావోద్వేగానికి గురయ్యారు. కానీ రోడ్డు విస్తరణ, సమాజ హిత కోసం ఇలాంటివి తప్పవని స్పష్టం చేశారు. ఇక సింహాస్థ మహాకుంభమేళాలో భాగంగా ఉజ్జయినిలో రోడ్డు విస్తరణ పనులు వేగంగా సాగుతున్నాయి. ఈ మేరకు ప్రజలు ఈ రోడ్డు విస్తరణ పనులకు సహకరించాలని సీఎం మోహన్ యాదవ్ కోరారు. వచ్చే సింహాస్థ మహా కుంభమేళా పనులు ఎలాంటి ఆటంకం లేకుండా జరిగేందుకు ప్రజలు అధికారులకు సహకరించాలని కోరారు. ఇక ఉజ్జయినిలో సీఎం ఇల్లు ఆయన తండ్రి పూనమ్ చంద్, అంకుల్ శంకర్ లాల్ పేర్లమీద రిజిస్టర్ అయి ఉంది. శంకర్ లాల్ కుటుంబం ఈ ఇంట్లోనే నివసిస్తుండగా సీఎం సోదరి కళావతి యాదవ్ కు సెపరేట్ గా ఇల్లు ఉంది. ఇక సీఎం తాత శ్రీ రామ చంద్ర 1974లో ఈ ఇంటిని నిర్మించారు. ఉజ్జయినిలో రానున్న మహాకుంభమేళాలో భాగంగా 500 కిలోమీటర్ల వరకు రోడ్లను విస్తరించే కార్యక్రమం చేస్తున్నారు. ఈ రోడ్డు విస్తరణలో భాగంగానే సీఎం ఇంటిని అధికారులు కూల్చేశారు. అయితే తన ఇంటిని కూల్చడంపై సీఎం ఎలాంటి నష్టపరిహారం ఆశించలేదు. ఈ ప్రాంతంలో కూల్చివేతలతో తమ ఇళ్లను కోల్పోయిన 271 మంది బాధితులకు స్థానిక కలెక్టర్ ఆదేశాల మేరకు నష్టపరిహారం అందనుంది.



## రోడ్డు పనుల తనిఖీల్లో యువకుడి చెంపపగులగొట్టిన ఢిల్లీ మంత్రి

**న్యూఢిల్లీ,సెప్టెంబరు 27:** దేశ రాజధాని దిల్లీలోని తిలక్ నగర్ లో రోడ్డు మరమ్మతు పనుల తనిఖీలో భాగంగా పీడబ్ల్యూ మంత్రి పర్వేశ్ వర్మ పక్కనే ఉన్న ఓ యువకుడి చెంప పగులగొట్టిన ఘటన ఇప్పుడు రాజకీయంగా తీవ్ర వివాదాస్పదం అయింది. తిలక్ నగర్ లోని రోడ్డు తనిఖీల్లో భాగంగా స్థానిక ఆప్ ఎమ్మెల్యే జర్నైయిల్ సింగ్‌కు దిల్లీ మంత్రి పర్వేశ్ వర్మకు మధ్య మాటల వాగ్వాదం చెలరేగింది. రోడ్డు పనుల్లో నాణ్యత విషయంలో ఇరు వర్గాల మధ్య వాదనలు నడుస్తుండగా ఆప్ ఎమ్మెల్యే జర్నైయిల్ సింగ్ అనుచరుడు అయిన ఓ యువకుడు మంత్రి పర్వేశ్ వర్మను ఫోన్‌లో వీడియో తీస్తుండగా ఒక్కసారిగా కోపోద్రిక్తుడైన ఆయన యువకుడి చెంప చెల్లుమనిపించాడు. యువకుడి వద్ద నుంచి ఫోన్ లాక్కొని మరీ దాడి చేశారు మంత్రి పర్వేశ్ వర్మ. దాంతో అక్కడి పరిస్థితి ఒక్కసారిగా వేడెక్కింది. ఇరు వర్గాల మధ్య కాస్త తోపులాట, ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారాయి. ఈ ఘటన సమయంలో మంత్రి తీరుపై అక్కడి కార్యకర్తలు పలు రకాలుగా తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ మేరకు వారి మాటలు ఆ వీడియోలో స్పష్టంగా వినిపిస్తున్నాయి. అతడ్ని ఎలా కొడతారు అని ఆ జనంలోంచి ఓ కార్యకర్త అరిచాడు. అతడ్ని కొట్టేశాడు చూడండి అంటూ మరో కార్యకర్త మాటలు వినిపిస్తున్నాయి. మరో వ్యక్తి ఏమైంది కనిపించడం లేదు అన్న వాయిస్ వినిపిస్తోంది. ఇంకో కార్యకర్త మాట్లాడుతూ.. కామన్ మ్యాన్‌ను ఎవరూ కొట్టడానికి రైట్ లేదు అని అన్నాడు. ఇక తిలక్ నగర్ లోని రోడ్డు పనులను తనిఖీ చేసేందుకు మంత్రి పర్వేశ్ వర్మ, ఆప్ ఎమ్మెల్యే జర్నైయిల్ సింగ్ అక్కడకు రావడంతో తప్పు మీదంటే.. మీదని ఇరు వర్గాల మధ్య నినాదాలు స్టార్ట్ అయ్యాయి.



## అస్సోం సిఎం భయపడ్డారు: అశుతోష్ రాంకా

**గువాహతి, సెప్టెంబరు 27:** అసోం రాజధాని గువహటిలో సీజేపీ నేతలను స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. సీజేపీ కో ఫౌండర్ అశుతోష్ రాంకా సహా పలువురు సీజేపీ నేతల్ని పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. అసోంలో పాఠశాలల పరిస్థితిని గురించి అంచనా వేసేందుకు అధ్యయన బాట పట్టారు. అసోం ప్రజలకు, ఇండియాకు వివరించాలని తాము పర్యటన చేపట్టినట్లు సీజేపీ నేతలు అన్నారు. తమను అడ్డుకోవడం ద్వారా అసోం సీఎం హిమంత బిశ్వశర్మ తమకు భయపడ్డారని సీజేపీ నేతలు ఆరోపించారు. రాంకా సహా సీజేపీ నేతల్ని అదుపు చేయడంపై సీజేపీ ఫౌండర్ అభిజీత్ దీప్కే ప్రశ్నించారు.

## రాజకీయ దుమారంతో వెనక్కి తగ్గిన టివికె సర్కార్



**చెన్నై, సెప్టెంబరు 27:** తమిళనాడు రాజకీయాల్లో తీవ్ర దుమారానికి దారితీసిన ఒక కీలక నిర్ణయంపై విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వం వెనక్కి తగ్గింది. సమాచార హక్కు చట్టం పరిధి నుంచి పబ్లిక్ (లా అండ్ ఆర్డర్) శాఖను తప్పిస్తూ కొద్ది రోజుల క్రితం జారీ చేసిన వివాదాస్పద ఉత్తర్వులను ప్రభుత్వం అధికారికంగా రద్దు చేసింది. దీనివల్ల ప్రజలకు ఎలాంటి సమాచార హక్కు కోల్పోయే ప్రమాదం లేకుండా మళ్లీ పాత పద్ధతే కొనసాగనుంది. తీవ్ర విమర్శలు వ్యక్తమైన నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న ఈ యూటర్న్ రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఆర్టీఐ చట్టం2005 లోని సెక్షన్ 24(4) ప్రకారం పబ్లిక్ (లా అండ్ ఆర్డర్) శాఖను ఇంటెలిజెన్స్ అండ్ సెక్యూరిటీ ఆర్గనైజేషన్‌గా పేర్కొంటూ తమిళనాడు ప్రభుత్వం ఇటీవల జీవో నెం. 57 ను జారీ చేసింది. ఈ శాఖ పరిధిలోకి పోలీసు కాల్పులు, కస్టడీ మరణాలు, చిత్రహింసల విచారణ నివేదికలు వంటి అత్యంత కీలకమైన అంశాలు వస్తాయి. ఒకవేళ ఈ ఉత్తర్వులు అమల్లో ఉంటే, లా అండ్ ఆర్డర్ విభాగానికి సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని సాధారణ ప్రజలు ఆర్టీఐ ద్వారా అడిగి తెలుసుకునే అవకాశం ఉండేది కాదు. ఈ నిబంధనపై విపక్షాలు తీవ్ర స్థాయిలో మండిపడ్డాయి. ఈ నిర్ణయంపై సీపీఎం ఎంపీ వెంకటేశన్, కాంగ్రెస్ ఎంపీ కార్తి చిదంబరంతో పాటు పలువురు ప్రముఖులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది తమిళనాడును పోలీస్ స్టేట్‌గా మార్చే కుట్ర అని, ప్రజాస్వామ్య జవాబుదారీతనానికి ఇది విఘాతమని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో తెచ్చిన ఆర్టీఐ చట్టాన్ని బలహీనపరిచేలా ఇలాంటి నిర్ణయాలు ఉండకూడదని హితవు పలికారు. ప్రజల నుంచి వ్యక్తమవుతున్న అసంతృప్తిని, వ్యతిరేకతను గమనించిన టీవీకే ప్రభుత్వం ప్రజాభావాలకు గౌరవం ఇస్తూ ఆ ఉత్తర్వులను తక్షణమే వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రకటించింది. టీవీకే మంత్రులు సీటీఆర్ నిర్మల్ కుమార్ , రాజ్ మోహన్ సమాచార హక్కు చట్టాన్ని పూర్తిగా ఎత్తేయలేదని, కేవలం వర్గపోరాటాలు, కొన్ని సున్నితమైన శాంతిభద్రతల అంశాలకు మాత్రమే మినహాయింపు ఇవ్వాలని భావించామని తెలిపారు. భావప్రకటన స్వేచ్ఛకు ఎక్కడా భంగం కలగకుండా పారదర్శక పాలన అందిస్తామని స్పష్టం చేశారు. ఏదేమైనప్పటికీ, ప్రజల నుంచి వచ్చిన తీవ్ర నిరసనల కారణంగా ప్రభుత్వం క్షణాల వ్యవధిలోనే పునరాలోచించి ఈ వివాదానికి తెరదించింది.

## వారణాసి ఎన్నికను రద్దుచేసి మళ్లీ ఎన్నికలు నిర్వహించాలి



**వారణాసి, సెప్టెంబరు 27:** ఉత్తర్ ప్రదేశ్‌లో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నాయి. ఇప్పటికే ఆ రాష్ట్రంలో రాజకీయ వేడి మొదలైంది. ఇలాంటి సమయంలో కాంగ్రెస్ రాష్ట్రాధ్యక్షుడు అజయ్ రాయ్ సంచలన ఆరోపణలు చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను అరెస్ట్ చేయడంతో పాటు, 2024లో ప్రధాని నరేంద్రమోడీ గెలిచిన వారణాసి లోక్‌సభ ఎన్నికల్ని రద్దు చేసి, మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఆగ్రాలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆదివారం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. జ్ఞానేష్ కుమార్ అవినీతిపరుడని, నిజాయితీ లేని అధికారి అని ఆరోపించారు. ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడి బీజేపీ గెలిచిందని, బీజేపీకి ఆయన సహకరించారని అన్నారు. జ్ఞానేష్ కుమార్ పదవిలో ఉన్న సమయంలో నిర్వహించిన అన్ని రాష్ట్రాల ఎన్నికల్ని రద్దు చేసి, తిరిగి నిర్వహించాలని డిమాండ్ చేశారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో వారణాసి నుంచి పోటీ చేసిన నరేంద్రమోడీ మరోసారి విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో మోడీ 6,12,970 ఓట్లు సాధించగా, కాంగ్రెస్ తరుపున పోటీ చేసిన అజయ్ రాయ్‌కు 4,60,457 ఓట్లు వచ్చాయి. మోడీ1,52,513 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. ఈ ఫలితాలపై అజయ్ రాయ్ అనుమానాలు వ్యక్తం చేశారు. వారణాసి ఎన్నికల్ని రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని కోరారు.

## తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఇరాన్: డొనాల్డ్‌ట్రంప్

**వాషింగ్టన్, సెప్టెంబరు 27:** వరల్డ్‌వైడ్‌గా ఆయిల్ రవాణాలో అత్యంత కీలకమైన హార్మూజ్ జలసంధి విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన ఆదివారం వాషింగ్టన్ డీసీలో మీడియాతో మాట్లాడుతూ ఇరాన్ దేశం ఆర్థికంగా తీవ్ర సంక్షోభంలో చిక్కుకుందని, ఆ దేశం హార్మూజ్ జలసంధిని వెంటనే తెరిచేయాలని ఉవ్విళ్లూరుతోందని ఎద్దేవా చేశారు. జలసంధి పునరుద్ధరణ ప్రతిపాదనను అమెరికా స్పష్టంగా తిరస్కరించిన నేపథ్యంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు.

# పురుడు పోసుకున్న పాత పగ..!!

- వైసిపి పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు రాజారెడ్డి పై హత్యాయత్నం.
- మాస్కులు ధరించి వచ్చి, కళ్ళల్లో కారం చల్లి, రాళ్లతో తలపై దాడి చేసి పరార్.
- గంటల వ్యవధి లోనే పట్టుకున్న గోరంట్ల పోలీసులు..??
- ప్రాణాపాయ స్థితిలో బెంగళూరులో చికిత్సలు పొందుతున్న రాజారెడ్డి.

**గోరంట్ల సెప్టెంబర్ 27 ప్రభాతవార్త:** వ్యక్తిగత పాత కక్షలు పెట్టుకున్న కొందరు ఆ కక్షలును తీర్చుకోవాలనే ఉద్దేశంతో వ్యూహాత్మకంగా వ్యక్తిపై హత్యాయత్నం చేసిన సంఘటన తీవ్ర సంచలనంగా మారింది. ఇలాంటి సంఘటన గోరంట్ల పట్టణంలో ఆదివారం చోటుచేసుకుంది. ఈ సంఘటనలో గోరంట్ల మేజర్ పంచాయతీ ఉపసర్పంచ్, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షులు చిట్టిపి రాజారెడ్డి పై ఐదుగురు ముఠా దాడి చేసిన సంఘటన చోటుచేసుకుంది. అయితే దాడి చేసిన నిందితు లు జిల్లా సరిహద్దు దాటి పారిపోతుండగా వేకవంతంగా స్పందించిన గోరంట్ల పోలీసులు గంటల వ్యవధిలోనే శ్రీ సత్య సాయి జిల్లా సరిహద్దు కుక్కంటి క్రాస్ వద్ద నిందితులు కారులో పారిపోతుండగా వలపన్ని పట్టుకున్నట్లు సమాచారం. వివరాల్లోకెళితే సత్య సాయి జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షులు, గోరంట్ల మేజర్ పంచాయితీ తాజా మాజీ ఉపసర్పంచ్ రాజారెడ్డి పై దుండగులు హత్యాయత్నానికి పాల్పడ్డారు. రాజారెడ్డి పరిస్థితి విషమంగా ఉండడంతో ఆయన్ను హుటాహుటిన బెంగళూరు లోని హాస్టర్ ఆస్పత్రికి తరలించారు. వైసిపి నేత రాజారెడ్డి గోరంట్ల పట్టణ చివరలోని తన వ్యవసాయ పొలం వద్ద ఉండగా ఐదు మంది గుర్తు తెలియని వ్యక్తులు అక్కడికి వచ్చి ఒకసారిగా కలలో కారం చల్లి తీవ్రంగా దాడి చేయడంతో ఆయన తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. దీంతో హుటా హుటిన గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సల అనంతరం రాజారెడ్డిని బెంగళూరు తరలించారు. ఆస్పత్రికి చేరుకున్న స్థానిక ఎస్సై రామచంద్ర ఏఎస్ఐ వివరాలను నమోదు చేసుకు న్నారు. సంఘటన జరిగినప్పుడు ఆ ప్రాంతంలో మరో ఐదు మంది రాజారెడ్డి మిత్రులు ఉన్నప్ప టికీ వారికి సైతం కళ్ళ ల్లో కారం చల్లినట్లు తెలిపారు. ఈ సంఘటనపై వెంటనే స్పందించి న సీఐ బోయశేఖర్ నిందితుల కోసం వేట ప్రారంభించి గంటల వ్యవధిలోనే నిందితులను అదుపులోకి తీసుకోవడం విశేషం. నెల రోజులుగా గతంలో జరిగిన ఓ సంఘటనకు సంబంధించిన పాత పగ నెంబర్ వేసుకుంటూ వస్తున్నప్పటికీ సంబంధిత శాఖ అధికారులు పసి గట్ట లేకపోవ డంలో విఫలమయ్యారని విమర్శలు వినిపిస్తున్నాయి.

# సంతానోత్పత్తిని ప్రోత్సహించే దిశలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

- కు.ని శస్త్ర చికిత్సలకు ప్రోత్సాహకాలకు ఫుల్‌స్టాప్ పెట్టేలా ఎపి పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ 2026 నిర్ణయం
- రెండో, మూడో బిడ్డ జననాలను ప్రోత్సహించేలా పథకాల అమలు: యేటా రూ.1000కోట్లు

**విజయవాడ,సెప్టెంబరు 27,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ లో సంతోన్పత్తిని ప్రోత్సహించే దిశలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. తాజాగా ముగ్గురు ఆ పై పిల్లలున్న కుటుంబాలకు ప్రత్యేక ప్రోత్సాహకాలను ఇస్తుంది. ఆ క్రమంలో ఇప్పటి వరకు కుటుంబ నియంత్రణ చికిత్స చేయించుకునే వారికి ప్రోత్సాహకాలు తగ్గిస్తుంది. అత్యధికంగా ఆంధ్రప్రదేశ్ వివాహిత మహిళల్లో 69.5 శాతం మంది కుటుంబ నియంత్రణ(కు.ని) శస్త్రచికిత్సలు చేయించుకుంటున్నారు. ఇది దేశంలోనే అత్యధికగా శాతంగా మారింది. ఒకరు లేక, ఇద్దరు ఉండే చిన్న కుటుంబం చాలు అనే అభిప్రాయం ప్రజల్లో బలీయంగా ఉన్న పరిస్థితి, ఒక రకంగా రెండు దశాబ్దాలుగా అమలు చేసిన జనాభా నియంత్రణ విధానాలతో రాష్ట్రంలో జననాల రేటు పడిపోయింది. అంతేకాకుండా రాజకీయంగా కుడా ఇద్దరు కంటే ఎక్కువ పిల్లలు ఉన్న కుటుంబాల వారికి స్థానిక ఎన్నికల్లో పోటీకి అనర్హత ఉండేది. ఈ మధ్య ప్రభుత్వం ఈ నిబంధన రద్దు చేసింది. ఏపీ పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ 2026 ద్వారా సంతానోత్పత్తి విధానాలను ప్రోత్సహించి కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు 50 శాతానికి తగ్గడానికి కనీసం ఐదేళ్ల నుంచి పదేళ్లు పడుతుందని ప్రభుత్వం అంచనా వేస్తుంది అని ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి (ఈఏసీపీఎం) తెలిపింది. టెక్నికల్ గ్రూప్ ఆఫ్ పాపులేషన్ ప్రొజెక్షన్ నివేదిక ప్రకారం 2036 నాటికి ఏపీ జనాభాలో 14 సంవత్సరాల లోపు పిల్లల వాటా 16 శాతం కంటే తక్కువకు పడిపోతుందని, 60 ఏళ్ల పైబడిన వృద్ధుల వాటా 19 శాతం పెరగనుందని అంచనా వేసింది. ఈ క్రమంలోతక్కువ మంది పిల్లలను కనడం సాధారణంగా మారిన తర్వాత, తిరిగి సంతానోత్పత్తి రేటు పెంచడం కష్టమవుతుంది. సిక్కిం, ఆంధ్రప్రదేశ్ లాంటి రాష్ట్రాలు ఇప్పటికే ఇలాంటి పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. దేశంలో జనాభా నియంత్రణ ఆలోచనా విధానం, ప్రస్తుత మార్పులు, వివిధ రాష్ట్రాల్లో పరిస్థితిని తాజాగా విడుదల చేసిన ది ఘోస్ట్ ఆఫ్ పాపులేషన్ పాస్ట్ వర్కింగ్ పేపర్‌లో విశ్లేషించింది. ఇందులో ఆంధ్రప్రదేశ్ పరిస్థితినీ ప్రముఖంగా ప్రస్తావించింది. జనాభా స్థిరీకరణకు అవసరమైన భర్తీ స్థాయి (రీప్లేస్‌మెంట్ లెవెల్) 2.1గా ఉంది. దేశంలో సంతానోత్పత్తి రేటు (టీఎఫ్ఆర్) 1.9 ఉంది. కానీ ఆంధ్రప్రదేశ్‌ఇది 1.4 మాత్రమే. 2001 నుంచి ఈ తగ్గుదల నమోదవుతోంది. కర్ణాటక, తెలంగాణల్లో 1.5 చొప్పున, కేరళం, తమిళనాడు, పశ్చిమ బంగాల్‌లో 1.3 చొప్పున ఉంది. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం ఏపీలో 15 సంవత్సరాల నుంచి 49 సంవత్సరాల మహిళల్లో 69.5 శాతం మంది కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు (ట్యూబెక్టమీ) చేయించుకున్నారు. ఇది దేశంలోనే అత్యధికం. పురుషుల్లో వ్యాసెక్టమీ చేయించుకున్నవారు 0.8 శాతం మంది మాత్రమే ఉంది. అధిక సంతానోత్పత్తి రేటున్న యూపీ కంటే ఆంధ్రప్రదేశ్ లోనే ఎక్కువగా ఆపరేషన్లకు ప్రోత్సాహకాలు అందించారు. శాశ్వత కుటుంబ నియంత్రణ పద్ధతులకు ఏటా రూ.13.81 కోట్లు కేటాయించారు.




తాత్కాలిక పద్ధతులకు రూ.2. 99 కోట్లు మాత్రమే కేటాయించారు. జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కింద తాత్కాలిక పద్ధతుల కంటే, శాశ్వత శస్త్రచికిత్సలకే ఎక్కువ ప్రోత్సాహకాలు ఇవ్వడం వల్లనే ఆపరేషన్ల సంఖ్య ఏపీలో విపరీతంగా పెరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో జనాభా నియంత్రణ నుంచి నిర్వహణ దిశగా సర్కార్ అడుగులు వేస్తోంది. 202620- 27 ఆర్థిక ఏడాదిలో శాశ్వత కుటుంబ నియంత్రణ ఆపరేషన్లకు ఎలాంటి ప్రోత్సాహకాల బడ్జెట్‌ను కేటాయించలేదు. ఇకపై కు.ని. శస్త్రచి కిత్సల ప్రోత్సాహకాలు రద్దు చేసి, విరామ పద్ధ తులకు ప్రాధాన్యం ఇస్తున్నామని ఏపీ పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ 2026 పేర్కొంది. ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలున్నవారు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయకూడదనే ఆంక్షల చట్టాన్ని రద్దు చేసింది. రెండో, మూడో బిడ్డ జననాలను ప్రోత్సహించేలా పథకాలకు ఏటా సంవత్సరానికి రూ.వెయ్యి కోట్లు ఖర్చవుతోందని అంచనా వేసింది. సంతానోత్పత్తి వృద్ధి పెంచేందుకు ఇకపై ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటుంది.

# హైదరాబాద్ -విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారి హైవే విస్తరణ

- భూసేకరణ, నిర్మాణ వ్యయాలతో కలిపి రూ. 12,000 కోట్ల వ్యయం అంచనా!



**విజయవాడ,సెప్టెంబరు 27,ప్రభాతవార్తప్రతినిధి:** హైదరాబాద్- విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారి (ఎన్‌హెచ్ 65)ని ఆరు లేన్లుగా విస్తరించే ప్రాజెక్టుకు కీలకమైన ప్రతిపాదన అమలు చురుగ్గా కార్యచరణ జరుగుతుంది. నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా సమర్పించిన ప్రతిపాదనకు కేంద్ర ప్రభుత్వానికి చెందిన పబ్లిక్‌ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ అప్రైజల్ కమిటీ ఇటీవల ఆమోదం తెలిపింది. హైదరాబాద్ - విజయవాడ మధ్య 226 కి.మీ, విజయవాడ- మచిలీపట్నం మధ్య 58 కి.మీ కలిపి మొత్తం 284 కి.మీ విస్తరణ ప్రాజెక్టుకు సంబంధించి, గత నెలలోనే పబ్లిక్‌ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ అప్రైజల్ కమిటీ సమావేశం. గతంలో లేవనెత్తిన అభ్యంతరాలపై నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా అందించిన వివరణలను కమిటీ పరిశీలించింది. ఆ తర్వాత ప్రాజెక్టుకు కొత్తగా ఆమోదం తెలిపింది. భూసేకరణ, నిర్మాణ వ్యయాలతో కలిపి అంచనా వేసిన రూ. 12,000 కోట్ల వ్యయానికి ఆమోదం లభించిందని సమాచారం. ఈ ప్రాజెక్ట్ ఇప్పుడు ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీఖి సమర్పిస్తారు. భారీ ప్రాజెక్టులకు తుది ఆమోదం తెలిపే అధికారం ఈ కమిటీకి ఉంటుంది. ఆమోదం లభించిన తర్వాత, భూసేకరణ, టెండర్ల ఆహ్వానం (ప్యాకజీల వారీగా) ప్రక్రియలు ప్రారంభమవుతాయి.

అనంతరం ప్రధాన మంత్రి నేతృత్వంలోని ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోద అనంతర పరిణామాలు రోడ్డు నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపడుతున్నారు. హైదరాబాద్ శివార్లలోని మల్కాపూర్ నుంచి విజయవాడలోని గొల్లపూడి బైపాస్ వరకు ఉన్న 226 కి.మీ మార్గాన్ని నాలుగు లేన్ల నుంచి ఆరు లేన్లకు విస్తరిస్తారు. ఈ పనులు రెండు ప్యాకేజీలలో జరుగుతాయని నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు చెబుతున్నారు., ఒకటి హైదరాబాద్ నుంచి నందిగామ వరకు, మరొకటి నందిగామ నుంచి గొల్లపూడి వద్ద ఉన్న విజయవాడ బైపాస్ వరకు జరుగుతాయి ఈ విస్తరణ పనులు బిల్డ్ ఆపరేట్‌ట్రాన్స్‌ఫర్ (బిఓటీ)విధానంలో చేపట్టారు. విజయవాడ నుంచి మచిలీపట్నం వరకు రహదారి విస్తరణలో భాగంగా, కనూరు సిద్ధార్థ కళాశాల నుంచి దావులూరు టోల్ ప్లాజా దాటి అమరావతి ఔటర్ రింగ్ రోడ్ ను కలిసే ప్రాంతం వరకు ఉన్న 14 కి.మీ మార్గంలో, ప్రస్తుతం ఉన్న నాలుగు లేన్లకు ఇరువైపులా సర్వీస్ రోడ్లు నిర్మిస్తారు. ఔటర్ రింగ్ రోడ్ క్రాసింగ్ పాయింట్ నుంచి మచిలీపట్నం వరకు ఉన్న 44 కి.మీ రహదారిని ఆరు లేన్లకు విస్తరిస్తారు. ఈ ప్రాజెక్టు హైబ్రిడ్ యాన్యుటీ మోడల్‌ఖి కింద ఒకే ప్యాకేజీగా అమలు చేస్తారు.

# ఉత్తరాదిన భారీ వర్షాలు

- 14 రాష్ట్రాల్లో ఐఎండి హెచ్చరికలు....

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 27:** దేశంలోని పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కొనసాగుతున్నాయి. ఉత్తరప్రదేశ్, బీహార్, ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్ సహా పలు ప్రాంతాల్లో వర్షాల కారణంగా జనజీవనం ప్రభావితమవుతోంది. భారత వాతావరణ శాఖ తాజా అంచనాల ప్రకారం ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో గత రెండురోజులుగా భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తున్నాయి. భారీ వర్షాల నేపథ్యంలో ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, బీహార్, ఒడిశా, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, పంజాబ్, హర్యానా, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో వర్షాలు కొనసాగుతాయని ఐఎండి హెచ్చరించింది. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో చాలా భారీ వర్షాలకు అవకాశం ఉందని తెలిపింది. బీహార్, హర్యానా, ఢిల్లీ, హిమాచల్‌ప్రదేశ్, జార్ఖండ్, ఒడిశా, సబ్‌హిమాలయన్ పశ్చిమ బెంగాల్, సిక్కింలో కూడా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఉత్తరప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో వరుసగా వర్షాలు కురుస్తుండటంతో నీటిముంపు సమస్యలు తలెత్తుతున్నాయి. రాష్ట్రంలోని తూర్పు, పశ్చిమ ప్రాంతాలకు ఐఎండి భారీ వర్షాల హెచ్చరికలు జారీ చేసింది. ఆదివారం తూర్పు యూపీలో భారీ వర్షాలు, పశ్చిమ యూపీలో చాలా భారీ వర్షాలు కురిసాయి. సోమవారం నుంచి పరిస్థితి మెరుగుపడే అవకాశం ఉంది. లక్నో సహా పలు నగరాల్లో భారీ వర్షాల కారణంగా రోడ్లపై నీరు నిలిచింది. కొన్ని ప్రాంతాల్లో చెట్లు, నిర్మాణాలు దెబ్బతిన్న ఘటనలు కూడా చోటుచేసుకున్నాయి. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో కాన్పూర్‌లోని పలు ప్రాంతాల్లో నీటిముంపు ఏర్పడింది. గోరఖ్‌పూర్‌లో కూడా భారీ వర్షాలతో రోడ్లు, మార్కెట్లు జలమయమయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో ఇళ్లలోకి, దుకాణాల్లోకి వర్షపు నీరు చేరినట్లు సమాచారం. ఉన్నావ్ ప్రాంతంలోని గంగా ఎక్స్‌ప్రెస్‌వేపై కూడా నీరు నిలవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రహదారులపై నీటిమట్టం పెరగడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

# వేధింపులు సహించొద్దు..



జీవితంలో ఒక దశలో వేధింపులు ఏదో ఎదుర్కొన్న అమ్మాయి ల శాతం ఎక్కువ అయితే, వీటిని తేలిగ్గా తీసుకోవద్దంటున్నారు పరిశోధకులు. ఎందుకంటే.. వీటివల్ల దీర్ఘకాలంలో మహిళల్లో హృద్రోగాలు వచ్చే ముప్పు అధికమని హార్వర్డ్ యూనివర్సిటీ తాజా పరిశోధనలు చెబుతు న్నాయి. 60 వేలమందికి పైగా మహిళలపై అధ్యయనం చేశారు. వీటి ప్రకారం... వేధింపులు ఎదుర్కోని వారితో ప్రస్తుతం ఎదుర్కొన్న మహిళల్లో గుండెపోటు పక్షవాతం... వచ్చే ప్రమాదం 41 శాతం ఎక్కువ. ఇక, అది చేయొద్దు, ఇది చేయొద్దు. అలా ఉండాలి... ఇలా ఉండాలి.... అంటూ తరచూ ఎదుర్కొన్న వారిలో అయితే ఈ ప్రమాదం 70శాతానికి ఎగబాకింది. గృహహింస, ఆర్థిక ఇబ్బందులు... వంటి వాటివల్ల కలిగే ఒత్తిడి, భయాందోళనలు మన ఆరోగ్యానికి ఎంత హాని చేస్తాయో ఇవి అంతకంటే ఎక్కువ నష్టాన్ని కలిగిస్తాయి. గతంలో జరిగిన ఈ ఘటనలు పదే పదే గుర్తుకురావటం, అప్పుడూ ఇవే భయాందోళనలు, ఒత్తిళ్లను ఫీలవటం వల్ల మానసిక సమస్యలతోపాటు శారీరక ఆరోగ్యంపైనా ప్రతికూల ప్రభావం పడుతుంది. కాబట్టి, ఈ వేధింపులు కేవలం న్యాయపరమైనవో లేదా రక్షణకు సంబంధించినవో కాదనీ ఆరోగ్యానికి సంబంధించిన కీలకమైన విషయమని నిపుణులు సూచిస్తున్నారు. అవసరమైతే కుటుంబం, స్నేహితులు, నిపుణుల సాయం వెంటనే తీసుకోవాలనీ, సూచిస్తున్నారు. □

# లావొక్కంతయు కాదు !

అమ్మాయిల రజస్వల వయసు అంటే టీనేజీ ప్రారంభం. కానీ కొన్నేళ్లుగా ఈ వయసు తగ్గుతోంది. పదేళ్లలోపు చిన్నారుల్లోనూ నెలసరి మొదలవుతున్న పరిస్థితి. అయితే ప్రాచుర్యంలో ఉన్నట్టు దీనిక అధిక బరువుఒక్కటే కారణం కాదనీ, అంతకు మించి ఉన్నా యంటున్నారు పరిశోధకులు.



స్థూలకాయం, అధిక బరువు కారణంగా అమ్మాయిల్లో రజస్వల వయసు తగ్గుతోందని నమ్ముతూ వస్తున్నారు పరిశోధకులు. అది వాస్తవమేనని చెబుతూనే..దీని వెనక మరెన్నో కారణాలు ఉన్నాయంటున్నాయి. తాజా పరిశోధనలు. హార్మోన్లపైన నేరుగా ప్రభావం చూపే రసాయనాలు వాతావరణం లో పెరగడం, చక్కెర నిల్వలు ఎక్కువగా ఉండే పానీయాలు తీసుకోవ డం, బాల్యంలో ప్రతికూల అనుభవాలు ఎదురవ్వడం, ఒత్తిడి..ఇవన్నీ కారణాలు కావొచ్చని తాజా లాన్సెట్ మెడికల్ జర్నల్‌లో తెలిపారు హార్వర్డ్- ఎన్విరాన్మెంటల్ హెల్త్ విభాగం పరిశోధకులు. ఈ కోణాల్లో పరిశోధిస్తే రజస్వల ప్రక్రియను ఆలస్యం చేయొచ్చు లేదంటే నెమ్మది కావచ్చొంటున్నారు. ఒత్తిడి, గ్రంథుల వ్యవస్థను ధ్వంసం చేసే రసాయనాలతో పాటు మరికొన్ని గణించలేని అధ్యయనం చేయని అంశాలూ ఉన్నాయని కొలంబియా యూనివర్సిటీ పరిశోధకులు చెబుతున్నారు. ఆహారపుటలవాట్లలో మార్పులు, శారీరక శ్రమని తగ్గించే పరిసరాలు, ఒత్తిడిని పెంచే సోషల్ మీడియా, రంగుని దృష్టిలో పెట్టుకుని వచ్చే క్రీముల్లో ఉండే హానికర రసాయనాలు.. ఇవన్నీ అందుకు కారణాలుగా నిలుస్తున్నాయనేది వీరు చెప్పే మాట. □

# సమస్యను పరిష్కరిద్దాం !

మీ పిల్లలు ఇంటి పనుల్లో మీకు సాయ పడతారా? అని ఎవరైనా అంటే కొందరికి చిర్రెత్తు కొస్తుంది. మా వాళ్లకి ఆ అవసరం లేకుండా చేస్తున్నాం అంటూ గొప్పగా చెబుతారు. కానీ, దీనివల్ల కష్టించే తీరునీ, కలుపు గోలుతనాన్నీ, సామాజిక చొరవనీ వారికి దూరం చేస్తున్నారని తెలుసా అని ప్రశ్నిస్తున్నారు నిపుణులు... ఏ తల్లిదండ్రులైనా తాము పడిన కష్టం తమ పిల్లలు పడకూడదను కోవడం సహజమే. అలాగని వాళ్లకు కష్టం తెలియకుండా చేయడం వల్ల వారి భవిష్యత్తుని ప్రమాదంలో పడేస్తున్నారని గ్రహించాలి. దీనివల్ల నిజంగా వారికి ఏదైనా సమస్య వచ్చినప్పుడు పరిష్కరించుకునే విధానం తెలియక కంగుబాటుకు గురవుతారు. అందుకే, తమ పనులు తాము చేసుకోవడం, ఇతరులకు సాయం చేయడం వంటివి జీవనశైలిలో భాగం చేయాలి. ఇంటి పనుల్లో సాయం చేయడం అంటే.. వారికి బాధ్యత అలవాటు చేయడం,వారి వయసుకి, శారీరక సామర్థ్యానికి తగ్గట్లు తమ గదిని శుభ్రంచేసు కోవడం, మొక్క లకు నీళ్ల పోయ డం, దుకాణానికి వెళ్లడం, కడిగగిన గిన్నెలు సర్దడం వంటివన్నీ ఈ తరహానే. . ఏ ఫలితం కూడా ఊరకనే



రాదు. పెద్దలుగా మీకు ఆ విషయం తెలిసి ఉండొచ్చు. పిల్లలకీ నేర్పించండి. వాళ్లు కోరుకున్నవీ, లేనివీ మీరు మీ స్థాయికి తగ్గట్లు తెచ్చివ్వడం గొప్ప విషయమే అయినా వాటి విలువా వారికి తెలియాలి. ఏదైనా సంపాదించాలంటే బోలెడంత శ్రమిస్తేనే కానీ సాధ్యంకాదనే విషయాని ఆచారణలో చూపించాలి. అప్పుడే జీవితంలో కష్టసుఖాలను అర్థం చేసుకుని అడుగులు వేస్తారు. పిల్లలకి ఎంత సేపూ నాది అనేభావనే కాదు.చుట్టూ ఉన్న ప్రపంచంతోనూ సంబంధాలు ఏర్పరచండి. ఆపదలో ఉన్నవారికి సాయం చేయడం, తోటివారితో వస్తువుల్నీ, పుస్తకాల్నీ పంచుకోవడం, స్నేహితులతో కష్టసుఖాలను షేర్ చేసుకోవడం వంటివన్నీ వారికి సామాజిక చొరవను అలవరుస్తాయి. □

# ఓం నమః శివాయ



.. శివలింగ దర్శనం .. శివా భిషేకం అనేక జన్మల పాపాలను పటా పంచలు చేస్తాయి. అందు వలన చాలా మంది తమ పూజా మందిరాల్లో చిన్నపాటి శివలింగాలను ఏర్పాటు చేసుకుని అనునిత్యం అభిషేకం చేస్తూ వుంటారు. కొంతమంది బంగారపు శివలింగాన్ని .. మరికొందరు వెండి శివలింగాన్ని .. ఇంకొందరు ఇత్తడి శివలింగాన్ని తయారు చేయించుకుని ఆరాధిస్తూ వుంటారు.ఒక్కో విధమైన శివలింగాన్ని పూజించడం వలన, ఒక్కో విశేషమైన ఫలితం లభిస్తుందని ఆధ్యాత్మిక గ్రంథాలు చెబుతున్నాయి. ఇక కొంతమంది స్ఫటిక శివలింగం సంపాదించుకుని తమ పూజా మందిరంలో ఏర్పాటు చేసుకుంటూ వుంటారు.స్ఫటిక లింగాన్ని ఆరాధిం చడం వలన దారిద్ర్యం తొలగి పోతుంది. స్ఫటిక శివలింగాన్ని పూజించడం వలన, సిరిసంపదలు చేకూరతాయి. సౌభాగ్య సిద్ధి కలగడమే కాకుండా, సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుంది. మనసులోని ధర్మబద్ధమైన కోరికలునెర వేరతాయి. □

# పాస్తా రుచిగా..



పాస్తా ఒకటిన్నర కప్పు, చిన్నగా తరిగిన అల్లం, వెల్లుల్లి ముక్కలు అర టీస్పూన్ చొప్పున, సన్నగా తరిగిన ఉల్లిపాయలు, పచ్చిమిర్చిరెండు చొప్పున, క్యారెట్, క్యాప్సికం ముక్కలుటేబుల్స్పూన్ చొప్పున, ఉప్పు రుచికి సరిపడా, చిన్నగా తరిగిన టొమాటోలు రెండు, మిరియాలపొడిపావు టీస్పూన్‌పావు, అర టీస్పూన్ చొప్పున, చొప్పున, టొమాటోసాస్ టేబుల్స్పూన్, రెడ్ చిల్లీసాస్ టీస్పూన్, కొత్తమీర తురుము గుప్పెడు.

**తయారీ విధానం:** గిన్నెలోకి ఐదు కప్పుల నీళ్లు తీసుకుని వేడిచేయాలి. కొద్దిగా ఉప్పు, కాస్త నూనె వేయాలి. ఇలా వేయడం వల్ల పాస్తా అతుక్కోకుండా పొడిపొడిగా ఉంటుంది. నీళ్లు మరుగుతున్నప్పుడు గోధుమ పాస్తా వేసి మెత్తగా ఉడికించాలి. నీళ్లు లేకుండా వడకట్టుకుని ప్లేటులో వేసుకోవాలి. కడాయిలో నూనె పోసి అల్లం, వెల్లుల్లి తరుగు, తర్వాత, పచ్చిమిర్చి ముక్కలు, క్యారెట్, క్యాప్సికం, టొమాటో ముక్కలు వేసుకుని వేయించాలి. మూడు వంతులు వేగిన తర్వాత మిరియాలపొడి, కారం, గరం మసాలా, ధనియాల పొడులను వేయాలి.. తర్వాత టొమాటో సాస్, రెడ్ చిల్లీసాస్, తగినంత ఉప్పు కలపాలి. తక్కువ మంట మీద మరికాసేపు వేయించి పాస్తా వేయాలి. ఇప్పుడు మంట పెంచి పాస్తాను కలుపుతూ ఉడికించాలి. చివరగా కొత్తిమీర తురుము చల్లి దించేస్తే వేడివేడి మసాలా పాస్తా సిద్ధం. □

# చెద, చెడు వాసన రాకుండా!

కాలం ఏదైనా వార్డ్‌రోబ్‌లను ఎప్పుడూ మూసే ఉంచినా, వాతావరణంలో కాస్త తేమ ఎక్కువైనా.. వాసన వస్తాయి. ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా చెదలూ, పురుగులూ ఇబ్బంది. ఎడతాయి. ఇలాంటప్పుడు దుస్తులు పాడవకుండా సమస్య దూరవ్వాలంటే..



బీరువాలో దుస్తుల్ని నెలల తరబడి మడత తీయకుండా వదిలేయకండి. అప్పుడప్పుడూ ఎండలో ఆరేయాలి. మడతల్లో చిన్న దేవదారు ముక్కల్ని ఉంచాలి. లేదంటే పచ్చ కర్పూరాన్ని వస్త్రంలో చుట్టి పెట్టొచ్చు. ఈ వాసన చెద పురుగులకు నచ్చదు.

వార్డ్‌రోబ్‌లో ఏమైనా క్రాక్స్, గ్యాప్స్ ఉంటే వాటిని సీల్ చేయండి. దుమ్మూ, ధూళిని ఎప్పటికప్పుడు వాక్యూమ్ చేస్తే సరి. వేప ఆకులు లవంగాలు.. ఇవి అన్నీ చెదల నివారణకు సాయపడతాయి. వాటి దుర్వాసనతో పాటూ తేమ కూడా పోవాలంటే.. లవంగాల పొడి, బొగ్గు, బేకింగ్ సోడా లోపల ఉంచండి. చెమట, నూనె, ఆహార మరకలు ఉన్న దుస్తులను పూర్తిగా శుభ్రం చేశాకే బీరువాల పెట్టండి. లేదటే ఇవి సిల్వర్‌ఫిష్, ఇతర పురుగులను ఆకర్షస్తాయి. అలానే బీరువాల్లో కార్డ్‌బోర్డు బాక్సులను నిల్వ చేయొద్దు. ఎప్పుడో ఒకసారి ధరించే దుస్తుల్ని వాక్యూమ్ సీల్డ్ చేసి బ్యాగుల్లో పెట్టండి. దుస్తుల వరుసల మధ్య ఖాళీ ఉండనివ్వండి. పిప్పర్‌మెంట్, యూకలిప్టస్ వంటి ఎసెన్షియల్ ఆయిల్స్‌లో ముంచి తీసిన కాటన్ బాల్స్‌ని లోపల పెడితే పురుగులు రావు. □

# కాసు మూవీ గ్లింప్స్ లాంఛ్ ఈవెంట్



**యంగ్** టాలెంటెడ్ హీరో శ్రీ నందు నటిస్తున్న కొత్త సినిమా కాసు. ఈ చిత్రంలో ఇందుకుమార్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమాను ఎ.కె.ఆర్. డ్రీమ్ పిక్చర్స్ ఎల్ఎల్ పీ బ్యానర్‌పై ఇందు కుమార్, నరేంద్ర కొండ నిర్మిస్తున్నారు. పి.ఎస్. హార్షవర్ధన్ దర్శకత్వం వహిస్తున్నారు. తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడ, హిందీలో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. స్టార్ ప్రొడ్యూసర్ ఏఎం రత్నం అతిథిగా శనివారం సాయంత్రం హైదరాబాద్‌లో కాసు సినిమా గ్లింప్స్ లాంఛ్ ఈవెంట్ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రొడ్యూసర్ నరేంద్ర కొండ మాట్లాడుతూ ఈ చిత్రంలో ఒక బ్యూటిఫుల్ లవ్ స్టోరీ చూపిస్తున్నాం. ప్రేమలో ఉన్న ఒక జంట మధ్య డబ్బు విషయంలో దురాశ అనేది మొదలైతే ఆ రిలేషన్ కు, వారి ప్రేమకు ఎలాంటి ఇబ్బందులు వస్తాయి అనేది మా మూవీలో ఆద్యంతం ఆసక్తికరంగా తెరకెక్కించారు మా డైరెక్టర్ హార్షవర్ధన్. డైరెక్టర్ పి.ఎస్.హార్షవర్ధన్ మాట్లాడుతూ ఈ రోజు మా మూవీ ఈవెంట్ కు అతిథిగా వచ్చిన ఎంఎం రత్నం గారికి థ్యాంక్స్. ఆయనకు నేను పెద్ద అభిమానిని. మా ప్రొడ్యూసర్స్ నరేంద్ర గారు, ఇందు గారి సపోర్ట్ తో ఈ సినిమా చేస్తున్నాం.హీరోయిన్, ప్రొడ్యూసర్ ఇందుకుమార్ మాట్లాడుతూ మా కాసు మూవీ ఎలా ఉంటుంది, మీ కాసులకు ఎంత న్యాయం చేస్తుంది అనేది ముందు ముందు తెలుసుకుంటారు. ఒక పల్లెటూరి నుంచి వచ్చిన అమ్మాయిని నేను. సొసైటీ గురించి ఏమీ తెలియదు. యాంకరింగ్ తో మొదలుపెట్టి ఈ రోజు నిర్మాతగా, హీరో యిన్‌గా మీ ముందుకు వస్తున్నా. నేను ఏది చేసినా సంతోషించేది మా నాన్నగారు. హీరో శ్రీ నందు మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి ఈ చిత్రంలో జై అనే క్యారెక్టర్ ఇచ్చినందుకు మా డైరెక్టర్ హార్షవర్ధన్ కు థ్యాంక్స్ చెబుతున్నా. కాసు లాంటి ప్రపంచంలో నన్ను జై గా చూసినందుకు హ్యాపీగా ఉంది. దండోర, సైక్ సిద్ధార్థ్ తర్వాత నేను చేస్తున్న చిత్రమిది.

# ప్యారడైజ్ రెస్పాన్స్ ఒక తుఫాన్‌లా వచ్చింది:నాని



**మీ**డియా ములాఖాత్‌లో కలెక్షన్ కింగ్ మోహన్ బాబు మాట్లాడుతూ... అందరికీ హృదయ పూర్వక వందనాలు, ఆశీస్సులు. సుధాకర్‌గా రు ఎక్కడా కూడా డబ్బుకి వెనకాడకుండా ఈ సినిమా చేశారు. ఆ భగవంతుడు ఆయనకు విజయాన్ని ఇచ్చాడు. దర్శకుడిపై భారం వేసి, సినిమాను నిర్మించిన వాళ్లలో ఒకరిద్దరినే చూశా. మా గురువుగారు దాసరి గారు పై కూ డా ఇలాగే నిర్మాతలు నమ్మకం పెట్టుకునేవారు. ఇప్పుడు శ్రీకాంత్‌పై సుధాకర్ చెరుకూరి అదే నమ్మకం ఉంచారు. నేచురల్ స్టార్ నాని మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఈ సినిమా విషయంలో అన్ని కొత్తగానే జరిగాయి. ఫిలిం మేకింగ్, లొకేషన్స్ లో సిచువేషన్, ట్రైలర్ లేకపోవడం, రిలీజ్ ముందు ఉండే సిచువేషన్.. ఇవన్నీ కొత్తగా ఉన్నాయి. ఒక కొత్త సినిమా చేస్తున్నాం, ఒక కొత్త ఎక్స్‌పీరియన్స్ ఇస్తున్నాం అనుకున్నాం. కానీ ఇలా రెస్పాన్స్ కూడా ఇంత కొత్తగా ఉంటుందని అనుకోలేదు. ఇది నాకు చాలా కొత్త ఎక్స్‌పీరియన్స్. నేను ఎన్నో సినిమాలు చేశాను. ఈ మధ్యకాలంలో సినిమాలు రిలీజ్ అయిన ఉదయం చాలా పాజిటివ్ రెస్పాన్స్ ఉంటుంది. సాయంత్రానికి మిక్స్‌డ్ రెస్పాన్స్‌గా మారిపోతుందిడైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల మాట్లాడుతూ. అందరికీ నమస్కారం. సినిమాని హిట్ చేసినందుకు అందరికీ థాంక్యూ. ముందుగా జూనియర్ ఆర్టిస్టులందరికీ థాంక్యూ. ఈ సినిమా కోసం బురదలో, వర్షంలో చాలా కష్టపడ్డారు. సమ్మక్క క్యారెక్టర్‌ని సోనాలి గారు కాకపోతే ఇంకెవరు చేసినా ఇంత బాగా వచ్చేది కాదు. ఆ పాత్రని అద్భుతంగా చేశారు. సంపూ బిర్యానీ క్యారెక్టర్‌ని చాలా అద్భుతంగా చేశారు. మా హీరోయిన్ కయాదుకు థాంక్యూ. అది చాలా ఛాలెంజింగ్ క్యారెక్టర్. తను ఆ ఛాలెంజ్‌ని తీసుకుని చేసింది. ప్రియదర్శి శంకరన్న పాత్రని చాలా చక్కగా చేశాడు.

# గాంధీ జయంతి రోజు ప్రేమనే ఊరిలో



మహారత్న ప్రొడక్షన్స్, ఎస్కే పిక్చర్స్, వనిల్లా ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్లపై చందు శ్రీనివాస్, సురేష్ కొండేటి, మమత దేవేంద్ర ఎం సం యుక్తంగా నిర్మించిన చిత్రం'ప్రేమనే ఊరిల్లో. ఈ సినిమాకి మనోజ్ కుమార్ కథ, కథనం, దర్శకత్వం వహించారు. శ్రీరామ్, రమిక శివు, తపస్విని పూనాచ, రంగాయణ రఘు తదితరులు కీలక పాత్రల్లో నటించారు. రేబిసీ, కాంతారా వంటి చిత్రాలకు డైలాగ్స్ అందిం చిన హనుమాన్ చౌదరి ఈ చిత్రానికి సంభాషణలు రాయగా ప్రముఖ గేయ రచయిత రాంబాబు గోసాల పాటలను రచించారు. సునద్ గౌతమ్ సంగీతం అందిస్తుండగా, రాజ్‌కాంత్ ఎస్.కె సినిమాటోగ్రఫీ, హర్షిత్ ప్రభు ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహించారు. సెప్టెంబర్ 25న కన్నడలో విడుదలైన ఈ చిత్రానికి అనూహ్య స్పందన లభించగా గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2వ తేదీన తెలుగులో విడుదలకు సిద్ధమవుతుంది. కర్ణాటకలో హౌస్ ఫుల్ అవుతున్న ఈ ప్రేమ కథ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులు కూడా అదేవిధంగా ఆదరిస్తారని మేకర్స్ చెబుతున్నారు.

# తెర

# డోంట్ ట్రబుల్ ది ట్రబుల్‌లో అన్ని ఎలిమెంట్స్ ఉంటాయి

**: ఫహాద్ ఫాజిల్**



ఫహాద్ ఫాజిల్ హీరోగా ఆర్కా మీడియా వర్క్స్, షోయింగ్ బిజినెస్ బ్యానర్ల మీద శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని, ఎస్ఎస్ కార్తికేయ నిర్మించిన చిత్రం డోంట్ ట్రబుల్ ది ట్రబుల్. శశాంక్ ఏలేటి దర్శకుడు. అక్టోబర్ 2న మూవీ రిలీజ్ అవుతుంది. ఈ క్రమంలో శనివారం ఫహాద్ ఫాజిల్ మీడియాతో ముచ్చటించారు. సినిమా గురించి ఆయన చెప్పిన విశేషాలివే..

**డోంట్ ట్రబుల్ ది ట్రబుల్ సినిమా చేయటానికి కారణమేంటి?**

కార్తికేయ నాకు ఫోన్ చేసిన'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్ట్ కథ గురించి చెప్పారు. శశాంక్ వచ్చి కథ చెప్పారు. నా జీవితంలో అసలు ఇలాంటి ఓ కథను వినలేదు. విన్న వెంటనే నాకు చాలా నచ్చింది. ఈ సినిమాని ఎలా అయినా సరే చేయాలని ఫిక్స్ అయ్యాను.

**సినిమాలో మ్యాజిక్ అనేది కీలకంగా ఉంటుందా?**

'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్ట్ అనే చిత్రంలో ప్రేమ, ఆప్యాయత, అనుబంధం వంటి చాలా ఎలిమెంట్స్ ఉంటాయి. మ్యాజిక్ అనే పార్ట్ ఒక అంశం మాత్రమే. ఈ సినిమాలో లోతైన అంశాలు, భావోద్వేగాలెన్నో ఉన్నాయి.

**'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్ట్ సినిమా చేసే క్రమంలో ఎలాంటి ఛాలెంజెస్ ఫేస్ చేశారు?**

మలయాళంలో కథను అర్థం చేసుకుని, డైలాగ్స్ నేర్చుకుని.. ఇంగ్లీష్‌లోకి మార్చుకుని.. తెలుగులో నటించడం నాకు ఛాలెంజింగ్‌గా అనిపించింది. కాస్త కష్టంగానే అనిపించినా ఈ జర్నీ నాకు ఎంతో నచ్చింది.

**సినిమాను చాలా వరకు రియల్ లొకేషన్స్‌లో షూట్ చేయటం ఎలా అనిపించింది?**

నాకు రియల్ లొకేషన్‌లో షూటింగ్ చేయడం అంటేనే ఇష్టం. కానీ'పుష్ప సినిమాకి మాత్రం అలా చేయడం కుదరలేదు. ఈ సినిమాని చాలా వరకు రియల్ లొకేషన్స్‌లోనే షూట్ చేశాం.

**విభిన్నమైన సినిమాల్లో నటిస్తుంటారు.. రైటర్స్‌కు ఉన్న ఇంపార్టెన్స్ గురించి చెప్పండి?**

ఆర్టిస్టుల కంటే రచయిత, దర్శకులకే ఎక్కువ ఇంపార్టెన్స్ ఇవ్వాలన్నది నా అభిప్రాయం. శశాంక్ ఈ మూవీకి రైటర్, డైరెక్టర్. కథ బాగుంటేనే సినిమా బాగుంటుంది. తెలుగు ఇండస్ట్రీ వల్లే మన సినిమా ప్రపంచ స్థాయికి వెళ్లింది.

**చిన్నపాప సారాతో నటించటం ఎలా అనిపించింది?**

సారా అద్భుతమైన నటి. కెమెరా ముందు ఎంతో ఆర్గానిక్‌గా నటిస్తుంది. పేపర్ మీదున్న దాని కంటే ఎక్కువగా ఇంప్రవైజ్ చేస్తుంది. ఎంతో యాక్టివ్‌గా, ఎనర్జిటిక్‌గా యాక్ట్ చేసింది.

**డోంట్ ట్రబుల్ ది ట్రబుల్ట్‌లో మీ పాత్ర ఎలా ఉండబోతుంది?**

నేను చేసే ప్రతీ పనిలో నా బెస్ట్ ఇవ్వాలని, నా వర్క్ పట్ల నేను నిజాయతీగా ఉండాలని అనుకుంటాను. ఇందులోని నా పాత్ర అద్భుతంగా ఉంటుంది. నా కారెక్టర్‌లోని జర్నీ కొత్తగా ఉంటుంది.

**తెలుగు మాట్లాడటం నేర్చుకున్నారా?**

నేను గత ఏడాదిన్నరగా ఇక్కడే ఉంటున్నాను. ఎంతో మంది ఫ్రెండ్స్ అయ్యారు. తెలుగు కొంచెం కొంచెం వచ్చింది. నెక్స్ట్ టైం పూర్తిగా మాట్లాడతాను.

**కాలభైరవ సంగీతం గురించి చెప్పండి?**

కాల భైరవ సంగీతం సినిమాకి ప్రాణం పోసింది. ఆయన మ్యూజిక్ ఈ మూవీలో ఒక కారెక్టర్‌లా ఉంటుంది. ఆయన బీజీఎం యాడ్ అయ్యాక సినిమా నెక్స్ట్ లెవెల్‌లో అనిపించింది.

# సిటీ ఆఫ్ గోల్డ్ ఫస్ట్ లుక్



**మోస్ట్** ట్యాలెంటెడ్ విక్రమ్ ప్రభు 26వ చిత్రం ఖసిటీ ఆఫ్ గోల్డ్‌ఖి. ఈ చిత్రానికి సిద్ధార్థ్ దర్శకత్వం వహించారు. విక్రమ్ ప్రభు సరసన శివత్మిక రాజశేఖర్ కథానాయికగా నటిస్తుండగా, ఇంటర్నెట్ సం చలనం అమలా షాజీ ముఖ్య పా త్రలలో కనిపిస్తున్నారు. ఫస్ట్ లుక్‌లో విక్రమ్ ప్రభు ఎంతో ఇంటెన్స్ లుక్‌తో కూర్చు ని.. చాలా క్యాజువల్‌గా బంగారు కడ్డీలను పైకి విసురుతూ పట్టుకుంటూ కనిపిం చారు. గ్లింప్స్ ప్రేక్షకులను మరింత ఆసక్తికరమైన ప్రపంచంలోకి తీసుకెళ్తుంది. బంగా రం మార్కెట్, అక్కడ పనిచేసే వ్యక్తులు, సామాన్య ప్రజలకు పెద్దగా తెలియని ఒక రహస్య వ్యవస్థను ఇందులో చూపించారు. ఆకట్టుకునే విజువల్స్ ద్వారా సినిమా నేప థ్యాన్ని, పాత్రలను పరిచయం చేయడం క్యూరియాసిటీ పెంచింది. విక్రమ్ ప్రభు ఇందులో ఇంటెన్స్ రోల్‌లో కనిపించనున్నారు.అలగం పెరుమాళ్, జాఫర్ ఇడుక్కి, జీఎం సుందర్, వసుంధర, సునీల్ సుగత, జయకుమార్, మోరిష్ దాస్, బా ల హాసన్, లిజ్జీ ఆంటోనీ తదితరులు ఇందులో కీలక పాత్రలు పోషిస్తున్నారు.సినిమాటోగ్రాఫర్ కార్తీక్ శరాజ్ ఈ డార్క్ అండ్ మిస్టీరియస్ ప్రపంచాన్ని అద్భుతమైన విజువల్స్‌తో ఆవిష్కరించారు. యువన్ శంకర్ రాజా సంగీతం సినిమాకు మరింత డెప్త్‌ను తీసుకొచ్చింది.

# రావణుడిగా యష్ పవర్‌ఫుల్ పోస్టర్స్



నమిత్ మల్హోత్రా ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్, 8 సార్లు ఆస్కార్ అవార్డు గెలుచుకున్న దీవినిబి, యశ్‌కు చెందిన మాన్స్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న 'రామాయణంẖలో రణ్‌బీర్ కపూర్, సాయి పల్లవి, యశ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. నితీష్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న నమిత్ మల్హోత్రా 'రామాయణ్ẖ ఈ ఏడాది అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాల్లో ఒకటి. తాజాగా రాకింగ్ స్టార్ యశ్ రావణుడిగా నటిస్తున్న ఫస్ట్ అఫీషియల్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఇందులో ఆయన పోషిస్తున్న లార్జర్ ద్యాన్ లైఫ్ రావణుడి అవతార్‌ను పవర్‌ఫుల్‌గా చూపించారు. ఇంటెన్సిటీ, పవర్‌ఫుల్ ఆరాతో ఆకట్టుకున్న యశ్.. ఈ ఐకానిక్ పాత్రపై మరింత ఆసక్తిని పెంచుతున్నారు. తాజాగా విడుదలైన పోస్టర్‌లో యశ్ తన పవర్‌ఫుల్ లుక్‌తో ఫ్రేమ్‌ను డామినేట్ చేస్తున్నారు. విలువైన రత్నాలతో అలంకరించిన మెరిసే బంగారు కిరీటం, పొరలుగా ఉన్న ముత్యాల హారాలు, భారీ బంగారు కంకణాలతో యశ్ కనిపిస్తున్నారు. ఇంటెన్స్ చూపు, ఇంపోజింగ్ ప్రెజెన్స్‌తో రావణుడి పాత్రకు కావాల్సిన రాజసం, గంభీరతను తీసుకొచ్చారు. దీనితో పాటు శ్రీరాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతాదేవిగా సాయి పల్లవి, లక్ష్మణుడిగా రవి దూబేను పరిచయం చేస్తూ మరో కొత్త పోస్టర్‌ను కూడా మేకర్స్ విడుదల చేశారు. వనవాస కాలంలో అడవిలో శ్రీరాముడు, సీతాదేవి, లక్ష్మణుడు కలిసి సాగిస్తున్న ప్రయాణాన్ని ప్రతిబింబించేలా రూపొందించిన ఈ పోస్టర్ ఎంతో ఆకట్టుకుంటోంది.



# నేడు భారత్‌తో అఫ్ఘాన్ ఢీ

## వర్షం దెబ్బకు క్వార్టర్ ఫైనల్ టీమ్స్ మార్పులు

**న్యూఢిల్లీ:** ఆసియా గేమ్స్ 2026లో భారత్ ప్రత్యర్థి ఎవరో తేలిపోయింది. నేరుగా క్వార్టర్ ఫైనల్స్‌లో ప్రవేశించిన శ్రేయాస్ అయ్యర్ నేతృత్వంలోని టీమిండియాతో అఫ్ఘానిస్థాన్ తలపడనుంది. ఈ హైవోల్టేజ్ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ ఈ నెల 28న జపాన్‌లోని లోని కొరోగి స్పోర్ట్స్ పార్క్‌లో ఉదయం 10.30 గంటలకు జరగనుంది. ఇరు జట్లూ నువ్వా నేనా అన్నట్టు తలపడటానికి సిద్ధమవుతుండటంతో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఇక వర్షం పుణ్యమా అని అఫ్ఘనిస్థాన్ క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించింది. జపాన్, నేపాల్ మధ్య శనివారం జరగాల్సిన గ్రూప్ ఏ చివరి లీగ్ మ్యాచ్ వర్షం కారణంగా ఒక్క బంతి కూడా పడకుండానే రద్దయింది. దీంతో అంపైర్లు రెండు జట్లకు చెరో పాయింట్ కేటాయించారు. అంతకుముందు అఫ్ఘానిస్థాన్ చేతిలో ఓడిపోయిన జపాన్ ఈ మ్యాచ్ కూడా రద్దు కావడంతో కేవలం ఒకే ఒక్క పాయింట్‌తో టోర్నమెంట్ నుంచి నిష్క్రమించాల్సి వచ్చింది. మరోవైపు నేపాల్‌మూడు పాయింట్లతో గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచింది. వర్షం అంతరాయం కారణంగా ఈ మ్యాచ్‌ను 15 ఓవర్లకు కుదించగా, నేపాల్ 4 వికెట్లకు 149 పరుగులు చేసింది. జపాన్, నేపాల్ మధ్య మ్యాచ్ రద్దు కావడం అఫ్ఘానిస్థాన్ జట్టుకు నిజంగా ఒక వరంలా మారింది. టోర్నమెంట్‌లో భాగంగా అఫ్ఘాన్ జట్టు తొలి మ్యాచ్‌లో జపాన్‌పై విజయం సాధించినప్పటికీ, రెండో మ్యాచ్‌లో నేపాల్ చేతిలో ఓటమి చవిచూసింది. దీంతో ఆ జట్టు తదుపరి దశకు అర్హత సాధించడం చాలా కష్టంగా మారింది. అయితే చివరి నిమిషంలో వర్షం రూపంలో వచ్చిన అదృష్టం వల్ల జపాన్‌నేపాల్ మ్యాచ్ రద్దయి, అఫ్ఘానిస్థాన్ జట్టు ఎలాంటి అడ్డంకులు లేకుండా క్వార్టర్ ఫైనల్స్‌కు అర్హత సాధించింది. ఈ అద్భుత పరిణామంతో అఫ్ఘాన్‌కు భారత్‌కు మధ్య క్వార్టర్ ఫైనల్స్‌కు కారణమైంది. నేరుగా క్వార్టర్ ఫైనల్స్‌లో ప్రవేశించిన బలమైన టీమిండియా ఇప్పుడు అఫ్ఘానిస్థాన్‌తో తలపడనుంది.




## బ్యాడ్మింటన్‌లో సింధు, ఉన్నతి, ట్రీసా-గాయత్రి, క్రాస్టో-ధ్రువ్ ఓటమి

**ఇచినోమియా సిటీ:** ఆసియా క్రీడల్లో భారత బ్యాడ్మింటన్ ప్రస్థానం ముగిసింది. మహిళల సింగిల్స్‌లో పివి సింధు, ఉన్నతి హుడా, మహిళల డబుల్స్‌లో ట్రీసా జాలీ-గాయత్రి గోపీచంద్, మిక్స్‌డ్ డబుల్స్‌లో తనిషా క్రాస్టో-ధ్రువ్ కపిల జోడీ ఓటమి చెందాయ. మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్‌లో చైనాకు చెందిన చెన్ యుఫెయ్ చేతిలో భారత్ క్రీడాకారిణి పివి సింధు 21-11, 18-21, 10-21 తేడాతో ఓటమి చెందింది. అంతకు ముందు రోజు రెండుసార్లు ఆడిన సింధు, 24 గంటల లోపే ఆదివారం ఓటమి చెందింది. టోక్యో ఒలింపిక్ ఛాంపియన్‌పై జరిగిన తొలి గేమ్‌లో భారత క్రీడాకారిణి ఆధిపత్యం చెలాయించి, దాన్ని



21-11 తేడాతో కైవసం చేసుకుంది. అంతకుముందు, ఉన్నతి హుడా జపాన్‌కు చెందిన మూడుసార్లు ప్రపంచ ఛాంపియన్ అకానె యమగుచితో పోరాడి 16-21, 21-14, 17-21 తేడాతో ఓడిపోయింది. తొలి గేమ్‌లో యమగుచి తనకు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని 21-16 తేడాతో కైవసం చేసుకుంది. రెండో గేమ్‌లో ఉన్నతి 21-14 తేడాతో విజయం సాధించినా, నిర్ణయాత్మక సెట్‌లో జపనీస్ షట్లర్ 21-17 తేడాతో గెలుపొందింది. మహిళల డబుల్స్‌లో, ప్రపంచ ఛాంపియన్‌షిప్ కాంస్య పతక విజేతలు ట్రీసా జాలీ-గాయత్రి గోపీచంద్, మలేషియాకు చెందిన ప్రపంచ నెం.5 జోడీ థినా మురళీధరన్-పెర్లీ టాన్ చేతిలో 18-21, 8-21 తేడాతో ఓడిపోయారు. మిక్స్‌డ్ బుల్స్‌లో తనిషా క్రాస్టో, ధ్రువ్ కపిల జోడీ చైనాకు చెందిన ప్రపంచ నంబర్ 1 జోడీ యాన్ జె ఫెంగ్, డాంగ్‌పింగ్ హువాంగ్‌ల చేతిలో 14-21, 21-18, 18-21 తేడాతో ఓడిపోయింది.



## స్క్వాష్‌లో అభయ్, అనాహత్‌కు డబుల్స్ రజతం

**నగోయా:** ఆసియా క్రీడలు సింగిల్స్ స్క్వాష్ ఫైనల్‌లో పురుషుల విభాగంలో అభయ్‌సింగ్, మహిళల విభాగాల్లో టీనేజ్ స్టార్ అనాహత్ సింగ్‌లు ఆదివారం రజతాలను సాధించడంతో భారత్ ఖాతాలో డబుల్స్ పతకాలు జమ అయ్యాయి. నాగోయాలో మలేషియాకు చెందిన డిఫెండింగ్ ఛాంపియన్ ఇయాన్ యోవ్ ఎన్‌జి చేతిలో 11-9, 11-5, 11-5 తేడాతో ఓడిన అభయ్‌కు రజతం దక్కింది. తొలుత అభయ్ 2-1తో స్వల్ప ఆధిక్యం సాధించగా, ఇయాన్ 4 పాయింట్లు సాధించి 6-3 ఆధిక్యంలోకి వెళ్లాడు. తర్వాత అభయ్ స్కోరును 8-8తో సమం చేసిఒక పాయింట్‌ను సాధించినా, ఇయాన్ 10-8 వద్ద రెండు పాయింట్లు సాధించి 11-9 తేడాతో తొలి గేమ్‌ను ముగించాడు. రెండో గేమ్‌లో 2-2తో సమంగా ఉండగా ఇయాన్ 7-3 ఆధిక్యంలోకి, తర్వాత 10-5 వద్ద 5 పాయింట్లుతో 2-0 ఆధిక్యం సంపాదించాడు. 4-2 ఆధిక్యంతో అభయ్ మూడవ గేమ్‌ను ప్రారంభించినా ఇయాన్ స్కోరును 4-4తో సమం చేసి 3 పాయింట్లు సాధించి 7-5 తోను, మరో 2పాయింట్లతో 9-5 ఆధిక్యాన్ని సాధించాడు. తర్వాత ఇయాన్ 10-5 వద్ద 5 పాయింట్లు సాధించి టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. మహిళల సింగిల్స్ ఫైనల్‌లో అనాహత్ మలేషియా డిఫెండింగ్ ఛాంపియన్ శివసంగరి సుబ్రమణియం చేతిలో 4-11, 4-11, 7-11 తేడాతో ఓడిపోయి రజత పతకాన్ని గెలుచుకుంది. తొలి గేమ్‌లో శివసంగరి చేతిలో 4-11 తేడాతో ఓడిపోయింది. రెండో గేమ్‌లోన అనాహత్‌ను 4 పాయింట్లకే పరిమితం చేసి 2-0 ఆధిక్యాన్ని సాధించగా, మూడవ గేమ్‌లో 11-7 తేడాతో శిసంగరి టైటిల్‌ను నిలబెట్టుకుంది.

## డ్రెస్సేజ్‌లో పతకం లేకుండా ముగిసిన ప్రచారం

**టోక్యో:** ఆదివారం జరిగిన వ్యక్తిగత డ్రెస్సేజ్ (గుర్రపు స్వారీ క్రీడ) విభాగంలో హృదయ్ ఛేడా, జై సుద్ పతకాలు సాధించలేక పోవడంతో, ఆసియా గేమ్స్ 2026లో భారత్ తన ప్రచారాన్ని పతకం లేకుండా ముగించింది. టీమ్ డ్రెస్సేజ్‌లో భారత్ అత్యంత సమీప స్థానాన్ని పొందింది, ఇక్కడ నలుగురి బృందం 201.971 పాయింట్ల సంయుక్త స్కోరుతో నాల్గవ స్థానంలో నిలిచింది. భారత్‌కు చెందిన శృతి వోరా



మ్యాగ్నానిమస్ అనే గుర్రంపై 68.059 స్కోరుతో దేశం తరఫున అగ్రస్థానంలో నిలిచారు. డోనో డి మ్యాగియోపై స్వారీ చేసిన హృదయ్ ఛేడా 67.353 స్కోరు సాధించగా, జై సుద్ 66.559 స్కోరును, గౌరవ్ పుండిర్ 65.794 స్కోరును నమోదు చేశారు.

కేవలం అత్యుత్తమ మూడు ఫలితాలను మాత్రమే పరిగణనలోకి తీసుకున్నందున, ఇదే జట్టు డ్రాప్ స్కోరుగా పరిగణించబడింది. వ్యక్తిగత డ్రెస్సేజ్ ఈవెంట్‌లో, ఫైనల్ క్వాలిఫికేషన్ యొక్క రెండవ రౌండ్‌లోనే శృతి, గౌరవ్ నిష్క్రమించారు. హృదయ్ మరియు జై మెడల్ రౌండ్‌కు చేరుకున్నారు, కానీ వరుసగా ఎనిమిది మరియు తొమ్మిదవ స్థానాలతో సరిపెట్టుకున్నారు.

ఆట



## మహిళల హాకీ: భారత్ విజయం

### 7-0తో సింగపూర్ చిత్తు

**గిఫు:** ఆదివారం గిఫు ప్రిఫెక్చురల్ గ్రీన్ స్టేడియంలో జరిగిన పూల్ బి చివరి మ్యాచ్‌లో సింగపూర్‌పై 7-0 తేడాతో ఘన విజయం సాధించడం ద్వారా భారత మహిళల హాకీ జట్టు ఆసియా గేమ్స్ 2026 గ్రూప్ దశలో తమ అజేయ పరంపరను పూర్తి చేసింది. ఈ విజయంతో భారత్ దక్షిణ కొరియాతో సెమీఫైనల్ పోరుకు సిద్ధమైంది. భారత్ ఆధిపత్యం చెలాయించి, 28 పెనాల్టీ కార్నర్‌లను సంపాదించినప్పటికీ, తొలి పావుగంటలో గోల్ కీపర్ ఫెలిస్సా లాయ్ సింగపూర్ పటిష్టంగా నిలిచింది. రెండవ క్వార్టర్‌లో కెప్టెన్ సలీమా టెటె ఫీల్డ్ గోల్‌తో ఎట్టకేలకు ప్రతిష్టంభనను అధిగమించింది. ఆ తర్వాత సునెలిత టోప్పో పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచి, మరో గోల్ జోడించి భారత్‌ను 3-0 ఆధిక్యంలోకి తీసుకువెళ్ళింది. లాల్‌రెమ్సియామి రుతుజ పిసాల్ గోల్స్‌తో భారత్ తమ ఆధిక్యాన్ని మరింత పెంచుకుని 5-0 భారీ ఆధిక్యం సాధించింది. 3వ క్వార్టర్‌లో నిక్కీ ప్రధాన్ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలచి స్కోరును 6-0కి చేర్చింది. ఆఖరి క్వార్టర్‌లో పెనాల్టీ కార్నర్ నుండి దీపిక డ్రాగ్ ఫ్లిక్‌తో 7-0 విజయాన్ని ఖాయం చేస్తూ స్కోరింగ్‌ను పూర్తి చేసింది.

## డెకాథ్లాన్‌లో తేజస్విన్‌కు కాంస్యం


### హై జంప్‌లో సర్వేశ్ రజతం

### స్టీపుల్‌చేజ్‌లో పరుల్‌కు కాంస్యం

**నాగోయా:** భారత స్టార్ అథ్లెట్ తేజస్విన్ శంకర్ ఆదివారం ఆసియా క్రీడల్లో పురుషుల డెకాథ్లాన్‌లో 7,934 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి కాంస్యం, సర్వేశ్ కుషారే పురుషుల హైజంప్‌లో రజత పతకం, పరుల్ చౌదరి మహిళల 3000 మీటర్ల స్టీపుల్‌చేజ్‌లో కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారు. అత్యంత కఠినమైన ఈ పోటీలోని చివరి ఈవెంట్ 1500 మీటర్ల పరుగులో 4:33.09 సమయాన్ని నమోదు చేసి, శంకర్ విజయంతో ముగించాడు. అలాగే కుషారే 2.25 మీటర్ల అత్యుత్తమ జంప్‌తో, చైనీస్ తైపీకి చెందిన స్వర్ణ పతక విజేత చావో హువాన్‌పుతో సమానంగా నిలిచాడు. కుషారే తన మొదటి ప్రయత్నాలలోనే 2.10మీ, 2.14మీ, 2.18 మీ, 2.22 మీటర్ల ఎత్తులను అధిగమించి ఆరంభాన్ని ఇచ్చాడు. ఇద్దరుఅథ్లెట్లు 3







ప్రయత్నాలలోనూ 2.28 మీటర్ల ఎత్తును అధిగమించడంలో విఫలమవడంతో, చావోకు స్వర్ణం, కుషారేకు రజతం లభించాయి. మహిళల 3000 మీటర్ల స్టీపుల్‌చేజ్‌లో, 1500 మీటర్ల పరుగులో నాలుగో స్థానంతో వెనుకబడిన పరుల్, 9:08.67 సమయంతో పుంజుకుని కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. ఆమె 9:06.82 సమయంలో రజతం గెలుచుకున్న కజకిస్తాన్‌కు చెందిననోరా తనుయ్‌కంటే 2.46సెకన్ల వెనుకబడి ముగించింది.

## ఇకపై ప్రిపెయిడ్ 30 రోజులకు మొబైల్ రీఛార్జి

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 27:** మొబైల్ యూజర్లకు గుడ్‌న్యూస్. ఇన్నాళ్లు 28రోజులకే ప్రీపెయిడ్ మొబైల్ రీచార్జ్ ప్లాన్స్ ఉండేవి. అయితే, ఇప్పుడు చాలా మంది ప్రజలకు ఉపయోగపడేలా టెలికాం రీచార్జ్ ఆప్షన్లలో మార్పులు వచ్చాయని రాజ్యసభ ఎంపీ రాఘవ్ చద్దా తెలిపారు. కొత్త నిబంధనల ప్రకారం 30 రోజుల వ్యాలిడిటీ ఉన్న రీచార్జ్ ప్లాన్‌లతో పాటు డేటా అవసరం లేని వారికి ప్రత్యేకంగా వాయిస్ అండ్ ఎస్ఎంఎస్ ఓన్లీ ప్లాన్స్ అందుబాటులోకి వస్తాయని చెప్పారు. దీనిని ఆయన తక్కువ బడ్జెట్ వినియోగదారుల విజయంగా అభివర్ణించారు. టెలికామ్ కన్స్యూమర్ ప్రొటెక్షన్(13వ సవరణ) రెగ్యులేషన్స్ 2026ను విడుదల చేసింది. దీని ప్రకారం టెలికాం కంపెనీలు వాయిస్, ఎస్ఎంఎస్ ఓన్లీ స్పెషల్ టారిఫ్ ఓచర్స్‌లను అందించాల్సి ఉంది. వాయిస్, ఎస్ఎంఎస్, డేటా కలిపిన రీచార్జులు ప్రతీ 30 రోజులు లేదా అంత కన్నా తక్కువ వాలిడిటీ పిరియడ్‌కు అనుగుణంగా ప్లాన్స్‌ను టెలికాం సంస్థలు అందించాల్సి ఉంటుంది. డేటా అవసరం లేని వారికి వాయిస్ మరియు ఎస్ఎంఎస్ రీచార్జ్ ప్లాన్‌లను కూడా అందించాలి. ప్రీపెయిడ్ యూజర్లు చాలా కాలంగా ఎదుర్కొంటున్న 28రోజుల రీచార్జులకు చెక్ పడినట్లే తెలుస్తోంది. దీనిపై రాఘవ్ చద్దా గతంలో పార్లమెంట్‌లో తన వాదన వినిపించారు. 28 రోజుల వ్యాలిడిటీని మంత్లీ ప్లాన్‌గా పరిగణించడం వల్ల యేడాదికి 13 సార్లు రీచార్జ్ చేయాల్సి వస్తోందని చెప్పారు. తాజా నిబంధన వల్ల 30 రోజుల రీచార్జ్ ప్లాన్స్‌తో ఇకపై యేడాదికి 13 సార్లు చేయాల్సిన రీచార్జులు 12కు తగ్గే అవకాశం ఉందని చెప్పారు. కొత్త మార్పుల్ని రాఘవ్ చద్దా స్వాగతించారు.






## పండగ సీజన్‌లో కస్టమర్లకు షాక్

### ధరలు పెరుగుతున్న టివి, ఫ్రిజ్, ఏసీలు

**ముంబయి, సెప్టెంబరు 27:** పండగ సీజన్‌కు ముందు ప్రజలకు ప్రముఖ కంపెనీలు షాక్ ఇవ్వనున్నాయి. ఎలక్ట్రానిక్స్ తయారీదారులు ఎయిర్ కండిషనర్లు, ఎల్ఇడి టివిలు, వాషింగ్ మెషీన్లు, ఇతర ఉత్పత్తుల ధరలను 5 శాతం నుంచి 8 శాతానికిపెంచనున్నారు. అక్టోబర్ 1నుంచి అమల్లోకి వస్తుంది. రాగి, ఉక్కు ధరల పెరుగుదలతో పాటు పశ్చిమ ఆసియా సంక్షోభం కారణంగా ధరలు పెంచాల్సి వస్తుందని కంపెనీలు చెబుతున్నాయి. ఈ యేడాది ధరల పెంపు ఇది మూడోసారి. తయారీదారులు రాగి, అల్యూమినియం, ఉక్కు, ముడిచమురు ఉత్పత్తు ధరల పెరుగుదల, అధిక సరుకు రవాణా ఖర్చులు కూడా ధరల సవరణకు అనివార్యమయ్యాయని కంపెనీలు వివరించాయి. ఎయిర్ కండీషనర్ ధరలు 58 శాతం పెరగనున్నాయి. వాషింగ్ మెషీన్లు, రిఫ్రిజిరేటర్లు, ఎల్ఇడి టీవీల ధరలను 34 శాతం పెంచుతున్నారని పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి. బ్లూ స్టార్, గోద్రెజ్ అప్లయన్స్, హైయర్, డైకిన్, సూపర్ ప్లాస్ట్రోనిక్స్ వంటి కంపెనీలు ఇప్పటికే 410 శాతం వరకు ధరల పెంపును ప్రకటించాయి. పానాసోనిక్ ఏదైనా పెరుగుదలను నిర్ణయించే ముందు పరిస్థితిని అంచనా వేస్తున్నట్లుతెలిపింది. హిటాచీ బ్రాండెడ్ ఎయిర్‌కండీషనర్లను కలిగి ఉన్న ఎల్‌జి, బాష్ హోమ్ కంఫర్ట్ కూడా ఎసి ధరలను దాదాపు 5 శాతం పెంచాయి. కమోడిటీ ఖర్చులు ఎక్కువగా ఉండడంతో ఇప్పటికే ఏసీలు, డీప్ ఫ్రీజర్ల ధరలు 58 శాతం మేర పెరిగాయని బ్లూ స్టార్ మేనేజింగ్ డైరెక్టర్ బి త్యాగరాజన్ చెప్పారు. గత యేడాది పండుగ సీజన్‌తో పోల్చి చూస్తే, ఖర్చులు దాదాపు 15 శాతం పెరిగాయన్నారు.

వాణిజ్యం

## భారత్ మార్కెట్లకు ఈ వారం 20 ఐపిఒలు

### ఇన్వెస్టర్లకు ఇక పండగే



**ముంబయి, సెప్టెంబరు 27:** భారత ప్రైమరీ మార్కెట్ ఇన్వెస్టర్లకు ఈ వారం సరికొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. సెప్టెంబర్ చివరి వారంలో ఏకంగా 20 కంపెనీలు తమ తొలి పబ్లిక్ ఆఫరింగ్‌ల ద్వారా దలాల్ స్ట్రీట్ నుంచి నిధులు సమీకరించేందుకు సిద్ధమయ్యాయి. ఈ సంవత్సరంలోనే ఒకే వారంలో ఇన్ని ఐపిఒలు తెరచుకోవడం ఇదే తొలిసారి. దీంతో ఈ 2026లోనే అత్యంత బిజీ వారంగా ఈ వారం నిలవనుంది. ఈ భారీ వేలంలో 4 మెయిన్ బోర్డు ఐపిఒలతో పాటు 16 ఎస్ఎంఇ ఐపిఒలు కూడా అందుబాటులోకి వస్తున్నాయి. రిటైల్ ఇన్వెస్టర్లు ఎక్కువగా ఆసక్తి చూపే మెయిన్ బోర్డ్ కేటగిరీలో ఈ వారం 4 ఐపిఒలు ప్రారంభమవుతున్నాయి. అందులో ఎస్ఆర్ఐటి కూడా ఉంది రూ.218.440 కోట్లు విలువైన బుక్ వాల్యూతో వస్తోంది. ధరల శ్రేణి రూ.123 నుంచి రూ.130 గా నిర్ణయించారు. 115 షేర్ల కనీస పెట్టుబడి రూ.14,950గా నిర్ణయించారు. 28న మొదలై 30న ముగియనుంది. షా ఇన్వెస్టర్స్ హోమ్ 28వ తేదీన ప్రారంభమయి 30వ తేదీ ముగుస్తుంది. షేరు ధరలు రూ.159-167గా నిర్ణయించారు. నిత్యాస్ జెమ్స్ అండ్ జువెలరీ 30వ తేదీ మొదలవుతోంది. అక్టోబర్ 5నముగుస్తుంది. షేరుధర రూ.70 నుంచి రూ.75గా నిర్ణయించారు. కనీస పెట్టుబడి రూ.15 వేలుగా నిర్ణయించారు. విశాల్ నిర్మితి సైతం 30వ తేదీన ప్రారంభమవుతోంది. రూ.178కోట్లు సమీకరించనుంది. అక్టోబర్ 5వ తేదీవరకు సబ్‌స్క్రిప్షన్ కొనసాగుతుంది. షేరుధరలు రూ.208నుంచి రూ.220గా నిర్ణయించారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమల కేటగిరీలో దాదాపు 16 కంపెనీలు తమ ఐపీఓ లను తీసుకువస్తున్నాయి. బ్లాక్ ఒపాల్ కన్సల్టెంట్స్, ఎవరెస్ట్ ఐఎంఎస్ టెక్నాలజీస్, వాన్స్ ఎలక్ట్రో ఇంజనీరింగ్స్, డోవ్ సాఫ్ట్, అక్మే ఇండియా ఇండస్ట్రీస్, టీఎన్‌ఎ సొల్యూషన్స్, ఎస్‌జేపి అల్ట్రాసోనిక్స్, ఎవెన్షన్స్, సోల్ ఫెగ్ స్మార్ట్ ఎలక్ట్రానిక్స్, ఒమారా వెంచర్స్ ఇండియా, పపడమల్జీ ఆగ్రో ఫుడ్స్ మొదలైనవి ఇందులో ఉన్నాయి. ఎస్ఎంఇ ఐపిఒలలో కనీస పెట్టుబడి సాధారణంగా లాట్ సైజ్ ప్రకారం రూ.2 లక్షల నుంచి రూ.2.80 లక్షల వరకు ఉంటుంది.

## ఎన్ఆర్ఐ డిపాజిట్లు 36.24 బిలియన్ డాలర్లు

**ముంబై, సెప్టెంబర్ 27:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి నాలుగు నెలల్లో నాన్‌రెసిడెంట్ ఇండియన్ (ఎన్ఆర్ఐ) డిపాజిట్ పథకాల్లోకి నిధులు భారీగా వచ్చాయి. విదేశీ కరెన్సీ డిపాజిట్లలో గణనీయమైన వృద్ధి నమోదైంది. విదేశీ కరెన్సీ నిధులను ఆకర్షించేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ ప్రత్యేక విధాన చర్యలు తీసుకోవడం ఇందుకు ప్రధాన కారణంగా నిలిచింది. ఆంబిఐ గణాంకాల ప్రకారం, ఈ యేడాది ఏప్రిల్-జూలై కాలంలో ఎన్ఆర్ఐ డిపాజిట్ పథకాల్లోకి నికర నిధులు యేడాది ప్రాతిపదికన 678.2 శాతం పెరిగి 36.24 బిలియన్ డాలర్లకు చేరింది. గత యేడాది ఇదే కాలంలో ఈ మొత్తం 4.66 బిలియన్ డాలర్లుగా ఉంది. ఈ భారీ వృద్ధికి ప్రధానంగా ఫారెన్ కరెన్సీ నాన్‌రెసిడెంట్ (బ్యాంక్) లేదా ఎఫ్‌సీఎన్ఆర్(బి) డిపాజిట్లు కారణమయ్యాయి. విదేశీ కరెన్సీ నిధులను ఆకర్షించేందుకు ఆర్‌బిఐ జూన్‌లో రాయితీతో కూడిన స్వాప్ సదుపాయాన్ని ప్రవేశపెట్టింది. ఈ చర్య ద్వారా ఆగస్టు 31 నాటికి సుమారు 133 బిలియన్ డాలర్ల నిధులు సమీకరించారు. ఎఫ్‌సీఎన్ఆర్(బి) ఖాతాల్లోకి నిధుల ప్రవాహం గణనీయంగా పెరిగింది. ఏప్రిల్‌జూలై కాలంలో ఎఫ్‌సీఎన్ఆర్(బి) డిపాజిట్లలోకి వచ్చిన నిధులు 34.53 బిలియన్ డాలర్లకు చేరాయి. గత యేడాది ఇదే కాలంలో ఇవి కేవలం 772 మిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఈ పెరుగుదల నేపథ్యంలో జూలై 2026 చివరి నాటికి ఎఫ్‌సీఎన్ఆర్(బి) ఖాతాల్లోని మొత్తం బకాయిడిపాజిట్లు 68.28 బిలియన్ డాలర్లకు చేరాయి. ఎఫ్‌సీఎన్ఆర్(బి) ఖాతాలద్వారా ఎన్ఆర్ఐలు ఒకటి నుంచి ఐదేళ్ల కాలపరిమితితో స్వేచ్ఛగా మార్చుకోగల విదేశీ కరెన్సీల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేసుకోవచ్చు. డిపాజిట్ కాలంలో మారకపు విలువల్లో వచ్చే హెచ్చుతగ్గుల నుంచి ఇవి రక్షణ కల్పిస్తాయి. జూలై 2026 నాటికి దేశంలోని మొత్తం ఎన్ఆర్ఐ డిపాజిట్లు 200.89 బిలియన్ డాలర్లకు పెరిగాయి. జూలై 2025లో ఇవి 167.86 బిలియన్ డాలర్లు కాగా, జూన్ 2026లో 168.51 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఏప్రిల్‌జూలై కాలంలో ఎన్ఆర్ఓ ఖాతాల్లోకి వచ్చిన నిధులు 1.51 బిలియన్ డాలర్లకు పెరిగాయి. గత యేడాది ఇదే కాలంలో ఇవి 1.47 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి.






Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.